ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-4-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 71 పేజీలు: 12 వెల: 8.00

సముద్ర తీరంలో 61 రోజులు చేపల వేట నిషేధం 2లో

ఐడియా ఇవ్వండి: రూ.25 కోట్లు పట్టుకెళ్లండి: నాసా 5లో

# సేవల్లో 100% నాణ్యత



## ప్రజలు సంతృప్తి చెందేలా కార్యక్రమాలు
### వర్చువల్ సమావేశంలో సీఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంచడం, ప్రజలు సంతృప్తి చెందేలా కార్యక్రమాలు అమలుచేయడంపై అన్ని స్థాయిల్లో దృష్టిపెట్టాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో 100 శాతం నాణ్యత కనిపించాలని, లబ్ధిదారుల నుంచి పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం కావాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యక్రమాల నిర్వహణపై ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా కీలకాదేశాలు జారీ చేసారు. ప్రతివారం నాలుగుశాఖల చొప్పున 16 శాఖలపై పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అధ్యయనం చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పదేపదే ఫిర్యాదులు వస్తున్న విభాగాల్లో బాధ్యులను గుర్తించి మార్పు వచ్చేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నా ఇంకా రెవెన్యూ, ఆర్థికంశాలు, రహదారులపైన వస్తున్న సమస్యలను గమనించాలన్నారు. ప్రతి పిర్యాదును నిశితంగా పరిశీలించాలన్నారు. రెవెన్యూ సేవల్లో మార్పు కనిపించాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ విభాగంలో మార్పు చూపిస్తే ప్రజల్లో సానుకూలత వ్యక్తం అవుతుందని, ఆ మేరకు అధికారులు పనిచేయాలని సీఎం అన్నారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి దేవాలయాల్లో దర్శనం, వసతులు, పరిశుభ్రత, వంటి వివిధ అంశాలపై భక్తుల అభిప్రాయాలను కూడా ప్రభుత్వం తెలుసుకుంది. దర్శనం మీరు భావించిన సమయంలో జరిగిందా అన్న ప్రశ్నకు 70 శాతం మంది అవును అని, దేవాలయాల్లో మౌలిక వసతుల, తాగునీరు, వాష్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, రవాణా సౌకర్యాలపై 63 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసాదం తాజాగా, రుచిగా ఉందా అన్న ప్రశ్నకు 81శాతం మంది అవును అని సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేవాలయాల్లో భక్తులపట్ల మర్యాదగా, సౌమ్యంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. దేవాలయాల్లో దేవుని సేవకు వాలంటీర్ల విధానాన్ని అమలు చేయాలని క్యూలైన్ల నిర్వహణతో పాలు పలు సేవల్లో పనిచేసేందుకు వాలంటీర్లు సిద్ధంగా ఉంటారని, స్వచ్ఛందంగా వచ్చే వారిని సేవలకు ఉపయోగించుకోవాలని సూచించారు. దేవుని సేవలో పనిచేసేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తారు వారికి సరైన శిక్షణ, అవగాహన కల్పించి దేవాలయ సేవలకు వినియోగించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహా పూజలు, జాతరలు జరుగుతాయని. వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సీఎం అన్నారు. రాష్ట్రంలో వర్క్ ఫ్రంహోంను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్క్ ఫ్రం హోంతో పాటు నైబర్ హుడ్ వర్కింగ్, కో వర్కింగ్ విధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇంటి నుంచే పని విధానంలో వసతులు, అవకాశాలు కల్పించడం, శిక్షణ అందించడం ద్వారా పెద్ద ఎత్తున అవకాశలు సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇందులో భాగంగా ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వర్క్ ఫ్రం హోంపై సర్వే నిర్వహిస్తున్నారు. 2.68 కోట్ల మందిని సర్వే చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 82.06 లక్షల మందిని సర్వే చేశారు. వీరిలో 1.72 లక్షల మంది వర్క్ ఫ్రంహోం విధానంలో పని చేస్తున్నట్లు వివరించారు. వర్క్ ఫ్రం హోం విధానంలో పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నా..తమకు తగిన అవకాశాలు లేవని...అటువంటి ఉపాధి కల్పిస్తే తాము కూడా వర్క్ ఫ్రంహోం విధానంలో పనిచేస్తామని 20.43 లక్షల మంది తెలిపారు. సర్వేచేసిన వారిలో ఇంటర్ కంటే తక్కువ చదివిన వారు 9.05లక్షల మంది ఉండగా, డిప్లొమా, ఆపై చదువులు చదివిన వారు 10.73 లక్షల మంది ఉన్నారు. ఆయా గ్రామాల్లో >>2

# ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా



### ఇంటర్ ప్రథమ సంవత్సరం 85% ఉత్తీర్ణతతో కృష్ణాజిల్లాకు మొదటి స్థానం, 54% ఉత్తీర్ణతతో చిత్తూరుకు చివరి స్థానం
### ఇంటర్ ద్వితీయ సంవత్సరం 93%తో కృష్ణాజిల్లాకు ప్రథమ స్థానం, 73% ఉత్తీర్ణతతో ఆఖరి స్థానంలో అల్లూరి జిల్లా, మే 12న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు, ఫలితాలను విడుదల చేసిన మంత్రి లోకేష్

**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. మొదటి సంవత్సరంలో 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, రెండో సంవత్సరంలో 83 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. మార్చి ఒకటి నుంచి 19వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 10,58,893 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 500,963 మంది, ఒకేషనల్ 44,581 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్ 4,71,021మంది, ఒకేషనల్ 44,581 మంది ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,535 పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్‌బోర్డు ఏర్పాటు చేసింది. ఇంటర్ తొలిఏడాది ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. 82శాతం ఉత్తీర్ణతతో గుంటూరు జిల్లాకు రెండో స్థానం, 81శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్ జిల్లాకు మూడోస్థానం, 54శాతం ఉత్తీర్ణతతో చిత్తూరు జిల్లాకు ఆఖరిస్థానం దక్కాయి. ఇంటర్ రెండో ఏడాది ఫలితాల్లో 93శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా అగ్రస్థానంలో ఉండగా, 91 శాతం ఉత్తీర్ణతతో గుంటూరు జిల్లాకు రెండోస్థానం, 89 శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్ జిల్లాకు మూడోస్థానం, 73 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి జిల్లాకు ఆఖరిస్థానంలో ఉన్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో బాలికలు 71 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 64 శాతం ఉత్తీర్ణత పొందారు. అలాగే ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 81శాతంతో బాలికలు ఉత్తీర్ణత పొందగా.. బాలురు 75శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలి తాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉదయం 11 గంటలకు విడుదల చేసారు. వాట్సాప్ ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను ద్వారా తెలుసుకోవచ్చునని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. తొలిసారి వాట్సాప్ ద్వారా ఫలితాలు విద్యార్థులకు అందించే ఏర్పాట్లను ఇంటర్మీడియట్ బోర్డు చేసింది. ఇంటర్ ఫలితాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. లేదంటే వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చు. మనమిత్ర వాట్సప్ నంబర్ 9552300009కు హాయ్ మెసేజ్‌చేసి ఫలితాలు నిమిషాల్లోనే పీడీఎఫ్ రూపంలో ఫలితాలు వస్తున్నాయి. ఈ ఏడాది ఇంటర్మీడియ్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 10,17,102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గతంలో ఫలితాలను వెల్లడించేందుకు ప్రత్యేక కార్యక్రమం, హడావుడి చేయడం వల్ల కొన్నిసార్లు అనుకున్న సమయం కన్నా ఆలస్యంగా విడుదలైన సందర్భాలు >>2

# రూ.1510 కోట్ల జిఎస్టీ ఎగవేత
### ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్

**విజయవాడ ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో 2024-25లో రూ.1510 కోట్ల మేర సెంట్రల్ జీఎస్టీని ఎగవేసినట్లు గుర్తించామని గుంటూరు సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన మీడియాకు విడుదల చేసింది. ఏపీలో సీజీఎస్టీని కట్టేవారు. 1.81 లక్షల మంది ఉండగా రాష్ట్ర జీఎస్టీ చెల్లింపుదారులు 2 లక్షల మందికిపైగా ఉన్నారని వివరించారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కేంద్ర అంచనా ప్రకారం 30 శాతం మేర పన్ను ఎగవేతలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని అరికట్టేందుకు ఇన్వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలులోకి తెచ్చామన్నారు. సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికవరీ రూ.71కోట్లుకాగా 2024-25లో రూ.150 కోట్లకు పైగా వచ్చిందన్నారు. రెండు లక్షల యూనిట్లు ఉంటే, కేవలం 902 యూనిట్లలోనే ఆడిట్ జరిగిందని, ఇకపై ఏఐ ద్వారా యూనిట్లను గుర్తించి ఆడిట్ చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ మా కార్యాలయం పేరు. >>2

# 3నెలల్లో నిర్ణయం తెలపాలి
### రాష్ట్రపతికి సుప్రీం ధర్మాసనం డెడ్‌లైన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్లు పంపే బిల్లులను ఉద్దేశించి సుప్రీంకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి 3నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. బిల్లుల గడువును నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు ఈ తరహా తీర్పునివ్వడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించకుండా నెలల తరబడి తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఏప్రిల్ 8న స్పష్టంచేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పులో కీలకమైన అంశాలను పొందుపరిచింది. 415 పేజీలున్న తీర్పు ప్రతిని శుక్రవారం రాత్రి సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆ తీర్పులో జస్టిస్ జేపీ పార్దీవాలా, జస్టిస్ ఆర్‌జె మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం కీలక సూచనలు చేసింది. పరిశీలన కోసం గవర్నర్లు పంపిన బిల్లులపై 3 నెలల్లోపే రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఒక వేళ మూడు నెలల వ్యవధి దాటి ఏదైనా ఆలస్యం జరిగితే అందుకు గల కారణాలను సంబంధిత రాష్ట్రాలకు తెలపాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. రాష్ట్రాలు సైతం గవర్నర్లు, రాష్ట్రపతికి సహకరించాలని, బిల్లులపై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సూచించింది.



రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా నిలిపి ఉంచితే వారి చర్యలపై న్యాయసమీక్షకు అవకాశం ఉందని ధర్మాసనం తెలిపింది. బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సి వస్తే గవర్నర్లు తీసుకోవాల్సిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని ధర్మాసనం స్పష్టం చేసింది. మంత్రి మండలి సిఫార్సు లేకుండా బిల్లును గవర్నర్ ఆమోదించకుండా నిలిపేస్తే ఆ బిల్లును 3 నెలల్లోగా శాసనసభకు తిరిగి పంపాలని సూచించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులకు ఆమోదం తెలపడానికి గవర్నర్లకు నిర్దిష్ట కాలపరిమితి లేదని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే స్పష్టమైన కాలపరిమితి లేదని రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించడానికి కూడా వీలు లేదని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పు ప్రతిని అన్ని రాష్ట్రాల హైకోర్టులకు, ప్రధాన కార్యదర్శులకు పంపించాలని సుప్రీం కోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. సుప్రీం ఇచ్చిన ఈ తీర్పుపై నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న 10 చట్టాలను నోటిపై చేసి గెజిట్ నొటిఫికేషన్ జారీ చేసింది. రాజ్యాంగ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను తమిళనాడు ప్రభుత్వం గవర్నర్ ఆర్ఎన్ రవికి పంపించింది. అయితే వాటిపై ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వాటిని తనవద్దే ఉంచేసుకుంటున్నారని ప్రభుత్వం ఆరోపణలు గుప్పించింది. అనంతరం ఇదే విషయంపై 2023లో సుప్రీంకోర్టు పిటిషన్ దాఖలుచేసింది. బిల్లుల్ని సమ్మతించకపోవడం, పునఃపరిశీలించాలని సూచిస్తూ వెనక్కి కూడా పంపడం లేదని సుప్రీంకు తమిళనాడు నివేదించింది. తిరిగి వచ్చిన బిల్లులను రెండోసారి ఆమోదించినా ఆయన తీరు మారలేదంటూ పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఇటీవల సంచనలన తీర్పు ఇచ్చింది.

## గవర్నర్ వద్దపెండింగ్ బిల్లులు చట్టాలుగా నోటీపై..
దేశ చరిత్రలో తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం 2లో

# బాధ్యతతో పనిచేస్తే పారిశుద్ధ్య సమస్యలుండవు
### మంత్రి పి.నారాయణ



**విజయవాడ.ఏప్రిల్12,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారులు,సిబ్బంది బాధ్యతగా వ్యవహరిస్తేనే పారిశుద్ధ్యలేమి అనే పరిస్థితి రాదని ఏపీ పురపాలక,పట్టణాభివృద్ధి శాఖమంత్రి పి.నారాయణ అన్నారు. నగరాలు,పట్టణాల్లో పారిశుద్ధ సమస్యలుండ కూడదన్నారు. స్వచ్ఛమైన వాతావరణం ఉండాలన్నారు. ఏపీలోని మున్సిపల్ కమిషనర్లతో శనివారం మంత్రి పొంగూరు నారాయణ అనుహ్యంగా తెల్లవారుతుండగానే టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, రీజినల్ డైరెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్లు ఉదయం 6 గంటల నుంచే కచ్చితంగా క్షేత్రస్థాయి పర్యటన చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి నారాయణ అన్నారు. డ్రైయిన్లు పూడిక తీత వెంటనే ప్రారంభించాలని మంత్రి నారాయణ ఆదేశించారు. తాను కూడా మున్సిపాలిటీల్లో ఉదయమే ఆకస్మిక తనిఖీలు చేస్తానని స్పష్టం చేశారు. మెరుగైన పారిశుధ్యం కోసం అవసరమైన స్వీపింగ్ మెషీన్లు, ఇతర యంత్రాలను కొత్తగా కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఆరోగ్య కారణాలతో క్షేత్ర స్థాయి పర్యటన చేయలేని అధికారులకు డైరెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు అప్పగిస్తామని అన్నారు. మున్సిపల్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేయాల్సిన బాధ్యతఉందని మంత్రి నారాయణ >>2



శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్

# ప్రమాదం వల్లే ప్రవీణ్ మృతి
### మద్యం తాగి వాహనం నడిపాడు: ఐజి అశోక్ కుమార్

**ఉమ్మడితూర్పుగోదావరిజిల్లా బ్యూరో,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** ప్రముఖ క్రైస్తవ మత ప్రచారకుడు పగడాల ప్రవీణ్ కుమార్ బుల్లెట్ మోటారు సైకిల్ ప్రమాదం వలన మరణించారని ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్ తెలిపారు. అధికంగా మద్యం సేవించి వేగంగా వాహనం నడపడంతో ప్రమాదం జరిగిందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నర్సింహా కిషోర్ ఆధ్వర్యంలో ఐజీ అశోక్ కుమార్ శనివారం విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి ప్రవీణ్ కుమార్ మరణంపై దర్యాప్తు వివరించారు. గత నెల 25వ తేదీన రాజమహేంద్రవరం కొంతమూరు జాతీయ రహదారి పెట్రోల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇది ప్రమాదం కాదు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారని రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ సంఘాలు ఆందోళన ధర్నాలు సోషల్ మీడియాలో కథనాలతో తీవ్ర సంచలనమైంది. ఇవి అన్నీ ఆధారం లేని ఆరోపణలు నమ్మవద్దు అని ప్రవీణ్ కుమార్ ప్రమాదంలో మృతి చెందారు అంటూ ఐజి చెప్పారు. ప్రమాదం జరుగు ముందు రోజు హైదరాబాద్ నుండి రాజమహేంద్రవరం బుల్లెట్ పై ప్రవీణ్ కుమార్ బయలుదేరారు.

మద్యం సేవించి ఉండడంతో కోదాడ దగ్గర ఆర్టీసీ బస్సు తప్పించబోయి ప్రమాదం జరగడంతో అంబులెన్స్ లో సిబ్బంది వచ్చినా చికిత్స చేయించుకోలేదన్నారు. ఇక్కడే మోటారు సైకిల్ హెడ్ లైన్ పగిలిపోయి కేవలం కుడివైపు ఉన్న సిగ్నల్ లైట్ మాత్రం పని చేస్తుందన్నారు. మళ్ళీ విజయవాడ సమీపంలో రామవ్పాడు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఎస్ఐ సుబ్బారావుకు అలసటగా కనపడడంతో రెస్ట్ తీసుకోమని చెప్పినా పట్టించుకోకుండా వెళ్లిపోయారని చెప్పారు. కోదడలో మద్యం దుకాణంలో బ్రాందీ >>2

## విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి 6 వరుసలుగా విస్తరణ

**విజయవాడ ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఎఐ కార్యాచరణ ప్రారంభించింది. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు జాతీయ రహదారి 63కి.మీ మేర ప్రస్తుతమున్న నాలుగు వరుసల మార్గాన్ని ఆరు వరుసలుగా విస్తరిస్తారు. మచిలీపట్నం వద్ద ఒంగోలు-కత్తిపూడి జాతీయ రహదారి రెండు వరుసలుతో ఉంది. ఇందులో మాచవరం రైస్‌మిల్లు వరకు 4 కి.మీ నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. మాచవరం రైస్‌మి ల్లు వద్ద నుంచి పోర్టుకు 3.7 కి.మీ లను నాలుగు వరుసలతో కొత్తగా రహదారిని నిర్మిస్తారు. వీటిలో ఆరు వరుసలుగా విస్తరించనున్న 44కి.మీలతో పాటు 3.7 కి.మీ మేర నాలుగు వరుసల హైవే నిర్మాణాన్ని ఎన్‌హెచ్‌ఏఐ చేపడుతుంది. ఒంగోలు-కత్తిపూడి హైవేలో 4కి.మీ మేర విస్తరించే పనులను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ పర్యవేక్షిస్తుంది. జాతీయ రహదారులను నౌకాశ్రయాలకు అనుసంధానం చేసే ప్రాజెక్టులో భాగంగా ఈ రహదారిని మచిలీపట్నం పోర్టు వరకూ విస్తరిస్తారు. ఇందుకోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేస్తున్నారు. హైవే నుంచి పోర్టు కనెక్టివిటీకి ఎన్‌హెచ్‌ఏఐ ప్రాధాన్యం >>2

## ప్రకృతి ప్రేమికుడు పద్మశ్రీ
# 'వనజీవి' ఇకలేరు
### గుండెపోటుతో మృతి



వనజీవి రామయ్య(ఫైల్)

### ప్రధాని మోడీ, సిఎంలు రేవంత్ రెడ్డి,చంద్రబాబు నాయుడు, మాజీ సిఎంలు జగన్, కెసిఆర్‌ల సంతాపం
### కోటికి పైగా మొక్కలు నాటి, దేశానికే ఆదర్శం

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షకులు. మొక్కలు నాటటానికి మించి మరో ప్రత్యామ్నాయం ఈజగతిలో లేదని చాటి చెప్పిన ప్రకృతి ప్రేమికుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత దరిపల్లి అనంత రామయ్య(85) అస్తమించారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో శనివారం తెల్లవారుఝామున గుండె పోటుతో కన్నుమూశారు. తన కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కోటికి పైగా మొక్కలు నాటి, జీవకోటికి ప్రాణ వాయువుగా నిలిచి తన ఇంటి పేరునే వనజీవిగా మార్చుకుని ఎంతోమంది ప్రకృతి ప్రేమికులకు ప్రేరణగా నిలిచిన రామయ్యకు 2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 2005లో సెంటర్‌ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ వనమిత్ర అవార్డుతో గౌవరవించింది. 'యూనివర్సల్ గ్లోబల్ పీస్' అనే అంతర్జాతీయ సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. 1995లో భారత ప్రభుత్వం నుంచి 'వనసేవా' అవార్డును సైతం సొంతం చేసుకున్నారు పద్మశ్రీ వనజీవి రామయ్య.

**పద్మశ్రీ రామయ్య కుటుంబ నేపథ్యం:** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వనజీవి రామయ్య జూలై 1వ తేదీ 1937లో లాలయ్య పుల్లమ్మ దంపతులకు జన్మించారు. అసలు పేరు దరిపల్లి రామయ్య కాగా మొక్కలు నాటడమే జీవిత ఆశయంగా మలుచుకుని కోట్ల మొక్కలు >>2



## రాజ్యాంగం మారుస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
### బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి

**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్తప్రతినిధి:** అంబేద్కర్ రాజ్యాంగం మారుస్తారని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగంలో ఎక్కువసార్లు సవరణలు జరిగాయని చెప్పారు. ముస్లింల ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని స్వార్థంతో కాంగ్రెస్ నేతలు మోదీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో (శనివారం అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. బీజేపీ రాజ్యాంగంలో 22 సవరణలు చేసినా అది వివిధ వర్గాల అభ్యున్నతికి చేసినవేనని తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఈ నిర్ణయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురంధేశ్వరి మీడియాతో మాట్లాడారు. ఈనెల 14వతేదీన అంబేద్కర్ జయంతి >>2



శనివారం ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు నివాళి అర్పిస్తున్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే

## దుమ్ముతుపానుతో విమాన రాకపోకలకు ఆటంకం

### 15 విమానాలు దారిమళ్లించిన ఎయిర్‌పోర్టు అధికారులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఢిల్లీ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది ప్రయాణీకులకు దీనివల్లఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో దుమ్ముతుపానుతోపాటు ఒక మోస్తరు వర్షంకూడా కురిసింది. ముందురోజుసాయంత్రం అయితే బలమైన ఈదురుగాలులు వీచాయి. దీనికారణంగా కొన్నిచోట్ల చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. ఈక్రమంలోనే బలమైన ఈదురుగాలులు వీచడంతో దాదాపు 15 కొమ్మలు విరిగిపడ్డాయి. ఈ క్రమంలోనే 15 విమానాలను దారిమళ్లించామని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఎయిరిండియా, ఇండిగో విమానయాన సంస్థలు తమ ప్రయాణీకులకు సూచనలు కూడా జారీచేసాయి. అయితే ప్రయాణీకులు మాత్రం సుమారు 12 గంటలుగా విమానాశ్రయంలోనే పడిగాపులు కాచారు. ముంబయికి వెళ్లేందుకు ఢిల్లీ ఎయిర్‌పోర్టుకువచ్చామని, ఉదయం 12 గంటలకు బుక్‌చేసుకన్న విమానం కాకుండా మరోటి ఎక్కాలని అధికారులు సూచించారని చెప్పారు. అదికాస్త ఎక్కిన తర్వాత అందులోనే నాలుగు గంటలపాటు కూర్చోబెట్టి తర్వాత దింపేశారన్నారు. ఇక పలువురుప్రయాణీకులు ఎక్స్‌వేదికగా ఆవేదనను వ్యక్తంచేసారు. అంతర్జాతీయ విమానాశ్రయం అయి ఉండి సరైన సమాచారం ఇవ్వక పోవడంపై ఒకప్రయాణీకుడు ఆగ్రహం వ్యక్తంచేసాడు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్: ముగ్గురు మావోయిస్టులు మృతి

### మృతుల్లో మట్వాడ ఏరియా కమిటీ మెంబర్ పూనెం అనిల్ మృతి

**చర్ల, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నది అటవీ ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మట్వాడ ఎల్‌వోఎస్ కమాండర్ ఏరియా కమిటీ మెంబర్ పూనెం అనిల్ మృతిచెందారు. మరో ఇద్దరి మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో 12 బోర్ రైఫిల్ యొక్క ముక్కలు, సింగిల్ షాట్ రైఫిల్స్, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌పై బీజాపూర్ జిల్లా ఎస్పీ డా.జితేందర్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ... ఇంద్రావతి నది అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల సమాచారం మేరకు బీజాపూర్ డీఆర్‌జీ, దంతెవాడ ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో అంబెలి పేలుడుసూత్రదారి పూనెం అనిల్ మృతిచెందాడని తెలిపారు. ఇతనిపై రూ.5 లక్షల రివార్డు ఉందన్నారు. 2025 సంవత్సరంలో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో 86 మంది హార్డ్‌కోర్ మావోయిస్టులు మృతిచెందారని, వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో 173 మందిని అరెస్టు చేశామని, మరో 179 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారన్నారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఘటన ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు.

## సొంతగడ్డపై పంజావిసిరిన సన్‌రైజర్స్

## ఆరుపరుగుల తేడాతో పంజాబ్‌కింగ్స్ ఓటమి




**హైదరాబాద్,ఏప్రిల్ 12:** ఐపిఎల్ 2025లో వరుసగా నాలుగు మ్యాచ్‌లో ఓడి డీలాపడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పడిలేచిన కెరటంలా విజృంభించింది. శనివారంఉప్పల్ వేదికగాపంజాబ్‌కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘనవిజయం సాధించింది. పంజాబ్‌కింగ్స్ నిర్దేశించిన 246 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి ఔరా అనిపించింది. ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్‌శర్మ పెనువిధ్వంసం సృష్టించాడు. 40 బంతుల్లోనే సెంచరీచేసి జట్టు విజయానికి బాటలువేసాడు. భారీ సెంచరీతో జట్టుకు విజయం సమకూర్చాడు. టాస్ గెలిచిన పంజాబ్‌కింగ్స్ శ్రేయస్ అయ్యర్ ఫస్ట్ బ్యాటింగ్‌కు మొగ్గుచూపించాడు. ప్రియాన్ష్‌ఆర్య మరోసారి మెరుపుబ్యాటింగ్‌చేసాడు. 13 బంతుల్లో 36 పరుగులుచేసాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ అయ్యర్ 22 బంతుల్లోనే అర్థసెంచరీచేసాడు. తర్వాత అదేజోరుకొనసాగించి 36 బంతుల్లో 82 పరుగులుచేసాడు. చివరిలో మార్కస్ స్టొయినిస్ 11 బంతుల్లో 34పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. దీనితో పంజాబ్‌కింగ్స్ 245/6 స్కోరుతో ఆరెంజ్ ఆర్మీకి భారీ లక్ష్యం వచ్చింది. ఆ తర్వాత భారీ లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఓపెనర్లుశుభారంభం అందించారు. కేవలం 74 బంతుల్లో 171 పరుగులుజోడించారు. ట్రావిస్ హెడ్ 37 బంతుల్లో 66 పరుగులుచేసి తొలివికెట్‌రూపంలో క్రీజును వీడాడు. అయితే గ్రౌండ్‌లోకి వచ్చినప్పటినుంచి ఎటాకింగ్‌గేమ్‌తో అదరగొట్టిన అభిషేక్‌శర్మ 19 బంతుల్లో అర్థసెంచరీచేసాడు. 40 బంతుల్లోనే సెంచరీచేసాడు. ఓవరాల్‌గా 55 బంతుల్లో 14 పరుగులుచేసి ఔట్ అయ్యాడు. చివరిలో హెన్రిచ్‌క్లాసెన్ 14 బంతుల్లో 21పరుగులుచేస్తే ఇషాన్‌కిషన్ ఆరు బంతుల్లో తొమ్మిదిపరుగులుచేసి లాంఛనంపూర్తిచేసారు. దీనితో మరో 9బంతులు మిగిలి ఉండగానే సన్‌రైజర్స్ ఘనవిజయం సాధించింది. దీనితోఐపిఎల్ చరిత్రలో రెండో అత్యధిక విజయవంతమైన ఛేదనను పూర్తిచేసింది. ఈ జాబితాలో పంజాబ్‌కింగ్స్ అగ్రస్థానంలో ఉంది. గడచిన సీజన్‌లో కోల్‌కత్తానైట్‌రైడర్స్ మ్యాచ్‌లో పంజాబ్ 262 పరుగులుఛేజ్‌చేసింది. మూడోస్థానంలో రాజస్థాన్ రాయల్స్ ఉంది. ఆ జట్టు పంజాబ్‌కింగ్స్‌పై ఓసారి కోల్‌కత్తా నైట్‌రైడర్స్‌పై ఓసారి 224 పరుగులు ఛేదించింది.

## భారతీయులకు 85 వేల వీసాలు జారీచేసిన చైనా

### భారత స్నేహితులకు స్వాగతం అంటూ డ్రాగన్ రాయబారి పోస్ట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** సరిహద్దులపరంగా రెండుదేశాలమధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నా దౌత్యపరంగా మాత్రం ఆదేశం భారత్‌నుంచి ఎక్కువమందినే ఆకర్షిస్తోంది. అదే చైనా ప్రభుత్వం తన వీసాల జారీని భారత్‌కు సడలింపులు ఇచ్చింది. విదేశీ పర్యటకులు అందులోనూ భారత్‌నుంచి వచ్చేవారికోసం మరిన్ని వీసాలుజారీచేసింది. ఇందులోభాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 9వరకూ 85 వేల వీసాలు జారీచేసింది. మనదేశంలోచైనా రాయబారి జుఫీహాంగ్ ఈ సమాచారం వెల్లడించారు. భారత్‌లోని చైనా ఎంబసీ, కాన్సులేట్లు ఈఏడాది ఏప్రిల్ 9వరకూ భారతీయులకు 85 వేలకుపైగా వీసాలు జారీచేసాయి. చైనాను సందర్శించడానికి మరింతమంది భారత స్నేహితులకు స్వాగతం సురక్షిత, స్నేహపూర్వక స్ఫూర్తివంతమైన చైనాను అన్వేషించండి అని ఫీహాంగ్ ఎక్స్‌వేదికగా పోస్టుచేసారు. మార్చిలో కూడా ఒక పోస్టుపెట్టిన ఫీహాంగ్ 50 వేల వీసాలు ఇచ్చామన్నారు. వీసాధరలపై తగ్గింపును డ్రాగన్‌దేశం మరో ఏడాది పొడిగించింది. 2025డిసెంబరు 31వరకూ వీసాఫీజుల తగ్గింపు కొనసాగుతుందని వెల్లడించింది. సింగిల్ ఎంట్రీ వీసాలకు రూ.2900, డబుల్ ఎంట్రీ వీసాలకు 4400 వసూలుచేస్తున్నారు. ఆరునెలలు గడువు ఉండే మల్టిపుల్ ఎంట్రీ వీసాకు రూ.5900, సంవత్సరం అంతకంటే పైబడి గడువు ఉండే మల్టీ ఎంట్రీ వీసా రూ.8800 చెల్లించాలి. వాస్తవాధీన రేఖవెంబడి ఉన్న ఉద్రిక్తతలను తగ్గించుకనేందుకు చైనా ప్రాధాన్యతనిస్తోంది. 2020లో గస్తీనిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లవచ్చని ఇటీవల భారత ఆర్థికవృద్ధి ఆమోఘం అంటూ చైనా కాన్సులర్ జనరల్‌జువీ కొనియాడారు. హిందీచినీభాయ్‌భాయ్ అంటూ భారత్‌సాధించిన విజయాలుప్రస్తావించారు. అలాగే అమెరికా ప్రతీకార సుంకాల సమయంలో చైనాఅధ్యక్షుడు జిన్‌పింగ్‌భారత్‌కు స్నేహహస్తం చూపించారు. భారత్‌తోకలిసి ఉమ్మడి భవిష్యత్తు లక్ష్యంగాపనిచేసే సమాజం నిర్మించాలని ఆశిస్తున్నట్లు ప్రకటించారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

>> ఉన్నాయి. అయితే ఈ సంవత్సరం ఎటువంటి హడావుడి లేకుండా సరిగ్గా చెప్పిన సమయానికి ఫలితాలను విడుదల చేశారు. వాట్సాప్‌లో 9552300009 నెంబర్‌కు హాయ్ అని సందేశం పంపిన తరువాత లిప్తకాలం పాటు వేచి చూసి, హాల్ టికెట్ నెంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు నమోదు చేయాలి. ఆ వెంటనే అభ్యర్థిఫలితాలు పొందవచ్చునని తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. మొదటి సంవత్సరం విద్యార్థులకు 70, రెండో సంవత్సరం విద్యార్థులకు 83 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలలో మెరుగుదల ప్రత్యేకంగా కనిపించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో రెండో సంవత్సరం ఉత్తీర్ణత శాతం 69 గా నమోదు కాగా, ఇది గత 10 ఏళ్లలో అత్యధికం కావడం విశేషం. మొదటి సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 47 గా ఉంది, ఇది గత పదేళ్లలో రెండవ అత్యధిక శాతం. ఈ విజయానికి విద్యార్థులు, జూనియర్ అధ్యాపకులు, విద్యా పురోగతికి కృషి చేసిన ప్రతి ఒక్కరి కఠినమైన శ్రమే కారణమని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఇంటర్మీడియట్ రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ తేదీలను బోర్డు ప్రకటించింది. ఈనెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులు అప్లై చేసుకోవచ్చు. అదే విధంగా ఫెయిలైన విద్యార్థుల కోసం థియరీ సప్లిమెంటరీ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ సప్లిమెంటరీ పరీక్షలను వచ్చే నెల 28వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు జిల్లా కేంద్రాలలో మాత్రమే నిర్వహిస్తామని ప్రకటించారు. సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు. ఏప్రిల్ 22 వరకు చివరి తేదీగా ప్రకటించింది. అలాగే సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగనున్నాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు ఎలాంటి ఆందోళన పడకుండా సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని అధికారులు కోరుతున్నారు.

## సేవల్లో 100% నాణ్యత

>> వర్క్ ఫ్రం హోం సెంటర్లు, పని స్టేషన్ సెంటర్‌ల ఏర్పాటుకు ఉన్న భవనాలపైనా సర్వే నిర్వహిస్తున్నారు. విద్యార్హతలు ఉండి, పని చేసే సామర్థ్యం ఉన్నవారికి ట్రైనింగ్ ఇవ్వడం ద్వారా ఇంటి వద్ద నుంచి పనిచేసే అవకాశాలు కల్పించేందుకు ఆయా సంస్థలతో మాట్లాడాలని సీఎం అధికారులకు సూచించారు. అనంతరం మనమిత్ర ద్వారా అందుతున్న వాట్సాప్ సర్వీసులపైనా సీఎం సమీక్ష చేశారు. ప్రస్తుతం 200 రకాల సేవలు వాట్సాప్ ద్వారా అందుతున్నాయని అధికారులు వివరించారు. డ్రోన్ సేవలను విస్తృతంగా ఉపయోగించుకునే విధానంపైనా అధికారులు దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. పోలీసు విభాగంలో రాత్రి గస్తీ విధుల్లో సిబ్బందిని తగ్గించి డ్రోన్ ద్వారా పర్యవేక్షించే పరిస్థితి రావాలన్నారు. అదే విధంగా పారిశుధ్య పనుల్లో కూడా డ్రోన్ వాడకాన్ని మెరుగుపరచాలని సూచించారు. టెక్నాలజీ సాయంతో ఎఫెక్టివ్‌గా పనిచేసి మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఉన్నప్పుడు వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని సీఎం అన్నారు. ఆసుపత్రుల్లో అందించే సేవలపై రోగుల నుంచి ప్రభుత్వం అభిప్రాయం సేకరించింది. డాక్టర్‌లు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటున్నారా అన్న ప్రశ్నకు 68.6 శాతంమంది ఉంటున్నారని సమాధానమిచ్చారు. డాక్టర్ల ప్రవర్తనపై 71.7 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 65.6 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్‌లు రాసిచ్చిన మందులు ఆసుపత్రిలో ఇస్తున్నారా, ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రత ఎలా ఉంది అన్న ప్రశ్నల నుంచి కూడా ప్రభుత్వం అభిప్రాయాలు తీసుకుంది. ఈ విభాగంలో 65 శాతం వరకు సంతృప్తి వ్యక్తం అవ్వగా..దీన్ని మరింత మెరుగుపరుచుకోవాలి సీఎం సూచించారు. గత నివేదికలతో పోల్చుకుంటే సేవలు కొంత మెరుగుపడినట్లు చెప్పారు. ఇవ్వాల ఇంటర్ ఫలితాలకు విద్యార్థులు వాట్సాప్‌ను వినియోగించుకున్నారు,.సచివాలయాలు, సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో దీని గురించి ప్రజల్లో అవగాహన పెంచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ ద్వారా ప్రస్తుతం 200 రకాలైన సేవలు ప్రజలకు అందిస్తున్నామని ఐటీ మరియు రియల్ టైమ్ గవర్నెన్స్ కార్యదర్శి భాస్కర్ కాటంనేని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెలాఖరులోపు మరో 150 అదనపు సేవలు కల్పిస్తామని తద్వారా వాట్సాప్ ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు 350కి చేరుతాయన్నారు. తదుపరి దశలో మొత్తం 500 సేవలు కల్పిస్తామన్నారు. మే నెలలో మొదటి దశ డేటా లేక్ ఏర్పాటు పూర్తి చేస్తామని వివరించారు. అలాగే రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను పెద్ద ఎత్తున ఉపయోగించుకుని ఒన్ స్టేట్ ఒన్ యాప్ విధానంలో ప్రజలకు అన్ని సేవలు కేవలం ఒక ప్లాట్‌ఫాంలో కిందిస్థాయి ఉద్యోగులు, అధికారులకు ఉన్నతాధికారులు కౌన్సలింగ్ నిర్వహించడం ద్వారా సేవలు మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి విషయంలో ఏమాత్రం సహించవద్దని అదేశాలు ఇచ్చారు. మున్సిపల్ సేవల నుంచి కూడా అభిప్రాయం తీసుకున్నారు. మీ నుంచి రోజూ చెత్త సేకరిస్తున్నారా, మీ పరిసర ప్రాంతాల్లో చెత్త కుప్పలను 24 గంటల్లోపు తొలగిస్తున్నారా అనే అంశాలపై సమాచారం సేకరించారు. ఈ విషయంలో 67 శాతంమంది కిపైగా అవును అని చెప్పారు. పలు ప్రాంతాల్లో సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. రెవెన్యూ సేవలురెవెన్యూ సేవలకు సంఅదే విధంగా మీ సర్వే దరఖాస్తుపై దరఖాస్తు రుసుము కాకుండా అదనపు ఛార్జీలు తీసుకున్నారా, మీ భూమి సర్వే చేయుటకు మీకు విచారణ తేదీ, సమయం తెలుపుతూ నోటీసు జారీ చేశారా అన్న ప్రశ్నకు ప్రజల నుంచి వచ్చే సమాధానాలను బేరీజు వేసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. నోటీసు ప్రకారం సర్వేయర్ మీ భూమిని సర్వే చేశారా అన్న ప్రశ్నకు అవును అని అత్యధిక శాతంమంది సమాధానం ఇచ్చారు.

## ప్రమాదం వల్లే ప్రవీణ్ మృతి

>> జిన్ విస్కీ కొనుగోలు చేసి రూ.916 చెల్లించాలన్నారు. మోటారు సైకిల్ కుడివైపు ఉన్న సిగ్నల్ లైట్ తో మాత్రం ప్రయాణం చేయడం జరుగుతుందని ఇది కొవ్వూరు టోల్ ప్లాజా సిసి కెమేరాలో రికార్డు జరిగిందన్నారు. ఇక్కడ నుండి సుమారు 20 నిమిషాల్లో ప్రమాదం జరిగి ప్రవీణ్ కుమార్ మరణించారని చెప్పారు. మధ్యం సేవించి వేగంగా సుమారు గంటకు 70పైగా వేగంతో బుల్లెట్ మోటారు సైకిల్ నడపడంతో గోతిలో పడి మోటారు సైకిల్ అదుపు తప్పి క్రింద పడిపోయి రోడ్డుపై రాసుకుంటూ తల, మెఖానికి బలమైన గాయం తగలడంతో ఆయన మృతి చెందడం జరిగిందన్నారు. మృతదేహంకడుపులోను మూత్రపిండాలు, కాలేయం, గుండె, రక్తంలోను మధ్యం సేవించిన నమోనాలు ఉన్నాయని వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. ప్రవీణ్ కుమార్ శరీరంపై రాపిడి గాయాలు తల, మెఖానికి తీవ్రమైన గాయాలు కారణం మరణించారని పోస్టుమార్టం రిపోర్టులో ఉందన్నారు. బుల్లెట్ మోటారు సైకిల్ నాలుగో గేరులో గంటకు సుమారు 70 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్టు మోటారు సైకిల్ ఇన్స్పెక్టర్ నివేదికలో ఉందన్నారు. ఇవి అన్నీ క్షేత్ర స్థాయిలో హైదరాబాద్ నుండి బాయలుదేరిన తర్వాత దర్యాప్తుప్రారంభించి ప్రమాదం జరిగినంత వరకు సిసి కెమేరాలు, పోస్టుమార్టం నివేదికలు, కొందరి వ్యక్తుల విచారణ అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని ప్రగడాల ప్రవీణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మారణించాడాని నిర్ధారించామన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని విచారణ చేయగా వారి దగ్గర ఆధారాలు లేవన్నారు. తప్పుడు ప్రచారం చేసినందు 11 మందిపై కేసులు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేయడం జరిగిందని చెప్పారు. ఒక వ్యక్తి విదేశాల్లో ఉన్నారన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో తప్పు ప్రచారం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేసు దర్యాప్తులో సమర్థవంతంగా పూర్తి చేసిన డిఎస్పీలు,సిఐలు సిబ్బంది అభినందించారు.

## రాజ్యాంగం మారుస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

>> సందర్భంగా బూత్ లెవల్‌లో కార్యక్రమాలు చేపట్టామని దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ కృషి చేశారని చెప్పారు. అన్ని వర్గాల వారికి సమాన న్యాయం అందించడం అంబేద్కర్ లక్ష్యమని చెప్పారు. అదే ఆదర్శంగా బీజేపీ ప్రజల కోసం పని చేస్తోందని అన్నారు. 2014లో బీజేపీపై కాంగ్రెస్ నేతలు విష ప్రచారం చేశారని మండిపడ్డారు. నిజానికి అంబేద్కర్‌కు గౌరవించి సమున్నత స్థానం కల్పించింది బీజేపీనేనని ఉద్ఘాటించారు. ఆయనను గతంలో అవమానించి, రాజీనామా చేసేలా చేసిన చరిత్ర ఎవరిదో అందరికీ తెలుసునని చెప్పారు. భారతరత్న ఇచ్చినా, పార్లమెంటులో అంబేద్కర్ చిత్ర పటం పెట్టినా, ఐదు ప్రాంతాలను పంచ్ తీర్థ్‌గా , ఆయన నివాసాన్ని బీజేపీ అభివృద్ధి చేసిందని అన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కోసం రాజ్యాంగం మారుస్తామని డీకే శివకుమార్ చెప్పడం సరికాదని అన్నారు. భారత రాజ్యాంగం వల్లే బీసీగా ఉన్న తాను ప్రధానిగా అయ్యానని మోదీ చెప్పారని గుర్తుచేశారు. ఈ అంశాలను ప్రజలకు వివరించేందుకు తమ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు విషయ పరిజ్ఞానం పెంచుకుని ప్రజలకు వివరించాలని దగ్గుబాటి పురంధేశ్వరి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే. అరుణ, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, సోమువీర్రాజు, దయాకర్ రెడ్డి, గుడిసె దేవానంద్, విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

## సముద్ర తీరంలో 61 రోజులు చేపల వేట నిషేధం

### ఉత్తర్వులు జారీ

**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సముద్ర తీర ప్రాంతంలో చేపల వేటను నిషేధిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మత్స్య వనరుల పరిరక్షణలో భాగంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మొత్తం 61 రోజులపాటు సముద్ర తీరంలో చేపల వేటపై నిషేధం విధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సాంప్రదాయ నాటు పడవలు మినహా మెకనైజ్డ్, మోటరైజ్డ్ పడవలు సముద్రంలో చేపల వేటకు వెళ్లకూడదని పేర్కొంటూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. సముద్రంలో వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకునే పరిస్థితుల రీత్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



శనివారం బైసాకి వేడుకల్లో పాల్గొన్న జమ్ము మహిళలు

## గవర్నర్ వద్దపెండింగ్ బిల్లులు చట్టాలుగా నోటిఫై..

### దేశ చరిత్రలో తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం

**చెన్నై,ఏప్రిల్, 12:** తమిళనాడు ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకున్నది. గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం లేకుండా పది చట్టాలను గెజిట్‌లో నోటిఫై చేసింది. ఒక రాష్ట్రం ఇలా చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. సుప్రీంకోర్టు తీర్పు మేరకు తమిళనాడు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఈనెల 11న ఆ రాష్ట్ర గెజిట్‌లో పది చట్టాలను అధికారికంగా నోటిఫై చేసింది. ఈ చట్టాలను గతంలో రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. అయితే గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదం తెలుపకపోవడంతో ప్రత్యేక సమావేశంలో వాటిని తిరిగి ఆమోదించారు. ఆ తర్వాత రాష్ట్రపతికి పంపారు. కాగా, భారత రాజ్యాంగం ప్రకారం సాధారణంగా ఒక బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తర్వాత గవర్నర్‌కు పంపుతారు. గవర్నర్ ఆమోదిస్తే ఆ బిల్లు చట్టంగా మారుతుంది. అలాగే గవర్నర్ తన సమ్మతిని నిలిపివేయవచ్చు. పునఃపరిశీలన కోసం బిల్లును ప్రభుత్వానికి తిరిగి పంపవచ్చు. లేదా రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయవచ్చు. అయితే తిరిగి వచ్చిన బిల్లును మార్పులతో లేదా మార్పులు లేకుండా మళ్లీ శాసనసభ ఆమోదించినట్లయితే గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాలి. దానిని మళ్లీ రిజర్వ్ చేయలేరు. హైకోర్టు లేదా కేంద్రం పరిధిలోని అంశాలను ప్రభావితం చేసే బిల్లు మాత్రం తప్పనిసరిగా రాష్ట్రపతి ఆమోదం కోసం వెళ్లాలి. మరోవైపు తమిళనాడు ప్రభుత్వం పంపిన పలు బిల్లులను గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదించలేదు. అలాగే అసెంబ్లీ తిరిగి ఆమోదించిన ఈ బిల్లులను తప్పుగా రాష్ట్రపతికి పంపడం న్యాయపరమైన సవాలుకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అసెంబ్లీ తిరిగి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతికి పంపిన గవర్నర్ చర్య రాజ్యాంగ విరుద్ధం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 200ను ఉల్లంఘించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో తిరిగి ఆమోదించిన బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన 2023 నవంబర్ 18నుంచి ఆ బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కాగా, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్టాలు రెండవ సవరణ, 2022, తమిళనాడు ఫిషరీస్ యూనివర్సిటీ సవరణచట్టం 2020, గతంలో తమిళనాడు డాక్టర్ జే జయలలిత ఫిషరీస్ యూనివర్సిటీగా ఉన్న పేరు మార్పు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్లను నియమించే అధికారాన్ని గవర్నర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు వంటి చట్టాలను గవర్నర్, రాష్ట్రపతి అనుమతి లేకుండానే ప్రభుత్వ గెజిట్‌లో నోటిఫై చేశారు. ఈ సందర్భంగా డీఎంకే అంటే చరిత్రను సృష్టించడం అని సీఎం ఎంకే స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## 'వనజీవి' ఇకలేరు..

>> నాటడంతో ఆయన ఇంటిపేరు 'వనజీవి'గా మారిపోయింది. పుట్టి పెరిగింది ముత్తగూడెం గ్రామం కాగా తన భూములు రెడ్డిపల్లిలో ఉండగా అక్కడే స్థిరపడ్డారు. రామయ్య ముత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నారు. రామయ్యకు 15 ఏళ్లకే కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జానమ్మతో వివాహం జరిపించారు పెద్దలు. వీరికి నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు ఒక్క కుమార్తె. కొద్దికాలం క్రితం రెండో కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఒకవైపు కుటుంబ భారాన్ని మోస్తూనే 45 ఏళ్లుగా మొక్కల పెంపకాన్నే తన జీవిత ఆశయంగా పెట్టుకుని తన జీవితాన్ని ప్రకృతికి అంకితం చేశాడు రామయ్య.

### ప్రధాని మోదీ, సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, మాజీ సీఎంలు వైఎస్.జగన్, కేసీఆర్‌ల సంతాపం...

పర్యావరణ పేమికులువనజీవి రామయ్య మృతి తీవ్ర పట్ల ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వృక్ష,రక్షతి...రక్షతః అన్ననినాదం వనజీవి సొంతం చేసుకున్నారని మోదీ పేర్కొన్నారు. తన దేహాన్ని కూడా పర్యావరణ పరిరక్షణ కు వినియోగించిన సామాజిక కార్యకర్తని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్,వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి లు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,బిఆర్‌ఎస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజ్ రవిచంద్ర నివాళులర్పించారు. రామయ్య భౌతికాయన్ని సందర్శించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురామ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రూ.1510 కోట్ల జిఎస్టీ ఎగవేత

>> అయితే ఇది ప్రస్తుతం విశాఖ కేంద్రంగా పనిచేస్తోంది. గుంటూరు అయితే రాజధాని అమరావతికి దగ్గరగా ఉండటంతోపాటు ఆడిటర్లకు అందుబాటులో ఉంటుందన్న ఆలోచనతో గుంటూరులో స్థలం కొని కార్యాలయం ఏర్పాటు చేయనున్నాం అని ఆనంద్‌కుమార్ తెలిపారు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2682 కోట్ల పన్నును ఎగవేశారని తెలిపారు. . ఏపీ సెంట్రల్ జీఎస్టీ ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు సంవత్సరంతో పోల్చితే ఇక ఒక శాతం పెరిగింది. అనంతపురం జిల్లాలో కియా సంస్థ ఉండటం వల్ల అక్కడ ట్యాక్స్ వసూలు ఎక్కువగా ఉంటుంది. విశాఖలో తగ్గడానికి స్టీలుప్లాంటు ఇబ్బందుల్లో ఉండటం ఒక కారణం అని వివరించారు.

## 6 వరుసలుగా విస్తరణ

>> ఇస్తోందని సంబంధిత అధికారులు వివరించారు. ఇందులో భాగంగా ఓఆర్ఆర్ క్రాస్ అయ్యే ప్రాంతంనుంచే పోర్టుకు అనుసంధానంపై ప్రస్తుతం దృష్టిపెట్టినట్లుఅధికార వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా ఈ రహదారికి డీపీఆర్ తయారీ బాధ్యత చైతన్య ఎంఎస్ పార్క్ జేవీ సంస్థకు అప్పగించారు. విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఉన్న హైవేలో ఓఆర్ఆర్ క్రాస్ అయ్యే ప్రాంతం నుంచి మాత్రమే రహదారిని విస్తరించనున్నారు. విజయవాడ బెంజ్ సర్కిల్ నుంచి పోరంకి, పెనమలూరు, కూడలి, కంకిపాడు, మీదుగా చలివేంద్రపాలెం వరకు 19 కి.మీ మేర ఉన్న మార్గాన్ని ఆరు వరుసలుగా విస్తరించడంపై ఇంకా స్పష్టత లేదు. నగర పరిధిలో వాహన రద్దీ ఈ పరిధిలోనే అధికంగా ఉంటుంది.

## సమస్యలుండవు

>> పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్లు ఉదయంనుంచే ఖచ్చితంగా క్షేత్ర స్థాయి పర్యటన చేయాలి,పారిశుధ్యం,తాగునీటి పై ప్రత్యేక దృష్టి సారించాలిడ్రైన్ల పూడిక తీత వెంటనే ప్రారంభించాలి నేను కూడా మున్సిపాలిటీల్లో ఉదయమే ఆకస్మిక తనిఖీలు చేస్తాను, మెరుగైన పారిశుధ్యం కొరకు అవసరమైన స్వీపింగ్ మెషీన్లు,ఇతర యంత్రాలను కొత్తగా కొనుగోలు చేస్తున్నాం, క్షేత్ర స్థాయి పర్యటన చేయలేని చేయలేని అధికారులకు డైరెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 13-04-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
పౌర్ణమి తె.5.52, పాడ్యమి పూర్తి
చిత్త రా.9.10
వర్జ్యం రా.3.29 - తె.5.17
దు.సా.4.39-5.29
శుభసమయం : ఉ.6.40-7.10
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం :** నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. వస్తు సేకరణ.

**వృషభం:** రియల్ ఎస్టేట్ రంగంలో ప్రోత్సాహం లభిస్తుంది. సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మిథునం:** ఆత్మీయులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కర్కాటకం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి.

**సింహం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. జీవితాశయం నెరవేరుతుంది వాహనయోగం.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వస్తులాభం.

**తుల :** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలకు హాజరు అవుతారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతాం

**వృశ్చికం:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. క్రయ విక్రయాలలో నిదానం అవసరం.

**ధనుస్సు:** నూతన విషయాలపై దృష్టి సారిస్తారు. కుటుంబంలో శుకార్యాల ప్రస్తావన వుంటుంది.

**మకరం:** తండ్రి నుండి ఆస్తిలాభం పొందుతారు. దైవదర్శనాలు, ఇంటా బయటా అనుకూలం.

**కుంభం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**మీనం :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆధ్యాత్మిక చింతన. వృత్తివ్యాపారాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




# జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు నష్టం లేదు

- ఎన్నికల ఖర్చు కూడా ఆదా
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**తిరుపతి,ఏప్రిల్ 12ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రాంతీయ పార్టీలకు ఎలాంటి ఇబ్బంది అనేది ఉండదని, అది కేవలం అపోహమాత్రమేనని మాజీ రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. ప్రాంతీయ పార్టీలు కేవలం అపోహాలు మాత్రమేనని అన్నారు. "ఒకే దేశం-ఒకే ఎన్నిక"పై తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శనివారం ఉదయం మేదావుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యవక్తగా విచ్చేసిన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు దేశానికి అవసరం అన్నారు. దీనివల్ల ఎన్నికల ఖర్చుకూడా ఆదా అవుతుందని చెప్పారు. ఎన్నికలను కొన్ని పార్టీ లు వ్యతిరేకించడంలో రాజకీయ కోణం తప్ప మరేమీలేదని అన్నారు. అధికారం పోతే కొన్ని పార్టీల నేతలు తట్టుకోలేకపోతున్నారని వక్కాణించారు. పార్టీ ఫిరాయించడం ప్రజాస్వామ్యానికి చేటు అని అన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి వెళ్ళడం సరికాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలకు ఓపిక నశిస్తోందని, ఇష్టం ఉన్నా లేకపోయినా ఒకసారి ప్రజలు తీర్పు ఇచ్చాక ఐదేళ్ళు ప్రతిపక్షంలో కూర్చోవాల్సిందేనని తేల్చి చెప్పారు. చదువుకున్న యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. మంచి వ్యక్తులను ఎన్నుకుంటే ప్రజలు సంతోషంగా ఉండేందుకు ,ఎన్నో సంక్షేమపథకాలు అందుకునేందుకు వీలుకలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు నిర్వాహక సభాధ్యక్షుడు ఆచార్య మురళి. బిజెపి నేతలు భానుప్రకాశ్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఒంటిమిట్టలో వైభవంగా శ్రీ కోదండరాముని రథోత్సవం

**రాజంపేట అర్బన్ ఏప్రిల్ 12 ప్రభాతవా ర్త** ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. జై శ్రీరామ్ నినాదంతో రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్వజ్ఞానమిదే. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవో నటేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సమాజంలో మార్పు రావాలి! గురుసాంగత్యం పెరగాలి!: విష్ణుసేవానందగిరి స్వామి

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త** సమాజంలో మార్పు రావాలని నేడు యువత పాశ్చాత్యమోజులో పడి మన సంప్రదాయాలను విస్మరిస్తున్నారని దానివల్ల సమాజంలో రుగ్మతలు చోటు చేసుకుంటున్నాయని కరీంనగర్ మలయాళస్వామి గీతాశ్రమాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి అన్నారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమంలో జరుగుతున్న 75వ వార్షికోత్సవం సందర్భంగా పీఠాధిపతుల ప్రవచనాలను ఏర్పాటు చేసారు. శనివారం నాటి వేదికను ఆశ్రమానికి చెందిన నిర్వాహకులు విద్యాస్వరూపానందగిరి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ వ్యవస్థాపకులు ఎన్నో మహోన్నత ఆశయాలతో ఆశ్రమాన్ని 1950లో స్థాపించారన్నారు. ఆయన ఆశయ సాధనకు నేడు పని చేస్తున్నామన్నారు. రోజు రోజుకు సమాజంలో రుగ్మతలు పెరుగుతున్నాయని వాటిని తొలగించుటకు యువతను సన్మార్గంలో నడుపుటకు ప్రతి ఏడాది మహాత్ముల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. శనివారం నాటి ఉదయం సభావేదికపై కరీం నగర్‌కు చెందిన విష్ణుసేవానందగిరి స్వామి ముఖ్యవక్తగా వచ్చారు. మలయాళ స్వామి శిష్యుల్లో ఒకరైన విష్ణుసేవానందగిరి స్వామి సభకు వచ్చిన వారినుద్దేశించి దిశ దెశ నిర్ధేశం చేస్తూ నేటి యువతకు 'గురుసాంగత్యం' ఎంతో అవసరమన్నారు. కర్మసిద్ధాంతాన్ని విస్మరించి మనిషి వ్యవహారిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. మనం చేసే మంచి మన ఖాతాలో దేవుని వద్దనమోదౌతుందన్నారు. ఆశాశ్వతమైన మానవ జన్మపై మమకారం పెంచుకుంటూ శాశ్వతమైన జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక పోతున్నారని వివరించారు. మనం ఎంత సంపాదించినా మనతో రాదనే సత్యాన్ని గ్రహించలేక దానికోసం పరుగులు తీస్తూ భగవంతుని విస్మరిస్తున్నామని వివరించారు. మనిషి తన జీవిత రహస్యాన్ని తెలుసుకొనుటకు 'గురుసాంగత్యం'ను పొందాలన్నారు. హిందూధర్మపరిరక్షణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సమాజంలో రోజు రోజుకు నైతిక విలువలు దిగజారుతున్నాయన్నారు. మన ధర్మంను తెలుసుకోలేక పోతున్నామన్నారు. కర్మ సిద్ధాంతాన్ని అవగాహన చేసుకుంటే మనం తప్పులను చేయమన్నారు.

అందుకు గురువు ఉపదేశాలు ఎంతో ముఖ్యమన్నారు. ఆశ్రమాల్లో హిందూధర్మం, కుటుంబం గురించి ప్రేమానురాగాలు, బోధిస్తుందన్నారు. నేడు లక్షలు సంపాదిస్తున్నా కుటుంబంలో సౌఖ్యం లేదంటూ వస్తుంటారు. అయితే మనల్ని నడిపిస్తున్న భగవంతుని విస్మరించి కుటుంబంలో సౌఖ్యం అంటే ఎలా సాధ్యమన్నారు.

# గిరి పుత్రిక: చదువుల్లో దిట్ట ద్వితీయ ఇంటర్‌లో స్టేట్‌ఫస్ట్



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త** చదువుకు కులాలు, మతాలు, వర్గాలుండవు. చదువుపై బాలికలకు శ్రద్ద ఎక్కువ. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినులు తమ సత్తా చాటుతున్నారు. గిరిపుత్రికలు తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి తాము చదువుకుంటున్న సంస్థలకు తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తున్నారు. శనివారంఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సిలో చదివిన గిరి పుత్రిక భవాని 982 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. మరో బాలిక 968 కీర్తి మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. గిరి పుత్రికలు మట్టలో మాణిక్యాలని నిరూపించారు. శ్రీకాళహస్తిలోని గిరిజన గురుకులం కాలేజ్ ఎక్సలెన్సి పాఠశాల మరియు కళాశాల ఉంది. ఇక్కడ చదివే విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. ఇక్కడ చదివే విద్యార్థులు నూటికి నూరు శాతం విజేతలుగా ఉంటున్నారు. ఈ కళాశాల నుంచి ద్వితీయ ఇంటర్‌కు 69 మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. బైపిసి విభాగంలో 982 మార్కులు సాధించిన భవాని కళాశాల టాంపర్‌గా నిలవగా రాష్ట్ర స్థాయి గిరిజన విభాగంలో మొదటి స్థాయిలో నిలిచిందని చెప్పవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 40గిరిజన కళాశాలల్లో శ్రీకాళహస్తి కళాశాలకు చెందిన భారతి అత్యధిక మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. శ్రీకాళహస్తి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ కళాశాల నుంచి పరీక్షలకు హాజరైన వారిలో 25 మందికి 900 మార్కులకు పైగా సాధించారు. కళాశాల పేరు ప్రతిష్టలు సాధించిన విద్యార్థులకు అభినందిస్తూ మిఠాయిలు పంచుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన భవాని మాట్లాడుతూ తాను కదిరి నుంచి ఇక్కడకు వచ్చానన్నారు. ఇక్కడ అధ్యాపకులు మంచి మార్కులు సాధించారన్నారు. తాను ఎంబిబిఎస్ చదవాలన్నది లక్ష్యం అన్నారు. మరో విద్యార్థిని గూడురు నుంచి వచ్చినట్లు వివరించారు. సంబరాల్లో కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తమకళాశాల విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించటం గర్వ కారణమన్నారు.

# సీమాంధ్రలో మరికొన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 12,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ఆదివారం నుంచి మరికొన్ని వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖ-కర్నూలు-విశాఖ ప్రత్యేక రైళ్లు :- విశాఖపట్నం నుంచి కర్నూలు వెళ్లే నెంబర్ 08545ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15నుంచి మే 27వరకు ప్రతి మంగళవారం రాత్రి 7గంటలకు విశాఖ నుంచి బయలుదేరి బుధవారం 9-35గంటలకు కర్నూలు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కర్నూలు నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08546ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కర్నూలు నుంచి ఈ నెల 16నుంచి మే 28వరకు ప్రతి బుధవారం సాయంత్రం 4-10గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి గురువారం ఉదయం 8గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, దిగువమెట్ట, నంద్యాల, డోన్ స్టేషన్లలో నిలుస్తాయి. విశాఖ-తిరుపతి-విశాఖ ప్రత్యేక రైళ్లు :- విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 08547ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16నుంచి మే 28వరకు ప్రతి బుధవారం రాత్రి 7గంటలకు విశాఖ నుంచి బయలుదేరి,

గురువారం ఉదయం 9-15గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08548ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17నుంచి మే 29వరకు ప్రతి గురువారం రాత్రి 9-50గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 11-30గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవవరం టౌన్, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్లలో నిలుస్తాయి.

# భక్తుల రద్దీతో పోటెత్తిన కాణిపాకం

- సర్వ దర్శనానికి మూడు గంటలు

**కాణిపాకం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం శనివారం పోటెత్తిన భక్తులతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు రెండవ శనివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో పాటు పంగుణి ఫౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై గిరిప్రదక్షణకు వెళ్ళే భక్తులు ముందుగా కాణిపాకం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది.

# విద్యుత్తు డిస్కంలకు టారిఫ్ సబ్సిడీ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతి

**విజయవాడ ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలోని విద్యుత్తు డిస్కంలకు టారిఫ్ సబ్సిడీ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మూడు ప్రాంతాల్లోని విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.4470 కోట్లు విడుదల చేసింది. వినియోగదారులకు బదలాయిసున్న టారిఫ్ సబ్సిడీ భరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2025-26 ఏడాది తొలి త్రైమాసికానికి నిధుల విడుదలకు పాలనా అనుమతి లభించింది. ప్రజలపై టారిఫ్‌ల భారం పడకుండా సబ్సిడీ మొత్తం బదలాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిస్కం ఖాతాల్లో మొత్తం జమ చేయాలని పవన్ కోఆర్డినేషన్ కమిటీని ఆదేశించింది.

# దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతిని బిజెపి నేటి నుంచి 25వ తేది వరకు నిర్వహిస్తుంది

- బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ

**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్తప్రతినిధి:** అంబేద్కర్ జయంతి వేడుకలను ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు. అంబేద్కర్ జయంతి వేడుకలను గ్రామగ్రామాన నిర్వహిస్తామని తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని తాము ప్రజలకు వివరిస్తామని అన్నారు. విజయవాడలో శనివారం ఆమె మీడియాతో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేస్తామని కాంగ్రెస్ నేతలు అసత్యాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. కానీ అంబేద్కర్‌ను, ఆయన రాజ్యాంగాన్ని అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని విమర్శించారు. నెహ్రూ అయితే అంబేద్కర్‌ను ఓడించడనికి చాలా కుట్రలు చేశారని ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా, ఓట్ల రాజకీయం కోసం రాజ్యాంగానికి కాంగ్రెస్ సవరణలు చేసిందని డీకే అరుణ విమర్శించారు. మోదీ ప్రధానమంత్రి అయిన నాటి నుంచే అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లారని డీకే అరుణ చెప్పారు. మోదీ చేసిన సవరణలు దేశం హితం, ప్రజా హితం గురించే చేశారని తెలిపారు. కాంగ్రెస్ అబద్దాలు ప్రచారం చేసింది కాబట్టే...ప్రజలు వారికి గుణపాఠం చెప్పారని అన్నారు. దేశం అభివృద్ధి, అన్నివర్గాలు, అన్నిప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా మోదీ పాలన చేస్తున్నారని ఉద్ఘాటించారు. సమాజంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా బీజేపీ ప్రభుత్వం ఆలోచనలు చేస్తుందని తెలిపారు. బీజేపీ కార్యశాల ద్వారా పార్టీ లక్ష్యాలు, అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు వివరించేలా శిక్షణ ఇస్తామని అన్నారు. ఆదివారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేసి దీపాలు పెడతామని చెప్పారు.

14వ తేదీన అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను ఏ విధంగా అవమానించి, పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ ఏ విధంగా అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని డీకే అరుణ పేర్కొన్నారు. అంతకు ముంది విజయవాడ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## వసంతోత్సవంలో ఉత్సవర్లకు స్నపనం

- శాస్త్రోక్తంగా ముగిసిన వసంతోత్సవాలు




**తిరుమల,ఏప్రిల్ 12ప్రభాతవార్తప్రతినిధి:** వసంతరుతువులో వేసవితాపం నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ఉపశమనోత్సవం కల్గించడానికి నిర్వహించిన వసం తోత్సవాలు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా ముగిశాయి. చివరిరోజు ఉత్సవ మూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి, రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి, సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి మూడు ఉత్సవర్లను వసంతమండపంలో కొలువుదీర్చారు. ఉత్సవర్లు కొలువుదీరడం మండపానికి ఆద్యంతం నేత్రపర్వంగా మారింది. వసంతమండపంలో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు శ్రీభూసమేత మలయప్పకు, సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తికి, రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామికి వేర్వేరుగా స్నపనతిరుమంజనం ఆలయ అర్చకులు శోభాయమానంగా నిర్వహించారు. ఈ క్రతువులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్రచామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖప్రక్షాళన, దూపదీపనైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, గంధంతో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను ఆగమోక్తంగా స్నపనం జరిపించారు. ఉత్సవర్ల అభిషేకసమయంలో తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతిమంత్రాలు, దివ్యప్రబంధంలోని అనుసంధానం చేసే పాశురాలను పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరింపజేశారు. సాయంత్రం వసంతమండపం నుండిముగ్గురు ఉత్సవర్లు బయలుదేరి మాఢవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ప్రేక్షకుల ముందుకు 'చాంపియన్' - సినీనటుడు రోషన్

**తిరుమల,ఏప్రిల్ 12ప్రభాతవార్తప్రతినిధి:** చాంపియన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీనటుడు రోషన్ తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రం 50శాతం చిత్రీకరణ పూర్తయిందన్నారు. జనవరిలో శ్రీవారిని దర్శించుకోవాలని అనుకున్నా గానీ,

హనుమత్‌విజయోత్సవం రోజు శనివారం దేవదేవుడిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వామివారి దర్శనం బాగా జరిగిందన్నారు.

## ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



**తిరుమల,ఏప్రిల్ 12ప్రభాతవార్తప్రతినిధి:** గోవిందా అంటూ తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా నిరంతరాయంగా అన్నప్రసాదాలు తయారుచేసి వడ్డిస్తున్న ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం మధ్యాహ్నం ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు విశాఖపట్నంకు చెందిన మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరావు కోటిరూపాయలు చెక్కు విరాళాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో కలసి ఈ విరాళం అందించారు. కాగా దాత శ్రీనివాస్‌రావు గుంటూరునుండి కాలినడకన 12రోజులు పాదయాత్రగా తిరుమలకు వచ్చి ,శ్రీవారిపై తనకున్న భక్తివిశ్వాసాలను చాటుకున్నారు .గతంలో కూడా దాత శ్రీనివాసరావు పలుమార్లు కోట్లాదిరూపాయలు టిటిడి ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చారు.

## గోవుల సంరక్షణ అద్భుతంగా ఉంది

- సంచలనాలకోసం తప్పుడు ప్రచారం - వైసిపినేతపై టిడిపి నేతలు మండిపాటు



**తిరుపతి,ఏప్రిల్ 12ప్రభాత వార్తప్రతి నిధి:** టిటిడి ఎస్వీ గోశాలలో గోవులను అక్కడి సిబ్బంది దేవతాస్వరూపాలుగా భావించి సేవలందిస్తున్నారని తెలుగు దేశంపార్టీ అధికారప్రతినిధి డాక్టర్ నవ్వుగిరిప్రసాద్, తెలుగుయువత అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు తెలిపారు. పదవులు పోయి ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న మాజీ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఏదో ఒకసంచలనాలకోసం పాకులాడుతూ టిటిడిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఉదయం తిరుపతిలోని ఎస్వీగోశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను గమనించామన్నారు. 260మంది సిబ్బంది గోశాలలో సేవాభావంతో విధులు నిర్వహిస్తూ, పాలిచ్చే ఆవులకు, పాలివ్వని ఆవులకు ప్రత్యేకంగా దాణా తయారుచేసి అందిస్తున్నారన్నారు. గోవులన్నీ ఆరోగ్యంగా ఉన్నాయని, సిబ్బంది కంటికిరెప్పలా కాపడుకుంటున్నారని తెలిపారు. గోవులకు అందిస్తున్న దాణా, మంచినీరు, వైద్యసేవలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రతి నిత్యం పశువైద్యులు గోవులను జాగ్రత్తగా పరిరక్షిస్తూ, వాటి ఆరోగ్యం, చిన్నపాటి గాయమైనా సకాలంలో వైద్యం అందిస్తుండటం టిటిడికే చెల్లుతుందన్నారు . తప్పుడు ఆరోపణలు చేయడం భూమనకు మంచిదికాదని, వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు. తనవారికోసం దిగజారుడు మాటలు అలవాటేనన్నారు.

# వాటర్ బేస్ రొయ్యల కంపెనీలో గ్యాస్ లీక్

- పలువురికి అస్వస్థత - ఒకరి పరిస్థితి విషమం

**తోటపల్లిగూడూరు,(నెల్లూరు) ఏప్రిల్ 12, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న తోటపల్లి గూడూరు మండలంలోని అనంతవరం గ్రామ సమీపంలో వాటర్ బేస్ కంపెనీ ఉంది. ఆ కంపెనీ లో శనివారం ప్రాసెసింగ్ చేస్తు ఉండగా ప్రాపెసింగ్ ప్లాంట్‌లో గ్యాస్ లీక్ అయింది. అది గమనించని టెక్నీషియన్లు తమ పనులలో నిమగ్నమై ఉండగా ప్రాసెసింగ్ ప్లాంట్లో పెద్ద ఎత్తున లీకేజీలు రావడం మొదలు పెట్టాయి. గ్యాస్ స్మెల్ గుర్తించిన ప్లాంట్లో పని చేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీశారు. గ్యాస్ లీకేజీలను అదుపు చేసేందుకు ఎంత ప్రయత్నించినా టెక్నీషియన్‌లా వల్ల సాధ్యం కాలేదు. ఇంతలో వాటర్ బేస్ కంపెనీ అధికారులు మెయిన్ టెక్నీషియన్లు ఆ అమ్మోనియా గ్యాస్ లీకేజీలను ఆపేందుకు విశ్వప్రయత్నం చేశారు. కాన అప్పటికే జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోయింది. ఈ గ్యాస్ లీకేజీ వల్ల సుమారు ప్రాసెసింగ్ ప్లాంట్‌లో పని చేస్తున్న 9 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరో వ్యక్తి పూర్తిగా ఆ గ్యాస్ ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో ప్రాణాపాయ స్థితిలో నెల్లూరులోని ఓ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మొదట ప్రాసెసింగ్ ప్లాంట్‌లో గ్యాస్ లీకేజీ విషయం కొంత మంది కార్మికులు ఆ ప్లాంట్‌లోనే ఉన్న ఒక టెక్నీషియన్‌కు చెప్పినా ఆ టెక్నీషియన్ అదేం కాదు మీ పనులు మీరు చేయండి ఆ వాసన మామూలుగానే వస్తు ఉంటుంది అని కార్మికులకు తెలపడంతో వారు ఆ టెక్నీషియన్ మాటలు నమ్మి అమ్మోనియా గ్యాస్ లీకేజీ విషయాన్ని కార్మికులు పక్కన పెట్టి వారి పనులలో వారు నిమగ్నమయ్యారు. అయితే కొంత సమయానికి కొద్దిగా లీకేజీ వస్తున్న గ్యాస్ కాస్త మెల్లమెల్లగా ఎక్కువ కావడంతో అది గమనించిన కార్మికులు ప్రాపెసింగ్ ప్లాంట్ నుంచి బయటకు పరుగులు తీయడం మొదలు పెట్టారు. ఆ వాటర్ బేస్ కంపెనీలో పని చేస్తున్న వందలాది మంది కార్మికులు ప్రాపెసింగ్ ప్లాంట్ నుంచి బయటకి వస్తున్న కార్మికులను గమనించి ఏమి జరిగిందని మిగతా యూనిట్లలో పని చేస్తున్న కార్మికులు ప్రాసెసింగ్ యూనిట్‌లో చేస్తున్న కార్మికులను ప్రశ్నించారు. ప్రాపెసింగ్ ప్లాంట్‌లోకి వస్తున్న అమ్మోనియం గ్యాస్ పైపులు లీక్ అవుతున్నాయి. అప్రమత్తంగా ఉండాలని మిగతా కార్మికులకు వారు తెలిపారు. దాంతో మిగతా యూనిట్లలో పని చేస్తున్న




కార్మికులందరూ హడావుడిగా బయటకు రావడం జరిగింది. తోటపల్లిగూడూరు మండలంలోని అనంతవరం గ్రామం సమీపంలో ఈ వాటర్ బేస్ కంపెనీ ఉంది. అయితే ఈ కంపెనీకి చుట్టు పక్కల 10 గ్రామాలకు పైగా ప్రజలు సుమారు 30 వేల నుంచి 40 వేల మంది ప్రజలు జీవనం సాగిస్తూ ఉంటారు. ఆ వాటర్ బేస్ కంపెనీలో ఏ చిన్న ప్రమాదం జరిగినా కంపెనీలో పని చేసే వారితో పాటుగా చుట్టు పక్కల గ్రామాలలో నివసిస్తున్న ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ గ్రామాలలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ప్రాసెసింగ్ ప్లాంట్‌లో జరిగిన అమ్మోనియా గ్యాస్ లీకేజీ ప్రమాదం వల్ల పది మంది శ్వాస ఆడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఉన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. పగలంతా ఎండ మండిపోతుంటే సాయంత్రం అయ్యేసరికి వాన దంచి కొడుతోంది. అటుఏపీలోనూ ఇటు తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. ఎండ–వానతోపాటు ఈదులు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. వానకి తోడు గాలిదుమారానికి చేతికొచ్చిన పంట నేలపాలవుతోంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోనూ రబీ (యాసంగి) పంటలు ముఖ్యంగా ముందుగా వేసిన వరి చేలు కోతకు వస్తుండగా, మామిడి తోటలు కాపు మీద ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్ల వానలతో సాగైన పంటల్లో ముఖ్యంగా వరిచేలు,కోసిన పనలు, కల్లాల మీద న్న ధాన్యం నీటి పాలవుతోంది. కోతకువచ్చిన మామిడి రాలిపోతుండగా,ఈదురు గాలులకు చెట్లు కూలిపోతున్నాయి.బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడుతోంది. వచ్చే మూడు రోజుల్లో రెండు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు ఉంటాయంటోంది వాతావరణ విభాగం. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ,చిత్తూరు, తిరుపతి జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశమున్నట్లు వాతావరణ విభాగంఅధికారులు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం మరో రెండు రోజులపాటు మోస్తరు వానలు ఉంటాయంటున్నారు.బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణ, ఎపివ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి.మరోవైపు రాష్ట్రంలో వాతావరణంలో భిన్నమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎండ, వాన,చలిఅన్నట్టుగా కలగలిసిన వాతావరణం కనిపిస్తున్నది. రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో గాలిలో తేమ శాతంపెరిగి అక్కడక్కడ క్యుమిలో నింబస్‌మేఘాలు ఏర్పడుతున్నాయి. మేఘాలు చల్లబడి గాలిదుమారంతో వర్షాలుకురుస్తున్నాయి.దీంతో చేతికందివచ్చిన పంటలునీటిపాలవుతుండటంతో రైతాంగం కన్నీటి పర్యాంతమవుతోంది.

# అకాల వర్షాలతో అన్నదాత ఆగమాగం

సిహెచ్ వి వి రఘుబాబు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మండు వేసవిలో అకాల వర్షాలు అన్నదాతలను కుదేలు చేశాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన వడగండ్ల వానలకు పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. వరి, మక్క పంటలకు తీవ్ర నష్టంవాటిల్లింది. సిద్దిపేట, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, జనగామ, కామారెడ్డి జిల్లాల రైతులు నష్టపోయారు. చెడగొట్టు వానకు చేతికొచ్చిన వరి పంట నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయారు. నల్లగొండ జిల్లాలో అకాల వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. ఉమ్మడి జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం తీవ్ర నష్టం కలిగించింది. కొనుగోళ్ల కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. పలుచోట్ల వరదకు కొట్టుకుపోయింది. వారం రోజుల్లో కోతకు వచ్చిన వరిపొలాలు వర్షానికి నేలవాలాయి. చేతికి అందివచ్చిన ధాన్యం తడవడం, కొట్టుకుపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. సిద్ధిపేట జిల్లాలో ఈదురుగాలులతో వడగండ్ల వర్షంకురిసింది. జిల్లాలోని 9,149ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 6,321 ఎకరాల వరి పంట, 33ఎకరాల మొక్కజొన్న,1,141 ఎకరాల మామిడి,1,654 ఎకరాల కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పంట నష్టం అంచనా వేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనూ వడగండ్ల వర్షం కురిసింది. సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట, మునిపల్లి, పుల్కల్, సదాశివపేట, నారాయణఖేడ్ తదితర మండలాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈదురుగాలులు, వర్షాల కారణంగా వరి పంట దెబ్బతిన్నది. ఆరబెట్టుకున్న వడ్లు తడిసిపోయాయి. జనగామ జిల్లాలో పంటలు నేలవాలాయి. కామారెడ్డి జిల్లాలె వరి నీటి పాలైంది. కరీంనగర్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి మొక్కజొన్న, మామిడి రైతులు నష్టపోయారు. మాదాపూర్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. మామిడికాయలు నేలరాలిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు మండలాల్లో వర్షానికి ధాన్యం పొలాల్లోనే రాలిపోయింది. మొక్కజొన్న నేలవాలింది. పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. జిల్లా కేంద్రం జనగామ మార్కెట్‌లో 600బస్తాల ధాన్యం తడిసిపోగా, పలు మండలాల్లో కోతకు సిద్ధంగా ఉన్నపంట దెబ్బతింది. సిద్దిపేట్ జిల్లాలో పొలాల్లోనే గింజలు రాలి, వరి మొక్కకు పిలకలే మిగిలాయి. మొక్కజొన్న, మిర్చి,టమాట, కూరగాయ పంటలు పడిపోయాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మార్కెట్‌లో వేలం వేసిన ధాన్యం కుప్పలు తడిసిపోయాయి.



కొల్లాపూర్‌లో ఈదురుగాలులకు మామడి కాయలు రాలిపోయాయి. నిర్మల్ జిల్లాలో ఈదురుగాలులతో పాటు, రాళ్ల వర్షం కురియడంతో కోతకు వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే కోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న నీటి పాలైంది. ఉమ్మడి పాలమూరు అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గతవారం రోజులుగా వానలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. విక్రయాల కోసం ఉంచిన వరి ధాన్యం పలుచోట్ల వర్షానికి కొట్టుకుపోవడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. దేవరకద్ర మార్కెట్‌యార్డుకు తెచ్చిన వరిధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. అధికారులు టార్పాలిన్ కవర్లను ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మిడ్జిల్ మండలంలో ఆరబోసిన మక్కలు తడిసిపోయాయి. జడ్చర్లలో కాలనీలు అన్ని జలమయం అయ్యాయి. మహబూబ్‌నగర్‌జిల్లాలో వడగండ్లు కురవడంతో వరిపంట నేలపాలైంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల్లో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ మామిడికాయలు గాలివానకు రాలిపోగా, అరటితోటలు నేలకొరిగాయి. కోతకువచ్చిన వరి, మొక్కజొన్నతో పాటు కర్బూజ, దోస, చీనీ, కళింగర వంటి పంటలు దెబ్బతిన్నాయి. ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అనం తపురం జిల్లాలో రైతులకు రూ.2.15 కోట్లకు పైగానష్టం వాటిల్లింది. విజయ వాడ చుట్టు పక్కల ప్రాంతాల్లో మామిడి, అరటిపంటలు దెబ్బతిన్నాయి. అనంతపురం జిల్లాలో గాలివానకు రూ.2.15 కోట్లకుపైగా విలువైన పంటలు దెబ్బతిన్నాయి. తాడిపత్రి, యల్లనూరు, గార్లదిన్నె తదితర మండలాల్లో 60.77 హెక్టా ర్లల్లో రూ.1.24 కోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి, కర్బూజ, చీనీ, కళింగర పంటలున్నాయి. శెట్టూరు, నార్పల, గార్లదిన్నె, అనంతపురం రూరల్ మండలాల్లో రైతులకు సంబంధించి 114 హెక్టార్లల్లో రూ.91.84 లక్షల విలువైన మొక్కజొన్న, వరి పంటనష్టం జరిగింది. జిల్లాలోని 30 మండలాల్లో వర్షం కురిసింది. విజయవాడతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అకాల వర్షం నగరాన్ని ముద్ద చేస్తే గ్రామీణప్రాంతాల్లో పంటలకు నష్టం చేకూర్చింది. విజయవాడ రూరల్ మండలంలో నష్టం ఎక్కువగా జరిగింది. అసలే పూత ఆలస్యం కావడంతో మామిడి రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడిప్పుడే కాయలు దశకు తోటలు చేరుకున్నాయి. గాలివానకు రూరల్ మండలంలో 50 ఎకరాల్లో తోటలకు నష్టంవాటిల్లినట్టు ఉద్యానవన శాఖ అధికారులు నిర్ధారించారు. పదిశాతం మామిడికాయలు గాలివానకు రాలిపోయాయి. జిల్లాలో అక్కడక్కడ గెలలు ఉన్న అరటి చెట్లు నేలపై పడటంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. రూరల్ మండలంలో ఆరబెట్టిన 1000 మెట్రిక్‌టన్నుల ధాన్యం తడిసి ముద్దయింది. జి.కొండూరు మండలంలో మిర్చిరైతులకుస్వల్ప నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల మిర్చి కల్లాల్లో తడిసిపోయింది. కాగా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించనున్నట్లు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 23,364 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వెల్లడించింది. గడిచిన నెలలో కురిసిన వర్షాలకు 8,408ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నెల 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు కురిసిన వర్షాలకు మరో 18,956 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. మార్చి 21 నుంచి 23 వరకు వడగండ్ల వానలతో రాష్ట్ర వ్యాప్తంగా 11వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. దాదాపు 13 జిల్లాల్లోని 64 మండలాల్లో 11,298 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో 6,670 ఎకరాల్లో వరి, 4,100 ఎకరాల్లో మొక్కజొన్న, 309 ఎకరాల్లో మామిడి ఉన్నాయి. ఫీల్డ్ లెవల్ సర్వేలో 8,406 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు నిర్ధారించారు. గతంలో కూడా రాష్ట్రంలో అకాల వర్షాలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందజేసింది. గత సంవత్సరం అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఎకరాకు రూ. 10,000 చొప్పున పరిహారం అందించింది. ఈ చర్య ద్వారా వేలాది మంది రైతులకు ఆర్థికంగా కొంత ఊరట లభించింది. ఈసారి కూడా అదే తరహాలో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందజేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే వర్షాలు, వడగళ్ల వాన కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.20,000 పరిహారం చెల్లించాలనే డిమాండ్ ఉంది. ●

---

తమిళనాడు

# అన్నీ మంచి శకునములే!

ఎ.వి.వి ప్రసాద్

రొట్టె విరిగి నేతిలో పడడమంటే ఏమిటో తమిళ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను చూస్తే అర్థమవుతుంది. డీలిమిటేషన్ ఉదంతంతో ఆయన నాయకత్వానికి పెరిగిన బలం సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుతో మరింత అధికమైనట్లే కనిపిస్తోంది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి విధానాలకు వ్యతిరేకంగా అత్యున్నత న్యాయస్థానం గతవారం ఇచ్చిన తీర్పు అందరి కంటె ఎక్కువగా స్టాలిన్‌కు ప్రయోజనం చేకూర్చవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. 2021 మే నెలలో స్టాలిన్ ముఖ్యమంత్రి అయితే, తరువాత నాలుగు నెలలకు రవి గవర్నర్‌గా నియమితులయ్యారు. కొద్దిరోజులు వారిద్దరి మధ్య సంబంధాలు సజావుగానే సాగినా, తరువాత అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లులు ఆయన అనుమతి కోసం పంపించేసరికి వివాదాలు మొదలయ్యాయి. అవి పెరిగి, పెరిగి తొమ్మిది బిల్లులు పెండింగులోకి చేరాయి.వాటికి ముందు అన్నాడిఎంకె హయాం నాటి ఒక బిల్లుతో కలిపి పెండింగులో ఉన్న బిల్లుల సంఖ్య 10కి పెరిగింది. ఆ బిల్లులకు గవర్నర్ ఆమోదం రాకపోవడంతో రాజ్‌భవన్, ముఖ్యమంత్రి మధ్య సంబంధాలు మరింతగా క్షీణించాయి. చివరికి స్టాలిన్ ఆ బిల్లుల కోసం సుప్రీంకోర్టుకు అప్పీలు చేయడం,సుదీర్ఘ విచారణల తర్వాత గతవారం తీర్పునివ్వడం జరిగాయి. అనూహ్యమైన కాలయాపన జరగడంతో దానిని గవర్నర్ బాధ్యతారాహిత్యంగా భావిస్తూ, ఆ బిల్లులన్నిటికి ఆమోదం లభింపచేస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఇకపై గవర్నర్లు బిల్లుల ఆమోదం విషయంలో ఎలా వ్యవహరించాలో నిర్దేశించింది కూడా. అక్కడే స్టాలిన్ రొట్టె విరిగి నేతిలో పడినట్లయింది.సుప్రీంతీర్పు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది గనుక అందుకు బాధ్యుడైన స్టాలిన్ ఇమేజ్ అనేకరెట్లు పెరిగిపోయింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, పంజాబ్, జార్ఖండ్, కేరళ రాష్ట్రాలకు కూడా తక్షణ ప్రయోజనం కనిపించడంతో ఆ సిఎంలు కూడా సానుకూలంగా స్పందించారు. తమిళనాడుకే గాక అన్ని రాష్ట్రాలకు కూడా ప్రయోజనం కలగడంతో సిఎం లలో స్టాలిన్‌కు ఒక ప్రత్యేకత ఏర్పడింది. పెండింగులో ఉన్న పది బిల్లులకు మోక్షం లభించడంతో అతి కీలకమైన విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ నియామక సమస్యకు కూడా పరిష్కారం లభించింది. ముఖ్యమైన అణ్ణా విశ్వవిద్యాలయం, భారతియార్, భారతి దాసన్ వంటి తొమ్మిది వర్సిటీల విసి పోస్టులు చాలాకాలం నుంచి పెండింగులో ఉండిపోయాయి. నాయకత్వం లేకపోవడంతో వాటి పాలన కూడా అస్తవ్యస్తంగా మారింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాష్ట్ర ప్రభుత్వమే ఇక నేరుగా విసిల నియామకం చేపట్టవచ్చు. ఇలా అతి ముఖ్యమైన పదిబిల్లులకు మోక్షం లభించడంతో అది వచ్చే ఎన్నికల్లో స్టాలిన్‌కు ప్రధాన ఆయుధంగా ఉపయోగపడే అవకాశాలున్నాయి.



స్టాలిన్

యేడాది లోగా అసెంబ్లీకి ఎన్నికలు జరుగనుండడంతో, ఈ ఆయుధాన్ని ఉపయోగించుకొంటూ స్టాలిన్ తాజా వ్యూహరచన చేయవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా 'అసమ్మతి సిఎం'లు, బిజెపి వ్యతిరేకపార్టీల మద్దతు కూడగడుతున్న స్టాలిన్ సుప్రీం తాజా తీర్పును ఇతర అన్ని రాష్ట్రాల మద్దతును కూడగట్టడానికి కూడా ఇక ఉపయోగించవచ్చని భావిస్తున్నారు. ఇదే అదనుగా మరో కొత్తస్వరం కూడా వినిపిస్తోంది. ఎన్డీయే ప్రభుత్వం వివక్ష ధోరణిని ప్రదర్శిస్తున్నందువల్ల తమిళనాడుకు స్వయంప్రతిపత్తి లేదా ప్రత్యేక రాష్ట్రహోదా కల్పించాలనేడిమాండ్ తలెత్తుతోంది. నిజానికి ఇది పాత డిమాండే అయినా కొత్తగా వినిపిస్తోంది. ఆర్టికల్ 370ని రద్దుచేసి జమ్మూ కాశ్మీర్‌ను రెండుగా విభజించి స్వయంప్రతిపత్తి హోదా ఎలాకల్పించారో, తమిళనాడుకు కూడా అటువంటి స్వయంప్రతిపత్తినే కల్పించాలని డిఎంకె నేతలు మళ్లీ డిమాండ్ చేస్తున్నారు. ద్రవిడ ఉద్యమ సారథి పెరియార్ ప్రత్యేక తమిళ దేశం కోసం కృషి చేశారనీ, మొత్తం అన్ని రాష్ట్రాలకు తమిళనాడు ఇప్పుడు మార్గదర్శకంగా ఉన్నందున స్వయంప్రతిపత్తి ఇవ్వాలని కోరుతున్నామనీ డిఎంకె నేతలుపేర్కొంటున్నారు. ఇటువంటి డిమాండ్ చేస్తున్నవారందరికి సీనియర్ నేత ఎ.రాజా నాయకత్వం వహిస్తున్నారు. అదే నినాదంతో వారు ఎన్నికలకు వెళ్లే అవకాశం కూడా లేకపోలేదు.అటు డీలిమిటేషన్ వ్యవహారం, ఇటు గవర్నర్ వ్యవహారంవచ్చే ఎన్నికల్లో డిఎంకె ప్రధాన ఆయుధాలుగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. సుప్రీం తీర్పుతమకు ఎక్కువ ఓట్లు సాధించగల ఆయుధంగా ఉపయోగపడుతుందని కూడావారు భావిస్తున్నారు. బిజెపితో అన్నాడిఎంకె పొత్తు దాదాపు కుదిరినట్లే. గవర్నర్ వ్యవస్థకు వ్యతిరేకంగా మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చాలాకాలం నుంచి పోరాడు తున్నాయి. సుప్రీంతీర్పుతో వాటికి కూడా మరింత బలం చేకూరినట్లయింది గనుక, ఆబలం తమిళ నాడు వల్ల వాటికి సమకూరింది గనుక దాదాపు ఏడెని మిది రాష్ట్రాలు స్టాలిన్ నాయకత్వాన్ని బలపరచవచ్చనీ, ఈ కారణంగా ఆయన జాతీయ రాజకీయాల్లో కూడా చక్రం తిప్పే అవకాశాలుంటాయనీ అంటున్నారు. బిజెపి వ్యతిరేకనేతలలో కేజ్రీవాల్ బలహీనపడడం, మమతా బెనర్జీ అటు, ఇటుగా ఊగిసలాడడంతో స్టాలిన్ చూపు జాతీయ రాజకీయాలవైపు పడుతోందని కూడా తెలుస్తోంది. కుమారుడు ఉదయనిధికి రాష్ట్ర పగ్గాలు అప్పగించి, తాను జాతీయ రాజకీయాల్లో రాణించాలని స్టాలిన్ వాంఛిస్తున్నట్లుగా ఆయన సన్నిహితులే చెబుతున్నారు. దక్షిణాదికి కేంద్ర పదవుల్లో కీలక భాగం రావాలనీ, ప్రధాని, ఉప ప్రధాని పోస్టులలో ఒకటి దక్షిణాదికే ఇవ్వాలని చేస్తున్న డిమాండ్లను బట్టి చూస్తే స్టాలిన్ భవిష్యత్తు వ్యూహమేమిటో తేలికగానే విశదమవుతుంది. ఏది ఏమైనా, సుప్రీం తీర్పునకు ముందు, తర్వాత స్టాలిన్ కు అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయనిపిస్తుంది. 'స్టాలిన్ వ్యాప్తి' ని ఎదుర్కొనడానికి బిజెపి ఇక ఎటువంటి వ్యూహ రచన చేస్తుందో చూడాలి. ●

---

ఇథియోపియా

# అంతంలేని అంతర్గత పోరు!

గన్ని మోహన్

తూర్పు ఆఫ్రికా దేశం ఇథియోపియా అంతర్గత సంక్షోభంతో అట్టుడికిపోతోంది. తిరుగుబాటు దళాలతో నిత్యం ప్రభుత్వ ఆధ్వర్యంలోని సైనిక దళాలు పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. అయినా కూడా ఇప్పటికీ ఎక్కడో ఒకప్రాంతంలో తిరుగుబాటు జరగడం, అమాయక ప్రజలను పొట్టనపెట్టుకోవడం జరుగుతోంది. తిరుగుబాటు దళాల్లో అత్యంత ప్రముఖంగా ఉన్నఫానో గ్రూపు, అమ్‌హారా ప్రాంతంలోని ప్రభుత్వ దళాలకు మధ్య పోరు మరింతగా జరుగుతోంది. నిజానికి ఎరిత్రియా,డిజిబౌటి,సోమాలియా, కెన్యా, దక్షిణసూడాన్, సూడాన్‌లతో సరిహద్దులు కలిగి ఉన్న ఈ దేశంలో మహాఅయితే 13.50 కోట్లమంది జనాభా. భారత్‌లోని పెద్దరాష్ట్రంలోని ఒక పెద్ద జిల్లా అంతకూడా ఉండదు. అయితే విస్తీర్ణం, వైశాల్యంపరంగా ఆఫ్రికా ఖండంలోనే ఎక్కువ భాగం ఉండటంతో ఈ దేశంలో అంతర్గత ముసలం కూడా అదేస్థాయిలోపెరిగింది. పైగా పోరుగుననే ఉన్న దేశాల్లో నిరంతరం సాయుధ పోరాటాలే కొనసాగుతున్న వైనం ఈ దేశానికి కూడా వ్యాపించింది. వాస్తవానికి ఇథియోపియాలో అతిపెద్ద గ్రూపుగా ఉన్న అమ్హారప్రాంత దళంజాతీయ రాజకీయాలపై ఆధిపత్యం చెలాయించింది. తిరుగుబాటుదారుల్లో చాలా మంది మళ్లీ అధికారంలోకి రావాలన్న బలమైన కోరికతో తమకు వ్యతిరేక గ్రూపులతో నిత్యం పోరాటాలు చేస్తున్నారు. 2016లోనే జరిగిన ప్రభుత్వ వ్యతి రేక నిరసనల సమయంలో ఫానో ఆవిర్భావం జరిగింది. ఇక అప్పటి నుంచి కూడా అతిపెద్ద గ్రూపుగా ఉన్న అమ్హారా గ్రూపు పోరాటం మరింత ఉధృతం చేసింది. రానురాను శాంతి ఒప్పందాలను చేసుకుని ఇథియోపియాలో ప్రజా స్వామ్యయుత పాలనను కొనసాగించాలని భా వించినా ఇప్పటికీ తిరుగుబాట్ల మధ్యనే దేశప్రజ లు కొట్టుమెట్టాడుతున్నారు. 22 మిలియన్ల జనాభా ఉన్న పర్వతప్రాంతం అమ్హారాలో 80 శాతానికిపైగా ఇప్పుడు తిరుగుబాటు తెగ ఫానో నియంత్రణలోకి వచ్చింది. అమ్హారాస్ డిప్యూటీ హెడ్ మాత్రం ఖండిస్తూ మొత్తం 4174 ఉప జిల్లాల్లో 2225ప్రాంతాలను ఫానోనుంచి విముక్తి చేసామని చెప్పుకొచ్చారు. ఏదిఎలా ఉన్నా ఫానో అమ్హారా ప్రాంతంలో దాడులు ముమ్మరం చేయడంతో ప్రభుత్వదళాలు వాటిని కఠినంగా అణిచివేసాయి. హిట్ అండ్ రన్ పద్ధతిలో గెరిల్లా పోరాటాలు ఇథియోపియాలో సర్వసాధారణం అయిపోయా యి. ప్రధాన రోడ్లపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తిరుగుబాటు దళాలను ప్రభుత్వ నియంత్రిత ఏజెన్సీలు కట్టుదిట్టం చేస్తున్నా ఎప్పటికప్పుడు అశాంతినే ఈ గ్రూపులు రాజేస్తున్నాయి. ఒక్క ఏడాదికాలంలోనే ఫానో, ప్రభుత్వదళాల మధ్య 270సార్లు దాడులు జరిగాయి. అత్యంత కీలకమైన అమ్హారా ప్రాంతంలో వైద్యులు, ఆరోగ్య సంస్థలే టార్గెట్‌గా డజనుకుపైగా దాడులుకూడా జరిగాయి. అత్యంత కీలకమైన ఈ ప్రాంతంలో 3600 వరకూ ఉన్న స్కూళ్లు మూసి వేసారు.




అబ్బీ అహ్మద్

ప్రభుత్వసంస్థలు, గోదాములను దోచు కున్నారు. పిల్లలు పాఠశాల విద్యకు దూరం అయ్యారు. గతఏడాది 2.3 మిలియన్ల మందికి ఆహార సాయం అవసరమైంది. ఆకలి దప్పులు తట్టుకోలేని నిరుపేద కుటుంబాలు వలసలుపోయాయి. ఇప్పటికీ ఆహారకొరత ఆ దేశాన్ని పట్టిపీడిస్తోంది. ఐక్యరాజ్యసమితి మానవతా సాయం విభాగంతో పాటు, అంతర్జాతీయ శాంతి పరిరక్షక దళాల నుంచికూడా సాయం అందించేందుకు ముందుకువచ్చాయి. అయినా కూడా ఈ అంతర్గత సంక్షోభం ఈనాటిది కాదు. కొన్ని దశాబ్దాల నుంచి తిరుగుబాటు గ్రూపులు రాజకీయ ఆధిపత్యం కోసం చేస్తున్న పోరాటం కావడంతో ప్రజలు ఇప్పుడు విషమ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. కాల్పులమోతకు ఈదేశంలో ప్రజలు అలవాటు పడిపోయారు. ఆహారం కోసం ప్రజలకు వలసలు తప్పనిసరి అయ్యాయి. ఇరుగు పొరుగు దేశాల్లో కూడా జీవనోపాధి కష్టమే అవుతోంది. అక్కడ కూడా ఇలాంటి పోరాటాలే ఉండటంతో ఇథియోపియా ఒకవిధంగా చెప్పాలంటే తిరుగు బాట్ల చట్రంలో నలుగుతోంది. ఇప్పుడు ఫానో తిరుగుబాటును అణిచివేసేందుకు ఇథియోపియా సైన్యం కఠినకార్యాచరణ అమలు చేయడంతో విమర్శలు కూడా అదే స్థాయిలో వెల్లువెత్తాయి. డ్రోన్‌దాడులు చేయడం ప్రారంభించింది. టెక్నాల జీసాయంతో ఫానో సానుభూతిపరులను గుర్తించి అంతంచేయడం, లేదా వారిని అదృశ్యంచేయడం వంటి చర్యలకు పాల్పడిందన్న విమర్శలు పెరిగి పోయాయి. ఇథియోపియా సైనికులు, అనుబంధ మిలీషి యాలు దాడులు ఒక్క ఏడాదిలోనే అమ్హారా ప్రాంతంలో 13సార్లు మూకుమ్మడి దాడులుచేసాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్‌రైట్స్ వాచ్ వంటి సంస్థలు వీటిని తీవ్రంగా ఖండిస్తున్నా తిరుగుబాటు అణిచివేయాలంటే కఠినకార్యాచరణ కొంత అవసరం అవుతుందని చెపుతూ వస్తోంది. అణిచివేత పేరుతో సైన్యం అమ్హారా ప్రాంతీయ రాజధాని మెరావిలో ఇంటింటికీ వెళ్లి అమాయక పౌరులను బయటికి లాక్కొచ్చి మరీ కాల్చివేసాయని ఈసంస్థలు చెప్పాయి. తిరుగుబాటు అణిచివేత ఒక్కటేలక్ష్యంగా ప్రధాని అబ్బీ అహ్మద్ ముందుకు వెళ్లినా అంతర్గత పోరును అంతం చేయాలంటే శాంతిచర్చలు అవసరమని కూడా భావించి ఫానోగ్రూపులతో చర్చలు జరి పారు. అయితే ఎలాంటి పురోగతి లేకపోగా పరి స్థితి మరింత అదుపుతప్పింది. అమ్హారా ప్రాంతంలో ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్న యువతను ఫానో తన మిలిటరీ కింద నియామకాలు చేపడుతుండటంతో ప్రభుత్వ సైన్యానికి కఠిన అణచివేత అనివార్యమైంది. ఇపుడు తూర్పు ఆఫ్రికా దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ అంతర్గతపోరును అంతం చేయాలంటే కొంతకాలం పాటు సైనికపాలన అవసరమని దేశప్రజలే చెపుతున్నారు. అయితే చర్చలు సంప్రదింపులు దశముగి సిందని,ఇక అణిచివేత ఒక్కటే మార్గమని చెపుతున్న ప్రధాని అబ్బీఅహ్మద్ ఎంతమేర సఫలీకృతం అవుతారన్నది సందేహమే. ●


---

# ట్రంప్ పన్నులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు



డాక్టర్ కత్తి పద్మారావు

డొనాల్డ్ ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత ఆయన దుందుడుకు చర్యలకు అమెరికా అంతర్గతంగాను, అమెరికా బయట దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచానికి అమెరికా మరింత వేగంగా దూరమైపోతోంది. ఆర్థిక, విదేశాంగ విధానాలూ, సైనిక వ్యూహంలో మార్పులువస్తున్నాయి. ట్రంప్ నేడుప్రపంచ దేశాలన్నింటిపై ప్రతీకార సుంకాలు విధిస్తానంటున్నారు. పనామా కాల్వను, గ్రీన్లాండ్ను స్వాధీనం చేసుకుంటామన్నారు.కెనడా, మెక్సికోలు తమ దేశంలో కలిసిపోవాలనీ, గాజా నుంచి పాలస్తీనీయులు వెళ్లిపోవాలనీ వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి వలసదారులను వెళ్లగొడతామంటూ గగ్గోలు రేపారు. ఇజ్రాయేల్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు ఏకంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనే ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు ట్రంప్! ఉక్రెయిన్‌కు సాయంచేస్తూపోతే మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనడం, ఇంతవరకు చేసిన సాయానికి ప్రతిగా ఆ దేశంలోని అరుదైన ఖనిజవనరులను తమకివ్వాలని ఆయన డిమాండ్ చేయడం ప్రపంచాన్ని నివ్వెరపరచింది. అన్ని దేశాల మీద సుంకాలు విధిస్తున్న విధానానికి ప్రపంచ దేశాలు అన్నికూడా విస్తుపోతున్నాయి. 2420–25న బుధవారం నాడు ప్రపంచ దేశాలు అన్నికూడా విస్తుపోయేటట్లు వాషింగ్టన్లో ఈ ప్రకటన చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌బాంబుపేల్చారు. అనుకున్నట్లుగా విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలు వడ్డించారు. భారతదేశ ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్ వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, చైనాపై 34శాతం, యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై 20శాతం, స్విట్జర్లాండ్పై 31, తైవాన్పై 32, జపాన్పై 24, యూకేపై 10 శాతం సుంకాలను ఖరారు చేశారు. అన్నిదేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్ పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తేల్చిచెప్పారు. ఏప్రిల్ 2వ తేదీని విముక్తి దినంగా ప్రకటించిన ట్రంప్ బుధవారం వాషింగ్టన్‌లో మీడియాతో మాట్లాడారు నిజానికి అమెరికా తెల్ల భవనంపైకి ఎంతో మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడినట్టుగా కనిపించినా దాని అంతర్గతంగా అది అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను కొల్లగొడుతూనే వస్తుంది. ఈ విషయంగా ఆయన పన్నులు ప్రకటించకముందే ప్రపంచ దేశాల ఆర్థిక శాస్త్రవేత్తలంతా అనేకరూపాల్లో ఈ విషయాలను వెల్లడిస్తూనేవచ్చారు.వారు ఈవిధానాల వల్ల అమెరికా కూడా ఒంటరైపోతుందని, అమెరికాలోని ప్రజలు కూడా సంక్షోభానికి గురి అవుతారని ఒకవారంగా అనేక విశ్లేషణలు ఇలా వెలువడుతూనే వచ్చాయి. ట్రంప్ ఈసారి 1.4 లక్షల కోట్లడాలర్ల విలువైన సుంకాలను పెంచేందుకు రంగం సిద్ధం చేస్తుండటం ఇండియానే కాదు, మొత్తం ప్రపంచ ఆర్థిక రంగాన్నే తీవ్రంగా ప్రభావితం చేయనుంది! విదేశాల నుంచి అమెరికా చేసుకున్న మొత్తం దిగుమతుల విలువ నిరుడు 6.6శాతం మేర పెరిగి 4.1 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అదే సమయంలో ఆ దేశ వస్తుసేవల ఎగుమతులేమో 3.2 లక్షల కోట్లడాలర్లకే పరిమితమయ్యాయి. చైనా, వియత్నాం, మెక్సికో, తైవాన్,జపాన్, కెనడా,దక్షిణకొరియా, ఇండియా, థాయిలాండ్ తదితరాలతో పాటు యూరోపియన్ యూనియన్ దేశాలతోనూ అమెరికాకు భారీ వాణిజ్యలోటు ఉంది. దాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై ప్రతీకార సుంకాల ద్వారా వేల కోట్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని రాబట్టాలని భావిస్తున్నారు. తన ఎన్నికల వాగ్దానమైన పన్నుల కోతలను అమలు చేయడానికి ఈ నిధులను వినియోగించుకోవాలన్నది ఆయన ఆలోచనగా చెబుతున్నారు. కానీ, ఆక్రమంలో ఆయన అమెరికాను ఏకాకిని చేస్తున్నారు. ఇప్పటికే ట్రంప్ విధించిన సుంకాలను ఎదుర్కోవడానికి చైనా,జపాన్, దక్షిణ కొరియా ఏకతాటిపైకి వస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈయూ దేశాలు సైతం ప్రతి స్పందించడానికి సంసిద్ధమవుతున్నాయి. ఏతావాతా అగ్రరాజ్య పరపతిని పణంగా పెట్టి మరీ ట్రంప్




ఆడుతున్న సుంకాల చదరంగం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో చూడాలి! దగ్గర దగ్గర ప్రపంచంలో ఉన్న ఏ ఆర్థిక మేధావి కూడా అమెరికాకు అనుకూలంగా ఒక్కవాక్యం కూడా రాయడం లేదు అనేది స్పష్టమైన అంశం. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారతవిదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జయశంకర్ హాజరయ్యాడు. అనేక విషయాలను ఆయన గమనించారు. అమెరికా అధ్యక్షుడు జె.డి.వాన్సనూ భేటీ అయ్యారు. ఇంకా అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ సంస్థల డైరెక్టర్ తులసీగాబర్ట్, ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి, జాతీయ భద్రతా సలహాదారు మైకేల్ వాల్ట్ తదితర ముఖ్యులతో సమావేశమయ్యారు. వీరందరు కలిశాక ట్రంప్ మనస్సులో ఉన్న విషయాలను జయశంకర్ కొంత అవగాహన చేసుకున్నాడు. దానిలో ముఖ్యమైనది అమెరికాకు పూర్వవైభవం తేవాలంటే ఇతరదేశాలకు, దిగుమతులకు ఎక్కువ సుంకాలు పెంచాలని అభిప్రాయపడుతున్నట్టు మన విదేశాంగమంత్రి గమనించారు.నిజానికిఅమెరికాతో వాణిజ్యం సాగిస్తున్న పది ప్రధాన దేశాల్లో ఇండియా ఒకటి.అంతేకాక ఇప్పుడుఅమెరికా అధ్యక్షునిపై అక్కడ వాణిజ్యసంస్థల భాగస్వామ్యం ఒత్తిడి కూడా బలంగానే ఉంది. భాగస్వామ్య దేశాల చట్టవ్యతిరేక వాణిజ్య పద్ధతులపై యుఎస్టిఆర్ ఇటీవల సమీక్షచేపట్టిన సంగతి తెలిసిందే. భారత వినియోగదారులకు అవసరమైన ఔషధాలను తక్కువ ధరలకు పొందేందుకు వీలుగా ఆరోగ్యసంరక్షణ రంగంలో వాణిజ్యాన్నిపెట్టుబడులను ప్రోత్సహించేలా ఔషధతయారీ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాలని అమెరికాలోని అతి పెద్ద వాణిజ్య సంప్రదింపులసంస్థ యుఎస్ఎస్సిసి కోరింది. ప్రపంచ సరఫరా గొలుసును బలోపేతం చేసే ఔషధ తయారీకి రెండవస్థానంలోకి అనుమతించే నిబంధనలను చేర్చడానికి అవసరమైన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కోరింది. పేటెంట్ పొందిన మందులు, స్టెంట్లు, మోకాలి ఇంప్లాట్స్ వంటి వైద్య పరికరాలపై జాతీయ ప్రాముఖ్య మెడిసిన్స్ జాబితా కింద ధరల నియంత్రణను, భారత్లో మెడిసిన్ తయారీ ఉత్పత్తుల పెట్టుబడులను నిరోధించే వాణిజ్య విధానాలను, నకిలీ మెడిసిన్ ముప్పును కూడా యుఎస్సిసి ప్రస్తావించింది. అమెరికన్ కంపెనీల లాభదాయకతను ప్రతికూలంగా ప్రభావితం చేసే సిన్ /డిమెరిట్ వస్తువుల వర్గీకరణ కింద ఆల్కహాల్ లేని పానీయాలపై 28 శాతం జిఎస్టిని తగ్గించాలని యుఎస్ సిసి కోరింది. వివిధ దేశాల్లో అమెరికా తయారీ మోటార్సైకిల్స్ దిగుమతి సుంకాలు అసమానతను హార్లే దేవిడ్సన్ కంపెనీ ప్రస్తావించింది. మోటార్సైకిల్సపై యూరోపియన్ యూనియన్లో 68 శాతం సుంకం చెల్లిస్తుండగా, బ్రెజిల్లో 18శాతం, థాయిలాండ్లో 60శాతం ఉండగా, భారత్లో ఈ సుంకం రేటు100 శాతంగా ఉందని స్పష్టంచేసింది.అమెరికా నిజానికి ప్రపంచ దేశాలకు ఎన్నో సాంకేతిక అంశాలను, సాంస్కృతిక విస్తృత అంశాలను నేర్పిందనే వాదన కూడా ఉంది. ట్రంప్ పాలనలోని అమెరికా ఫస్ట్ విధానం అమెరికా ప్రయోజనాలనే అన్నింటికంటే ముందు ఉంచడానికి ప్రయత్నిస్తుంది. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల తీర్పును రద్దు చేయడానికి లేదా కళంకం లేని న్యాయ వ్యవస్థపై దాడి చేయడానికి అమెరికా అధ్యక్షుడు చేసినప్రయత్నం ప్రజాస్వామ్యంలోని ముఖ్యమైన వ్యవస్థలను దుర్బలం చేసింది. ఈక్రమంలో మనంఆలోచించినట్లయితే ఆయన పెంచే పన్నుల వల్ల ప్రపంచ వాణిజ్య వ్యవస్థే అల్లకల్లోలం అవుతుందని అనక తప్పదు. అమెరికా ఫస్ట్ నినాదంతో ట్రంప్ సృష్టించిన సుంకాల పెంపువివాదం ప్రపంచ విపణిలో అమెరికా ఆధిపత్యాన్ని పెంచేందుకేనన్నది సుస్పష్టం. పర్యవసానంగా వివిధ దేశాల మార్కెట్లలో అమెరికా కంపెనీలు ప్రవేశిస్తాయి. తద్వారా అమెరికా కంపెనీల లాభాలు పెరుగుతాయి. ట్రంప్ దుందుడుకు విధానాల వల్ల అమెరికా ఆర్థికవ్యవస్థే అతలాకుతలమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మార్చి10న అమెరికా స్టాక్ మార్కెట్ భారీగా పతనమైంది. నాలుగు లక్షల కోట్ల డాలర్ల మేర సంపద విలువ ఆవిరైంది.దీనికితోడు ఉద్యోగుల తొలగింపు, పొదుపు పేరుతో ప్రభుత్వ వ్యయానికి విధిస్తున్న పరిమితులు మార్కెట్ను కుంగదీస్తున్నాయి. భారతదేశం ఇలాంటి ఒడిదు దుకులను ఎన్నింటినో ఎదుర్కొంది. ఎంతో మంది ప్రపంచ నియంతలను చూసింది. ఈనాడు భారతదేశం చేయాల్సిన పని దేశీయ సంపదను పెంచుకోవడం చైనా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, కెనడా వంటి దేశాలతో సంబంధాలను మరింతగా మెరుగుపరచుకోవాలి. ●

## చంద్రుడిపై మానవ వ్యర్థాల తొలగింపునకు ఐడియా ఇవ్వండి..

# రూ.25 కోట్ల ప్రైజ్‌మనీ పట్టుకెళ్లండి: నాసా



**వాషింగ్టన్, ఏప్రిల్ 12:** చంద్రుడిపై దాగి ఉన్న పలు విషయాలను తెలుసుకునేందుకు చాలా దేశాలు ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. దాదాపు 50 ఏళ్లుగా అమెరికా అంతరిక్ష సంస్థ నాసా (ఎన్ఎస్ఏ) జాబిల్లిపైకి తమ వ్యోమగాములను పంపుతోంది. దీంతో అక్కడ మానవ వ్యర్థాలు కుప్పగా పేరిగిపోయింది. ఈ నేపథ్యంలోనే నాసా ఓ ఆఫర్ ప్రకటించింది. వాటిని తొలగించేలా లేదా రీసైక్లింగ్ చేసేలా వినూత్న పరిష్కారం చెబితే మూడు మిలియన్ డాలర్ల (దాదాపు 25 కోట్లు) నజరానా అందిస్తామని తెలిపింది. నాసా 1969 నుంచి 1972 మధ్య కాలంలో అపోలో మిషన్ ద్వారా వ్యోమగాములను చంద్రుడిపై పరిశోధనల కోసం పంపించింది. ఆరుసార్లు విజయవంతంగా మిషన్ల ల్యాండింగ్స్ జరిగాయి. వ్యోమగాములు పరిశోధన కోసం జాబిల్లి నుంచి కొంత సామాగ్రి తీసుకువచ్చాయి. అయితే లూనార్ మాడ్యూల్లో నిల్వ ఉంచే పరిమితిని దృష్టిలో ఉంచుకున్న వ్యోమగాములు అనవసరమైన వస్తువులను బయటకు విసిరేసి వచ్చారని నాసా తాజాగా తెలిపింది. వీటిలో మానవ వ్యర్థాలే అధిక మొత్తంలో ఉన్నట్లు వెల్లడించింది. వీటిని చిన్నచిన్న బ్యాగుల్లో ఉంచి జాబిల్లిపై పడేసి వచ్చారని తెలిసింది. ఇలా మొత్తం 96 సంచుల వ్యర్థాలు చంద్రుడిపై ఉన్నాయి. వాటిని అక్కడి నుంచి తొలగించాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకున్న నాసా ఈ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. లూనార్ రీసైకిల్ ఛాలెంజ్ పేరిట దీన్ని ప్రారంభించింది. వ్యర్థాలను నీరు, శక్తి, ఎరువుగా మార్చేందుకు ఉపాయాలు ఇవ్వాలంటూ ఆహ్వానంపలికింది. ఈ ఛాలెంజ్‌లో గెలిచిన వారికి 3మిలియన్ డాలర్లు అందజేస్తామని ప్రకటించింది. చంద్రుడిపైనే కాక అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు తాము ఉపయోగించిన వస్తువులను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ వినియోగిస్తుంటారు. అక్కడ ఉండే మానవ సంబంధిత వ్యర్థాలను నిర్మూలించాలన్నా, తిరిగి భూమిపైకి తీసుకురావాలన్నా సవాళ్లతో కూడుకున్న అంశం. ఈ కోణంలోనూ ఆలోచించిన నాసా తాజాగా ప్రకటన చేసింది. భవిష్యత్తులో చందమామపైకి మానవులను తీసుకెళ్లడం, అక్కడ వారి జీవన విధానాన్ని పెరుగు పరచడంలో ఇప్పుడు ఇచ్చే ఐడియా ఎంతో కీలకమవ్వనున్నట్లు తెలుస్తోంది.

## బిజెపి తమిళనాడు చీఫ్‌గా నైనార్ నాగేంద్రన్



**చెన్నై, ఏప్రిల్ 12:** బీజేపీ తమిళనాడు అధ్యక్షుడిగా పార్టీ నేత, తిరునల్వేలి ఎమ్మెల్యే నైనార్ నాగేంద్రన్ ఎన్నికయ్యారు. చెన్నైలో నిర్వహించిన పార్టీ సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ఛుగ్‌లు ఈ మేరకు ప్రకటన చేశారు. నాగేంద్రన్ ఒక్కరి నుంచే నామినేషన్ రావడంతో ఆయనకే ఈ పదవి ఖరారైంది. ఈ ఎన్నిక వెనక కేంద్రమంత్రి అమిత్‌షా నిర్ణయాలు కీలకంగా పనిచేసినట్లుగా సమాచారం. వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి, అన్నాడిఎంకెలు జట్టు కట్టిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. కన్యాకుమారి జిల్లా నాగర్‌కొయిల్ సమీపంలోని వడివీశ్వరంలో 1960లో నాగేంద్రన్ జన్మించారు. ముందు అన్నాడి ఎంకెలో ఉన్న ఆయన తర్వాత బిజెపిలో చేరారు. 2020 జులై నుంచి కాషాయ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జయలలిత, పన్నీర్ సెల్వం ప్రభుత్వాల్లో పలు శాఖలకు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ప్రభుత్వ పాలన, ప్రజలతో మమేకం, రాజకీయాల్లో వ్యూహాలపై పట్టు ఉండటంతో అధిష్ఠానం ఆయన వైపు మొగ్గుచూపినట్లు విశ్లేషకుల అంచనా. అన్నాడిఎంకె, బిజెపిలను సమన్వయం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తారని భావిస్తున్నారు.

## చైనాను అతలాకుతలం చేసిన దుమ్ముతుపాను

### 693 విమానసర్వీసులు రద్దు

**బీజింగ్, ఏప్రిల్ 12:** చైనాలో బలమైన గాలులతో పాటు ఇసుక తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. దేశ ప్రజలంతా భయంతో విలవిల్లాడిపోతుండగా అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. ఎక్కడ ఉన్న వాళ్లంతా అక్కడే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దంటూ ప్రజలకు సూచనలు జారీ చేసింది. అలాగే వందలాది విమాన సర్వీసులను, రైళ్ల రాకపోకలను రద్దు చేసింది. అంతేకాకుండా దేశంలో జరుగుతున్న ఫుట్‌బాల్ మ్యాచ్‌లు సహా ఇతర ముఖ్య కార్యక్రమాలను సైతం నిలిపి వేసింది. డ్రాగన్‌దేశంలో శనివారం రోజు ఉదయం నుంచే బలమైన గాలులు వీస్తున్నాయి. దీనికి తోడు ఇసుక తుఫాను కూడా వస్తుండటంతో దేశం అంతా అల్లకల్లోలంగా మారిపోతోంది. దేశ రాజధాని బీజింగ్‌లో అయితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. భారీ గాలులకు అనేక చెట్లు నేలకొరిగాయి. ఎత్తైన స్తంభాలు సైతం పడిపోయాయి. మనుషులు సైతం గాలికి కొట్టుకుపోతుండడం, తీవ్రంగా ఇసుక గాల్లో కలిసి మనుషులపైకి దూసుకొస్తుండడంతో అక్కడి సర్కారు అప్రమత్తమైంది. బీజింగ్, డాక్సింగ్‌లో మధ్యాహ్నం వరకే వందలాది విమాన, రైల్వే సర్వీసులను రద్దు చేసింది. ముఖ్యంగా మధ్యాహ్నం 2 గంటల వరకు మొత్తంగా 693 విమాన సర్వీసులను రద్దు చేసింది. అలాగే స్థానికంగా ఉన్న పార్కులను తాత్కాలికంగా మూసేశారు. అంతేకాకుండా ఫుట్‌బాల్ మ్యాచ్‌లు , ఇతర ముఖ్యమైన కార్యక్రమాలను సైతం నిలిపి వేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ గాలులు, ఇసుక తుఫాను ప్రభావం కొనసాగుతుండగా 75ఏళ్లలో ఎన్నడూ ఇంత శక్తివంతంగా గాలులు వీచలేదని సర్కారు చెబుతోంది. ముఖ్యంగా చైనా ఉత్తర, తీర ప్రాంతాల్లో ప్రమాదకర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రజలు ఎక్కడ ఉన్నవారక్కడే ఉండాలని, బయటకు రావద్దని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. ఎలాంటి అత్యవసరం ఎదు రయినా అధికారుల సాయం తీసుకోవాలని చెప్పారు.



## సుప్రీం తీర్పుపై కేరళ గవర్నర్ అసహనం

**తిరువనంతపురం, ఏప్రిల్ 12:** శాసనసభ ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతి నుంచి గవర్నర్ వరకు నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిని న్యాయవ్యవస్థ మితిమీరిన జోక్యంగా ఆయన అభివర్ణించారు.మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శాసన సభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించాలా?వద్దా? అనేది పూర్తిగా పార్లమెంట్ పరిధిలోని విషయమని, ఇది ఏ మాత్రం కోర్టుల పరిధిలోని అంశం కాదని ఆర్లేకర్ పేర్కొన్నారు."బిల్లులపై గవర్నర్ ఎంత కాలపరిమితిలోపు నిర్ణయం తీసుకోవాలి? అనేది రాజ్యాంగంలో లేదు. ఒక వేళ సుప్రీంకోర్టు ఈ కాలపరిమితిని నిర్దేశిస్తే, అది రాజ్యాంగ సవరణకు సమానం అవుతుంది. కానీ కోర్టు అలా చేయడానికి వీలులేదు. ఇది పార్లమెంట్‌కు మాత్రమే ఉన్న అధికారం.సుప్రీంకోర్టు ఆ అధికారం లేదు! సుప్రీంకోర్టు తమిళనాడు, కేరళ సమస్యలు భిన్నమైనవని ఆయన అన్నారు. ఏదేమైనా ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనకు పంపించకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు."రాజ్యాంగ సవరణలు న్యాయవ్యవస్థ చేస్తుంటే, శాసన సభ, పార్లమెంట్‌లు ఎందుకు? ఇలాంటి అంశాల్లో సవరణలు చేయాలంటే పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీ ఉండాలి. అలాంటిది ఇద్దరు న్యాయమూర్తులకు రాజ్యాంగాన్ని మార్చేంత అధికారం ఉంటుందా? ఇది పూర్తిగా న్యాయపరమైన అతిక్రమణ. కోర్టు తీర్పుల్లో జాప్యం ఎందుకు? బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. కానీ అది కేవలం కార్యనిర్వాహక వర్గానికి మాత్రమే పరిమితమైంది కాదు. హైకోర్టులు, సుప్రీంకోర్టులు ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. న్యాయమూర్తుల వద్ద ఈ జాప్యాలకు తగిన కారణాలు ఉన్నట్లే, గవర్నర్‌లకు కూడా తగిన కారణాలు ఉంటాయి. దానిని అందరూ అంగీకరించాల్సిందే అని అర్లేకర్ అన్నారు. గవర్నర్లు బిల్లులు ఆమోదించడానికి తగిన కాలపరిమితి ఉండాలని ప్రజలు భావిస్తే, దానిని పార్లమెంట్‌లో చర్చించి, తరువాత మాత్రమే అమలు చేయాలని ఆర్లేకర్ అన్నారు.ఇది చారిత్రాత్మకం. మరోవైపు రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు చర్య తీసుకోవడానికి గడువువిధిస్తూ సుప్రీంకోర్ట్ ఆదేశించడాన్ని రాజ్యసభ ఎంపీ కబిల్ సిబల్ సమర్థించారు. సుప్రీం తీర్పు సమాఖ్యవాదానికి ఎంతో మంచిదని, చరిత్రాత్మక తీర్పు అని కొనియాడారు. సుప్రీంకోర్ట్ తాజాతీర్పుతో, డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వానికి అది పెద్దవిజయం లభించింది. దేశంలో మొదటిసారి గవర్నర్ ఆమోదం లేకుండానే 10 బిల్లులు చట్టంగా మారాయి.

# 21న భారత్‌కు అమెరికా ఉపాధ్యక్షుడు రాక

### ఆయనతోపాటే ఎన్ఎస్ఏ మైఖేల్ వాల్జ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్జ్ ఈనెల 21న భారత్‌కు రానున్నట్లు సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుదేశాలపై ప్రతీకార సుంకాలు విధించి, వాణిజ్య యుద్ధం ప్రారంభించిన నేపథ్యంలో, ఈ ఇరువురు నేతలు భారత్‌కు రానుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. వాన్స్‌కు మోదీ విందు ఏర్పాటుచేస్తారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాతీయ భద్రతా సలహాదారు వాల్జ్ ఇద్దరూ వేర్వేరుగా భారత్‌లో పర్యటించనున్నట్లు అమెరికా వర్గాలు చెబుతున్నాయి. వాన్స్ తన కుటుంబంతో కలిసి ప్రైవేట్‌గా భారత్‌లో పర్యటన చేయనున్నారు. వాన్స్ భార్య చిలుకూరి ఉష తెలుగు మూలాలున్న అమెరికన్. ఆమె ప్రస్తుతం అమెరికన్ సెకండ్ లేడీగా ఉన్నారు. వారు తమ పిల్లలతో కలిసి వేసవి కాలంలో సిమ్లా, హైదరాబాద్, జైపూర్, దిల్లీలో పర్యటించనున్నారని సమాచారం. అయితే వాన్స్‌ది ప్రైవేట్ పర్యటన అయినప్పటికీ భారత ప్రధాని నరేంద్ర మోదీ, వారిని విందుకు ఆహ్వానించే అవకాశం ఉందని సమాచారం. 21నుంచి 23 వరకూ వాల్జ్‌ది మాత్రం పూర్తిగా అధికారిక పర్యటన ఆయన ప్రధాని మోదీతో కలిసి ఇండో పసిఫిక్ భద్రతతో సహా పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. అలాగే హై టెక్నాలజీ, ఖనిజాలు, ఎగుమతులు మొదలైన రంగాల్లో పరస్పర సహకారం గురించి చర్చించే అవకాశం కూడా ఉందని తెలుస్తోంది. ఈనెల 22 నుంచి రెండు రోజుల పర్యటన కోసం వాన్స్, వాల్జ్ ఇద్దరూ సౌదీ అరేబియాకు వెళ్లనున్నారు. అయితే అంతకు ముందే వారిద్దరూ భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉంది. వాల్జ్ ఎన్ఎస్ఏ అజిత్ ధోవాల్, విదేశాంగ మంత్రి జైశంకర్‌లతోనూ చర్చలు జరిపే అవకాశం ఉంది. భారత్‌పై టారిఫ్‌ల భారం తగ్గిస్తారా?డొనాల్డ్ ట్రంప్ చైనా మినహా మిగతా దేశాలన్నింటికీ 90 రోజుల పాటు టారిఫ్ రిలీఫ్ ప్రకటించారు. దీనితో అప్పటి వరకు భారీ నష్టాల్లో మునిగిపోయిన స్టాక్ మార్కెట్లు కాస్త కోలుకున్నాయి. అయితే ఇదే సమయంలో చైనా, అగ్రరాజ్యం అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించి వాణిజ్య యుద్ధాన్ని మరింత ఉద్ధృతం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ పర్యటనకు వాన్స్, వాల్జ్‌లు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బహుశా వాణిజ్య సుంకాల విషయంలో వీరు కీలక చర్చలు జరిపే అవకాశం ఉందని తెలుస్తోంది.

## పపువా న్యూగినియాలో భూకంపం: రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.2

**పోర్ట్‌మోర్స్‌బే, ఏప్రిల్ 12:** పపువా న్యూగినియాలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.2గా నమోదైంది. శనివారం కోకోపో పట్టణానికి 115 కి.మీ. దూరంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే పేర్కొంది. దాదాపు ఒక నిమిషం పాటు భూమి కంపించిందని స్థానికంగా ఉన్న ఒక రిసార్ట్ నిర్వాహకుడు తెలిపారు. అయితే, తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. పపువా న్యూ గినియాలో భూకంపాలు సర్వసాధారణమే. అయినప్పటికీ ఈ ప్రకృతి విపత్తు కారణంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఇక, ఇటీవల మయన్మార్, థాయ్‌లాండ్‌లలో 7.7 తీవ్రతతో భారీ భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. దీని కారణంగా ఒక్క మయన్మార్‌లోనే మూడువేల మందికిపైగా చనిపోయారు. వేల సంఖ్యలో గాయపడగా పలువురు గల్లంతయ్యారు.

## అణుఒప్పందంపై పరోక్ష చర్చల దిశగా ఇరాన్, అమెరికా అడుగులు



**టెహ్రాన్, ఏప్రిల్ 12:** అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యూక్లియర్ డీల్‌పై పరోక్ష చర్చల దిశగా ఇరాన్, యుఎస్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ తన అణు కార్యక్రమంపై అమెరికాతో న్యాయమైన ఒప్పందం చేసుకోవడానికే ఎదురుచూస్తోందని.. ఖమేనీ సన్నిహితుడు అలీ షమ్ఖానీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. కెమెరాల ముందు మాట్లాడుతూ, అందరికీ ప్రదర్శనలు ఇవ్వడానికి బదులు టెహ్రాన్ నిజమైన, న్యాయమైన ఒప్పందాన్ని కోరుతోందని ఆయన అన్నారు. ఇందుకు ముఖ్యమైన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అమెరికాతో పరోక్ష చర్చల కోసం మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఇరాన్ తమ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చిని ఒమన్‌కు పంపుతున్నట్లు షమ్ఖానీ వెల్లడించారు. ఈ విషయంలో వాషింగ్టన్ అసంబద్ధమైన డిమాండ్లను, సమస్యలు లేవనెత్త కుండా అనుకూలంగా వ్యవహరిస్తే.. అగ్రరాజ్యంతో కొత్త అణు ఒప్పందాన్ని కుదు ర్చుకునే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం టెహ్రాన్ అణు కార్యక్ర మంపై ఒప్పందం కుదుర్చుకునే లక్ష్యంతో ఇరాన్, అమెరికా శనివారం ఒమన్‌లో దౌత్యపరమైన చర్చ లు జరపనున్నాయి. ఈ చర్చలకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి, అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ నాయకత్వం వహించను న్నారు. ఈ నేపథ్యంలో అలీ షమ్ఖానీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అణు ఒప్పందం విషయంలో ఇరాన్ తమతో ప్రత్యక్ష చర్చలకు రావాలని అమెరికా కోరుతుండగా.. పరోక్ష చర్చలైతేనే తాము ముందుకు వస్తామని ఖమేనీ స్పష్టం చేశారు. అయితే ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై సైనిక చర్యలుతీసుకోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ఇక ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా2018లో ట్రంప్ హయాంలోనే దాని నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

## పాకిస్తాన్‌లో భూకంపం: జమ్ముకాశ్మీర్‌లోను ప్రకంపనలు



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 12:** పొరుగుదేశం పాకిస్థాన్ లో భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 5.8గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. పాక్ రాజధాని ఇస్లామాబాద్ సమీపంలో శనివారం మధ్యాహ్నం 1 గంట స్థానిక కాలమానం ప్రకారం సమయంలో భూ ప్రకంపనలు నమోదైనట్లు తెలిపింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు పేర్కొంది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ భూకంపం ధాటికి జమ్ము కశ్మీర్‌లోనూ భూమి కంపించింది.

## బెంగాల్‌లో చెలరేగిన ఉద్రిక్తతలు

# ముగ్గురు మృతి, 110 మంది అరెస్టు



**కోల్‌కత్తా, ఏప్రిల్ 11:** వక్ఫ్ (సవరణ) చట్టంకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ లోని ముర్షిదాబాద్‌లో మళ్లీ హింస చెలరేగింది. శుక్రవారం నుంచి కొనసాగుతున్న నిరసనలు మళ్లీ హింసాత్మకంగా మారాయి. శనివారం మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి రోడ్లను దిగ్బంధించారు. ఆపడానికి ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపై నిరసనకారులు రాళ్లు రువ్వడంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. నిరసనలు ఉద్రిక్తతలకు దారితీసిన సంఘటనల్లో ఇప్పటివరకూ ముగ్గురు చనిపోయారని పోలీసులు ప్రకటించారు. ఘర్షణల్లో ఇద్దరు మృతిచెందగా కాల్పుల్లో మరొకరు మృతి చెందారని తెలిపారు. ఆందోళన కారులను అదుపు చేసేందుకు పోలీసులు మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ హింసకు కారణమైన 110 మందికిపైగా నిరసనకారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పరిస్థితి ఇప్పటికీ ఉద్రిక్తంగానే ఉందని, హింసాత్మక చర్యలు నెలకొంటున్న నేపథ్యంలో ముర్షిదాబాద్ జిల్లాలో పలు నిషేధాజ్ఞలు విధించామని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేశామని అధికారులు తెలిపారు. శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యాప్తిచేస్తున్న వదంతులను పట్టించుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఘర్షణల్లో గాయపడిన 10 మంది పోలీసులు ఓ యువకుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వక్ఫ్ చట్టం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిందని, ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని, అయితే పశ్చిమబెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవల ప్రకటించారు. మైనారిటీలు, వారి ఆస్తులను రక్షిస్తానని హామీ ఇచ్చారు. ఒకప్పుడు బంగ్లాదేశ్, పాకిస్థాన్, భారతదేశం కలిసి ఉండేవని, తర్వాత విభజన జరిగిందని అన్నారు. ఇక్కడే ఉండిపోయిన మైనారిటీలకు రక్షణ కల్పించడం మన బాధ్యతని, తాను ఉన్నంతకాలం వారిని, వారి ఆస్తులను రక్షిస్తానని చెప్పారు. కాగా, తాజాగా చోటుచేసుకున్న నిరసనలపై బెంగాల్‌లోని ప్రతిపక్ష బీజేపీ స్పందించింది. పరిస్థితిని అదుపు చేయడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శలు గుప్పించింది. దీన్ని అదుపులోకి తీసుకురావడానికి అవసరమైతే కేంద్రం సహాయం తీసుకోవాలని సూచించింది. ఇది నిరసన చర్యగా కనిపించట్లేదని, సమాజంలోని ఇతర వర్గాల్లో గందరగోళాన్ని వ్యాప్తి చేయడానికి దుష్టశక్తులు చేస్తున్న ప్రయత్నమని మండిపడింది.

## చట్టంచేసిన కేంద్రాన్నే ప్రశ్నించండి

### వక్ఫ్‌చట్టం బెంగాల్‌లో అమలుచేయం



**కోల్‌కత్తా, ఏప్రిల్ 12:** వక్ఫ్‌చట్టం అమలు పరంగా పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి తన వైఖరిని స్పష్టంచేసారు. బెంగాల్‌లో అమలుచేయబోమని పునరుద్ఘాటించారు. వక్ఫ్‌సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చెలరేగిన నేపథ్యంలో ఈస్పందన వచ్చింది. వక్ఫ్‌చట్టం మంగళవారంనుంచి అమ లులోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ నోటిఫికేషన్‌జారీచేసింది. దీనితో శనివారం బెంగాల్‌లోని ముర్షిదాబాద్, మాల్దా, సౌత్ 24 పరగణాలు, హుగ్లీజిల్లాల్లో నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిరోడ్లను దిగ్బంధించారు. వారిని ఆపడానికి ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడులుచేయగా హింసాత్మక పరిస్థితి నెలకొంది. దీనితో 110 మందికిపైగా నిరసనకారులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇంటర్నెట్‌సేవలు నిలిపివేసారు. ఈక్రమంలో మమతా ఎక్స్‌వేదికగా స్పందించారు. ప్రతిజీవితంఎంతో విలువైందని రాజకీయాలకోసం అల్లర్లకు పాల్పడవద్దని అలాంటి వారు సమాజానికే ప్రమాదకారులని అన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కొన్ని పార్టీలు రాజకీయ లబ్ధికోసం మతాన్ని దుర్వినియోగంచేసేప్రయత్నాలుచేస్తున్నాయని, అలాంటి చర్యలకు లొంగిపోవద్దని పిలుపునిచ్చారు. మతం అంటే మానవత్వం, నాగరికత, సామరస్య అని శాంతిసామరాస్యాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నట్లు తెలిపారు. మీరంతా వ్యతిరేకిస్తున్న చట్టం చేసింది మేం కాదని, కేంద్రం అని మీకు కావాల్సిన సమాధానాలు అడగాల్సింది కేంద్రాన్ని అని స్పష్టంచేసారు. ఆ చట్టాన్ని బెంగాల్‌లో అమలుచేయబోం అని సీఎం స్పష్టంచేసారు.



## కథక్ కళాకారిణి కుముదిని కన్నుమూత

**అహ్మదాబాద్, ఏప్రిల్ 12:** ప్రముఖ కథక్ కళాకారిణి కుముదుని లఖియా 95వ ఏట కన్నుమూసారు. శనివారం ఉదయం అహ్మదాబాద్‌లో ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుముదుని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 1930లో జన్మించారు. ఈ నృత్యకళా రూపాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 1967లో అహ్మదాబాద్‌లో కదంబ సెంటర్‌ఫర్ డ్యాన్స్ సంస్థను స్థాపించారు. ఇందులో ఆమెచేసిన కృషికిగాను 2025లో భారత ప్రభుత్వం ఆమెకు పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించింది. అంతకుముందే పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డునుకూడా అందుకున్నారు.

## సూట్‌కేస్‌లో గర్ల్‌ఫ్రెండ్: జిందాల్ వర్సిటీ విద్యార్థి సాహసకృత్యం



**సోనిపట్(హర్యానా), ఏప్రిల్ 12:** ప్రేమించిన అమ్మాయిని కలవానుకున్న ఒక విద్యార్థి పెద్ద సాహసం చేసాడు. తన గర్ల్‌ఫ్రెండ్‌ను ఎవరికీ తెలియకుండా సూట్‌కేస్‌లో కూర్చోబెట్టి బాయ్స్ హాస్టల్‌కు తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. అయితే యాజమాన్యానికి అనుమానం వచ్చి సూట్‌కేస్ తెరవడంతో అసలు విషయం బయటపడింది. హర్యానాలోని సోనిపట్‌లో ఉన్న జిందాల్ యూనివర్సిటీకి చెందిన ఒక విద్యార్థి పెద్దసూట్‌కేస్‌తో హాస్టల్‌లోకి వచ్చాడు. అందులో ఏమున్నాయని సిబ్బంది అడిగితే దుస్తులు, వస్తువులు ఉన్నట్లు తెలిపాడు. ఆతడి తీరుపై అనుమానం వచ్చిన హాస్టల్ గార్డులు సూట్‌కేస్ తెరవాలనికోరగా నిరాకరించాడు. దీనితో వారు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి సూట్‌కేస్‌ను తెరిస్తే అందులోంచి ఒక అమ్మాయి బయటకు రావడంతో అవాక్కయ్యారు. ఈ సంఘటన మొత్తం మరో విద్యార్థి విడియోతీసి నెట్‌లో అప్‌లోడ్‌చేయడంతో వైరల్ అయింది. ఈ మధ్య సూట్‌కేసులు కూడా ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయంటూ నెటిజన్లు ఛలోక్తులు విసురుతున్నారు.



## రద్దీరోడ్డుపై గోవుకు రొట్టెవిసిరిన వ్యక్తికి ఢిల్లీ సిఎం క్లాస్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** రాజధాని ఢిల్లీముఖ్యమంత్రి రేఖా గుప్తా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించిన వాహనదారుడికి గౌరవప్రదంగా క్లాస్ తీసుకున్నారు. ఆమె వెళుతున్న మార్గంలో ఒక వ్యక్తి రద్దీగా ఉన్న రోడ్డుపై ఆవుకు ఆహారం విసిరివేయడాన్ని చూసారు. దీనితో వెంటనే కాన్వాయ్ ఆపి ఆ వ్యక్తివద్దకు వెళ్లి మాట్లాడారు. తాను ముఖ్యమంత్రినని పరిచయం చేసుకున్న ఆమె ఇంకోసారి అలాచేయవద్దనిచేతులు జోడించి రిక్వెస్ట్ చేసారు. ఇలాంటి చర్యలవల్ల మూగజీవాలతో పాటు వాహనదారులకూ ప్రమాదమేనని చెప్పారు. ఈ విడియోను ఆమె స్వయంగా తన ఎక్స్ ఖాతాలో షేర్‌చేసారు. శనివారం ఢిల్లీ వీధుల్లో వెళుతుండగా ఒక వ్యక్తి కారు లోనుంచి ఆవుకు రొట్టెముక్క విసరడంచూసా. వెంటనే కారు ఆపి ఆయనవద్దకువెళ్లా. ఇలాంటివిఇంకోసారి చేయొద్దనిచెప్పా. రొట్టె కేవలం ఆహారం మాత్రమే కాదు. మన సంస్కృతి సాంప్రదాయాలు విశ్వాసాలకు ప్రతీక. ఇలా రద్దీగా ఉన్న రోడ్లపైకి ఆహారాన్ని విసిరివేయడంవల్ల ముప్పు వాటిల్లుతుంది. వాహనదారులు, రోడ్లపైనడిచేవారికికూడాప్రమాదమే. ఆహారాన్ని ఇలా అగౌరవపరచకూడదని, జంతువులకు ఆహారం పెట్టాలనుకుంటే గోశాలల వంటిప్రాంతాలకువెళ్లండి అదే మన విలువలు, బాధ్యతలను చాటిచెబుతుంది. ఢిల్లీ వాసులందరికీ నా అభ్యర్థన ఒక్కటే. రోడ్లపై ఆహారానిన విసరొద్దు. మూగజీవులను ప్రేమించండి. మన సంస్కృతిని గౌరవించండి రహదారి భద్రతను పాటించండి అని సిఎం రేఖాగుప్తా రాసుకొచ్చారు. నగరంలోని హైదర్‌ఫుర్ ఫ్లై ఓవర్‌పై శనివారం ఈసంఘటన జరిగింద.ఇ సుమారు 15 నిమిషాలపాటు సీఎం తన కాన్వాయ్‌ను నిలిపేసి వాహనదారులతో మాట్లాడారు.

# రైతులకు శాపంగా మారుతున్న సోలార్ ఉత్పత్తి కేంద్రాలు



## ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వి.రాంభూపాల్

**అనంతపురం, ఏప్రిల్ 12, (ప్రభాతవార్త బ్యూరో)** సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కంపెనీలకు వరంగా మారనుండగా రైతులకు శాపంగా మారనున్నాయని ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రైతుకు శాపమా...వరమా అన్న అంశంపై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నాడు సదస్సు జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుల్లో ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. విద్యుత్ ఉత్పిత్తి కేంద్రాల ఏర్పాటు పేరుతో రాష్ట్రంలోని అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల పరిధిలో పెద్దఎత్తున భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు సిద్ధమైందని తెలిపారు. 38 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కోసమని 1.90 లక్షల ఎకరాల భూమిని క ట్ట బె ట్టే ం ద ు క ు ప్రయత్నిస్తోందన్నారు. ఇందులో ఆదానికి 75 వేల ఎకరాలు కాగా, అంబానికి 46555 ఇవ్వాలన్న ప్రతిపాదనలున్నట్టు వివరించారు. ఈ భూములన్నింటినీ లీజుల పేరుతో ఇవ్వనున్నట్టు చెప్పారు. ఏడాదికి ఎకరానికి రూ.30 వేల చొప్పున లీజు ఇవ్వనున్నట్టు ప్రభుత్వం చెబుతోందన్నారు. అయితే ఆ భూములకు ఎటువంటి రక్షణ అన్నది మాత్రం ప్రశ్నార్థకంగానే ఉందని చెప్పారు. లీజుకు తీసుకున్న భూములను కంపెనీలు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం పొందుతున్నాయన్నారు. ఒకవేళ కంపెనీలు రుణం చెల్లించకుంటే రైతు భూముల పరిస్థితి ఏమిటన్నది తెలియడం లేదని చెప్పారు. ఇప్పుడు లీజు కుదుర్చుకుంటున్నది 30 సంవత్సరాలకు అని తెలిపారు. 30 సంవత్సరాల తరువాత భూములు వెనక్కి ఇస్తే ఎవరి హద్దులు ఏమిటో కూడా తెలియని స్థితి ఉంటుందని పేర్కొన్నారు. ఇంత పెద్దఎత్తున సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు ద్వారా వచ్చే పర్యావరణ సమస్యలను ప్రభుత్వం పట్టించుకుంటున్న దాఖలాల్లేవని తెలిపారు. రాజస్థాన్‌లో ఈ రకంగా ఏర్పాటైన విద్యుత్ ఉత్పత్తి కేంద్రంపై పరిశీలన జరుపగా ఉష్ణోగ్రతల్లో తేడాలున్నాయని తెలిసిందని వివరించారు. ఇక్కడా అటువంటి వాతావరణ మార్పులొస్తే ప్రజలకు ఇక్కట్లు తప్పవని తెలిపారు. ఇవి చాలావన్నట్టు పంప్డ స్టోరేజీ పద్దతుల్లో నీటి వసతివున్న చోట ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అతి తక్కువగా నీటి వసి ఉన్న అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోనే వీటి ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతుండటం గమనార్హమన్నారు. ఉన్న కొద్దిపాటి నీళ్లను వీటికి వినియోగిస్తే వ్యవసాయం పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఇప్పటికే ఏర్పాటైన ఎన్‌పికుంటలో చూస్తే స్థానికంగా ఉపాధి లభించిన దాఖలాలుల కూడా లేవన్నది స్పష్టమైందన్నారు. ఏ రకంగా చూసినా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కార్పొరేట్లకు కాసులు కురిపించేవిగా ఉండగా రైతులకు నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.ఎం.బాషా, ఎపి రైతు సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షులు హారి, ఎపి కౌతు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఉపాధ్యక్షులు విరూపాక్షి, రాజారాంరెడ్డి, బిహెచ్.రాయుడు, నాయకులు చెన్నారెడ్డి, వలి, సుధాకర్, పోతులయ్య, కదిరప్ప, ఎంకె.వెంకటరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకి, రాహుల్, , సువర్ణమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా
# గిరిప్రదక్షణ

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త** ప్రతి పౌర్ణమి పర్వదినాన వేడుకగా నిర్వహించే గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని శనివారం చైత్రమాసం పౌర్ణమి సందర్భంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు.పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఆదిదంపతుల ముందు భజనలు, కోలాట ప్రదర్శనలు, నృత్యాలు ప్రదర్శిస్తూ ఇంద్రకీలాద్రికి గిరి ప్రదక్షణ చేశారు. ముందుగా ఇంద్రకీలాద్రి పాత గాలిగోపురం వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను మాత, శ్రీ గణపతి స్వామివార్లకు పూజాదికాలు జరిపిన అనంతరం టెంకాయలు కొట్టి గిరి ప్రదక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తబృందాలు ప్రదర్శించిన గజకర్ణ, గోకర్ణ, టక్కు, టమార, పలు దేవతా మూర్తులతో కూడిన ప్రదర్శనలు ఆద్యంతం భక్తిపారవశ్యాన్ని నింపుతూ గిరి ప్రదక్షణ వైభవంగా జరిగింది. శ్రీ స్వామి అమ్మవార్లకు దారిపొడవునా ఆయా ప్రాంత ప్రజలు మంగళహారతుల స్వాగతం పలుకుతూ టెంకాయలు, పూలు పలు పూజా ద్రవ్యాలను సమర్పించి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా రథం ముందు ప్రదర్శనలతో అలరించిన కళాకారులను అధికారులు అభినందించి వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

– సింహవాహనంపై ఆదిదంపతులు:

సకల లోకాలనేలే ఆదిదంపతులు శ్రీ గంగాభవానీ సమేత మల్లేశ్వర స్వామివార్లు సింహవాహనంపై నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. దుష్టసంహారం కోసం శ్రీ అమ్మవారి వాహనమై, సకలమృగాలకు రాజైన సింహవాహన సేవను సాయం సంధ్యాకాలంలో నిర్వహించారు. ముందుగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లను ప్రత్యేకపూజలనంతరం చూడముచ్చటగా సిద్ధం చేసిన వాహనంపై మంత్రయుక్తంగా వేంచేపు చేశారు. శ్రీ మల్లేశ్వర స్వామివార్ల మండపం నుండి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్లను రావణవాహనం ప్రారంభమై కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్‌బజార్ ల మీదుగా నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్లు నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీ స్వామి అమ్మవార్ల రథంకు ముందుగా పలు రకాల తప్పెట్లు, కోలాటాలు, భజనలు, వివిధ రకాల వేషధారణలు సాగుతుండగా, మంగళవాయిద్యాల నడుమ, వేదమంత్ర ఘోషలతో సాగుతుండగా అడుగడుగునా భక్తులు టెంకాయలు, పసుపు, కుంకుమ, పూలమాలలు, హారతులతో శ్రీ స్వామి అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లను తిరిగి శ్రీ మల్లేశ్వర మండపానికి తీసుకొచ్చి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపారు. భక్తులకు తీర్ధ ప్రసాద వితరణ చేశారు.

– నేడు పూర్ణాహుతి :

ఏప్రిల్ 13 ఆదివారం నాడు ఉదయం 9 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల చైత్రమాస బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి నిర్వహిస్తామని ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. అనంతరం ధాన్యకోటోత్సవం, వసంతోత్సవం, అవభృథోత్సవం (పవిత్ర కృష్ణానదిలో), మూకబలి, ధ్వజావరోహణం జరుగుతాయన్నారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లు ఆలయం నుండి ఊరేగింపుగా వెళ్ళి పవిత్ర కృష్ణానదిలో నదీవిహారం చేస్తారన్నారు.

– పలువురు భక్తుల విరాళాలు :

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఎం శ్రీనివాసరావు తమ కుటుంబీకులతో కలిసి రు.1లక్ష 1వెయ్యి, 116లను ను విరాళంగా శనివారం ఆలయాధికారులకు అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన కె విష్ణు వర్ధన దేవి రు1లక్ష విరాళం, హైదరాబాద్‌కు చెందిన వి శ్రీనివాస్ 1లక్ష 1వెయి, 116ల విరాళం అందించారు.

# రాజంపేట నియోజవర్గ నేతలతో సిఎం భేటీ

### జగన్మోహన్ రాజును అభినందించిన చంద్రబాబు



**రాజంపేట అర్బన్ ఏప్రిల్ 12 ప్రభాతవా ర్త** ఉమ్మడి కడప జిల్లా పర్యటనకు వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం రాజంపేట నియోజకవర్గ పార్టీ నాయకులతో భేటీ అయ్యారు. శుక్రవారం రాత్రి ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న అనంతరం ఇక్కడే విశ్రాంతి తీసుకున్నారు. ఉదయం టిటిడి అతిధి గృహంలో పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చెమట్టి జగన్మోహన్ రాజు సీఎంను కలిశారు. రాజంపేట నియోజకవర్గం లో పార్టీ పరిస్థితులను వివరించారు. అనంతరం ఈ ఆర్గమని ముఖ్య నాయకులు కలిసి ఎందుకు వేచి ఉన్నారని సీఎం వివరించడంతో ఆయన ఒకే అన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సుధాకర్, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, ఎద్దుల విజయసాగర్, రాజంపేట మండల గ్రామీణ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, లీగల్ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు టీ.లక్ష్మీనారాయణ ఇంకా పలువురు నాయకులు కలిశారు. పలు సమస్యలను సీఎంకు వివరించారు. పరిపాలనా పరమైన సమస్యల పరిష్కారానికి అక్కడే ఉన్న కడప కలెక్టర్ శ్రీధర్ కు పరిశీలించాలని ఆదేశించారు.

# అపచారం వెనుక నిర్లక్ష్యమెవరిదీ?

### - వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌లో భద్రత సిబ్బంది లోపం

### - భక్తుల నిశిత తనిఖీల్లో డొల్లతనం,పాదరక్షలతో ఆలయ మహాద్వారంవద్దకే

## -13మంది భద్రత సిబ్బంది సస్పెన్షన్

**తిరుమల,ఏప్రిల్ 12ప్రభాతవార్తప్రతినిధి:** 'ఎద్దు ఈనిందంటే గాట్లో కట్టేయండి"అనే రీతిలో ప్రపంచ ప్రసిద్దిగాంచిన తిరుమల ఆలయంలో భద్రత విభాగం పనితీరు తయారైంది. మూడంచెల్లో అత్యంత జాగ్రత్తతో భక్తులను నిరంతరం నిశితంగా తనిఖీలు చేసి పంపుతున్నామనే భుజాలు ఎగరేసే భద్రత సిబ్బంది అప్పుడప్పుడు నిర్లక్ష్యంగా ఉంటుండటంతో అపచారాలు, పొరబాట్లు జరిగిపోతుంటాయి. ఇప్పటికే పలుమార్లు భక్తులు రకరకాలుగా టిటిడి నిబంధనలు ఉల్లంఘించి ఆలయంలోనికి నిషేధ వస్తువులతో చుట్టేస్తుండటం జరిగిపోతోంది. గత రెండేళ్ళక్రిందట తెలంగాణ భక్తుడు ఏకంగా సెల్‌ఫోన్‌తో ఆలయంలోనికి చేరుకుని ధ్వజస్తంభం,బంగారువాకిలి, ఆనందనిలయం పూర్తిగా వీడియోతీసి పెద్ద సంచలనం రేకెత్తించిన ఘటన విదితమే. ఆ భక్తుడు చిత్రీకరించిన ఆనందనిలయాన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేసేవరకు గానీ గుర్తించలేకపోయారు. మరీ ఏకంగా 2023లో ఆలయం పరిసరాల్లో డ్రోన్ కెమెరా షూటింగ్ కలకలం రేపింది. ఇలా వరుసగా తప్పిదాలు చోటుచేసుకుంటున్నా టిటిడి నిఘా వ్యవస్థ నిద్రావస్థలో ఉందా?అనే అనుమానాలు భక్తులు వ్యక్తంచేస్తున్నారు. మూడునెలల క్రిందట ఏకంగా మద్యం సీసాలతో, మాంసాహార భోజనాలతో తిరుమలకు చేరుకుని భుజించడం తెలిసిందే. నెలన్నరక్రిందట ఓ భక్తుడు ఏకంగా సెల్‌ఫోన్‌తో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో తనిఖీలు దాటుకుని ఆలయంలోపల పడికావలి వరకు రావడం, అక్కడ సెల్‌ఫోన్‌తో ఫోటోలు తీయడం ,చివరకు మీడియా సమాచారంతో పట్టుకోవడం విదితమే. ఇలా వరుసగా భద్రత లోపాలు తెలుస్తున్నా విమానాశ్రయం తరహా తనిఖీలు చేస్తున్నా తప్పించుకుని రావడంలో నిర్లక్ష్యం ఎవరిదనేది పసిగట్టలేకపోతుండటం అడుగడుగునా చోటుచేసుకున్న నిర్లక్ష్యమేగా తెలుస్తోంది. ఇంకా టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంలో తిరుపతి,తిరుమలలోనే ఏళ్లతరబడి తిష్టవేసిన సిబ్బంది ఉండటం, హోంగార్డులు సెక్యూరిటీ గార్డులుగా నియమితులై ఇష్టానురీతిలో వ్యవహరిస్తుండటం వీటన్నిటికీ ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. భక్తులు చేతికి ఎలక్ట్రానిక్ గడియారం ధరించి ఉన్నా తీసేసే భద్రత సిబ్బంది తాజాగా ఎంతో పవిత్రమైన శనివారం రోజు మహారాష్ట్రకు చెందిన ముగ్గురు భక్తులు శ్రీవాణి బ్రేక్‌లో ఏకంగా పాదరక్షలు ధరించి వచ్చారు.

# భూమన నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి, ట్రస్ట్ బోర్డు మెంబర్ గా రాజీనామా చేస్తా

### టిటిడి గోశాలపై అసత్య ప్రచారం - మడకశిర ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ ఎంఎస్ రాజు



**అనంతపురం, ఏప్రిల్ 12, (ప్రభాతవార్త బ్యూరో)** తిరుమల తిరుపతి దేవస్థానం సంబంధించిన టి టి డీ గోశాలలో ఆవులు చనిపోయినట్లు వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, గోశాల లో 100 ఆవులు చనిపోయినట్లు టీటీడీ మాజీ చైర్మన్ భూమున కరుణాకర్ రెడ్డి నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి, ట్రస్ట్ బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తానని మడకశిర ఎమ్మెల్యే , టీటీడీ సభ్యుడు ఎమ్మెస్ రాజు సవాల్ విసిరారు. భూమున కరుణాకర్ రెడ్డి గోశాలకు వస్తే ఏ విధంగా గోశాలలో ఆవులు గురించి ఎలాంటి శ్రద్ధ తీసుకునేది, జియో ట్యాగ్ గురించి, జనన మరణ రికార్డుల గురించి తెలియజేస్తామన్నారు. శనివారం అనంతపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక భక్తులు ఉన్న టీటీడీ ని అప్రదిష్ట పాలు చేసే విధంగా భూమన అసత్య ప్రచారం చేశారు అని వెల్లడించారు. వైసీపీ హయాంలో టిటిడి చైర్మన్గా ఉన్న భువన కరుణాకర్ రెడ్డి, వై వి సుబ్బారెడ్డి హయాంలో కొట్లాది రూపాయల దర్శనం టికెట్లను అమ్ముకున్నారని, తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఆదాయ వనరుగా చేసుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ ఉన్నప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అప్రదర్శన పాలు చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు, టీటీడీ ట్రస్ట్ చైర్మన్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్నో సంస్కరణలు చేపట్టి భక్తుల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ భువన కరుణాకర్ రెడ్డి ప్రస్తుతం టీటీడీ గోశాలపై గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎక్కడో చనిపోయిన గోవులను... టీటీడీ గోశాలలో చనిపోయినట్లు తప్పుడు ప్రచారం చేశారని, ఆ ఫోటోలు చూస్తే అర్థం చేసుకోవచ్చు అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి చూపించిన ఫోటోలు టీటీడీ గోశాలలో ఉన్న గోవులు ఫోటోలు కావు అన్నారు. పరిశుభ్ర వాతవరణంలో టీటీడీ గోశాలలో ఆవులు ఉన్నాయి అని ఆయన వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలలో ఉన్న ఆవులకు జియో టాగ్ లేవని భూమన కరుణాకర్ రెడ్డి చెబుతున్నాడని,గోవులకు జీయో ట్యాగ్ ఉందో లేదు భుమన వస్తే చూపిస్తాం అన్నారు.మూడు నెలలో 20 నుంచి 25 గోవులు మాత్రమే చనిపోయాయి. వృద్ధాప్యము, అనారోగ్యము, ప్రసవం తదితర కారణాల వల్ల ఆవులు చనిపోయి ఉంటాయని ఆయన తెలిపారు. ఒంటి మిట్ట సీతారాముల కళ్యాణోత్సవాన్ని డైవర్ట్ చేసేందుకే భూమన కరుణాకర్ రెడ్డి ఈ విధంగా ఆరోపణలు చేశారు అని ఎమ్మెస్ రాజు దుయ్యబట్టారు. తిరుమల కొండపై గతంలో భూమన కరుణాకరరెడ్డి అనేక ఆరోపణలు చేశారు అని,భూమనకు వేంకటేశ్వర స్వామి పై భక్తి లేదు అని ఆయన ఆరోపించారు. చిత్తూరు వైసీపీ నాయకులకు ఎర్ర చందనం, టీటీడీ ఆదాయ వనరులుగా గతంలో ఉపయోగించుకున్నారని,టీటీడీ పై వైసిపి నాయకులు నిత్యం కుట్రలు చేస్తున్నారు అని ఆయన ఆరోపించారు.

# పద్మశ్రీ వనజీవి రామయ్య మృతికి చింతిస్తున్నా..

### - ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణ కోసం ఆరు దశాబ్దాలుగా అలుపెరుగని కృషి చేసి, సుమారు కోటి మొక్కలు నాటిన పద్మశ్రీ వనజీవ్ది రామయ్యకన్నుమూశారని తెలిసి చింతించానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.ఆ మేరకు జనసేన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు."ఎక్స్" వేదికగాను రామయ్య మరణానికి సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. వృక్షో రక్షతి రక్షితః అనే పెద్దల మాటలోని వాస్తవాన్ని ప్రజలకు తెలియచేసేందుకు రామయ్య గారు పడ్డ తపన సమాజానికి ఎంతో మేలు చేస్తోంది. తొలకరి చినుకులుపడగానే మొక్కలు నాటుతూ, విత్తనాలు జల్లుతూ పచ్చదనం పెంచడానికి రామయ్య గారు, ఆయన సతీమణి చేసిన వన యజ్ఞం ఎన్నో తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిస్తుంది. రామయ్య గారికి ఓ సందర్భంలో ప్రమాదం చోటు చేసుకొంటే ఆసుపత్రిలో ఉండగా పరామర్శించాను. అప్పుడు కూడా పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడారు.

రామయ్య గారు స్ఫూర్తిని కొనసాగిస్తూ, పచ్చదనం పెంపునకు కృషి చేయడంతోపాటు... పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తాము.

"వనజీవ్ది రామయ్య గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను.

# కూతురును కడతేర్చిన తల్లి అరెస్ట్ : డిఎస్పీ బి.ప్రసాద్

## సిఐ, ఎస్ఐ సహా సిబ్బందికి ఎస్పీ అభినందనలు

**చంద్రగిరి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మాట వినని కుమార్తెకు మరణశిక్ష విధించిన తల్లి ఉదంతం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నరశింగాపురంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం డిఎస్పీ బేతపూడి ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రాపురం మండలం, నెత్తకుప్పంకు చెందిన అజయ్, నరశింగాపురం, గాండ్లవీధికి చెందిన చింతగుంట సుజాత పెద్ద కుమార్తె చింతగుంట నిఖిత (16) బాలిక ఇద్దరూ ప్రేమించుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చడంతో తల్లి ఫిర్యాదు మేరకు గతంలో నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరిగిందన్నారు. అయితే గత కొద్ది రోజుల క్రితం నిందితుడు బెయిల్‌పై విడుదల కావడంతో నిఖిత అతడిని కలుస్తున్నట్లు అనుమానించిన సుజాత తన ఇంట్లో బాలికను కొట్టి, ఊపిరి అందకుండా చేసి హత్య చేసినట్లు తెలిపారు. బాలిక మృతి చెందడంపై గ్రామంలో పలురకాలుగా అనుమానాలు వ్యక్తం కావడంతో విఆర్ఓ ఎం.అశోక్ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పీ పర్యవేక్షణలో సిఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ అనిత, సిబ్బంది గోపి, పురంధర్, మునిరత్నం, రవిప్రకాష్ (సిసిఎస్) దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో బాలిక మృతిపై గత మూడు రోజులుగా దర్యాప్తు తీవ్రతరం కావడంతో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుసుకున్న నిందితురాలు సుజాత చంద్రగిరికి చెందిన టిడిపి నాయకుడు సక్కూర్ ధనంజయ రెడ్డిని సంప్రదించి తన కుమార్తె అన్యకులస్థుడిని ప్రేమించినట్లు వివరించింది. దీంతో తాను ఎంత వారించినా తన మాట వినకపోవడంతో ఆవేశాన్ని అదుపుచేసుకోలేక తన కుమార్తెను తానే ఊపిరి అందకుండా చేసి చంపేసినట్లు తెలియజేసింది. దీనిపై పోలీసులకు సమాచారం అందజేసి నిందితురాలిని అప్పగించడంతో పూర్తి స్థాయిలో విచారణ జరిపినట్లు తెలిపారు.

తన కుమార్తె మరణాన్ని సహజ మరణంగా చిత్రీకరించేందుకు యత్నించి విఫలమైన సుజాత ఎట్టకేలకు నేరం అంగీకరించి పోలీసులకు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# నిద్రావస్థలో టిటిడి భద్రత సిబ్బంది

### - కాంగ్రెస్ నేత చిట్టిబాబు

**తిరుమల,ఏప్రిల్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ద హిందూ పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ భద్రతలో టిటిడి విజిలెన్స్ విభాగం నిద్రావస్థలో ఉందని, అనేక తప్పిదాలు జరిగిపోతున్నాయని తిరుపతి సిటీ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు తెలిపారు. భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సింది పోయి నామమాత్రంగా విధులు నిర్వహిస్తుండటంతో పాదరక్షలతో ఆలయంలోనికి చేరుకునేందుకు భక్తులు రావడం నిదర్శన మన్నారు.పాదరక్షలతో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ నుండి ఆలయ మహాద్వారం వరకు వచ్చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడుచోట్ల తనిఖీల్లో పాదరక్షలు గుర్తించకపోవడం వెనుక నిర్లక్ష్యం అని మండిపడ్డారు. ఖద్దరు చొక్కాలతో నాయకుల్లా కనిపిస్తే వారివైపు కన్నెత్తికూడా చూడకుండా సిబ్బంది ఉండటం తేటతెల్లమైందన్నారు. పాదరక్షలతో వచ్చిన భక్తులు వారు చేసిన తప్పులుతెలిసేలా తిరిగి వెనక్కు పంపకుండా ఆలయంలోనికి అనుమతించడం దేనికి కారణమన్నారు. తప్పుచేసిన భక్తులకు పవిత్రతకు భంగం కలిగించామనే పశ్చాత్తాపం కలిగించాలన్నారు.ఈ తప్పిదాలకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని చిట్టిబాబు డిమాండ్ చేశారు.భద్రత అధికారులు దారుణంగా విఫలమయ్యారని అన్నారు.

# విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణ ప్రైవేటుకు :ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ

**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల పొడవైన నిర్మించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనంను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో జిల్లా యంత్రాంగం నిర్వహించాలని యోచిస్తోంది.త్వరలో దీనిలో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. అంబేద్కర్ స్మృతి వనం అభివృద్ధికి త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్లు ఆయన చెప్పారు.అత్యంత పర్యాటక ఆకర్షణీయంగా అంబేద్కర్ స్మృతి వనం రూపొందుతుందన్నారు.ఇప్పటికే పర్యాటకుల నుంచి మంచి స్పందన ఉందన్నారు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం, నదీ తీరం, కాలువ గట్లుతో పాటు ఇతర పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా, కృష్ణానదిలో బోట్ హౌస్, తేలియాడే రెస్టారెంట్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. త్వరలో వ్యవసాయం, ఉద్యానవన ప్రదర్శనలు, సముద్ర ఆహార ఉత్సవాన్ని నిర్వహిస్తామని శ్రీ లక్ష్మీశ శుక్రవారం మీడియాకు తెలిపారు.

అంబేద్కర్ స్మృతి వనంలో థియేటర్, వాణిజ్య సముదాయం, పుస్తక దుకాణాలు, ఆడిటోరియం, ఫుడ్ కోర్టు మరియు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని లక్ష్మీశ తెలిపారు.

## దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతానికి ఎన్నికల సంస్కరణలు అవసరం-సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్



**విజయవాడ, చిఏప్రిల్ చి 1 2 , ప్ర భా త చివార్త ప్రతినిధి:** ద ే శ ం ల ో ప్ర జా స్వా మ్యం బ లో పే తా ని కి ఎ న్ని క ల స ం స్క ర ణ ల ు అవసరమని ప్రముఖ అభ్యుదయ వాది, ఉద్ఘాటించారు. శనివారం విజయవాడలోని సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన అధ్యాపకులు చెన్నుపాటి దివాకర్ బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో "భారతదేశంలో భాగస్వామ్య ప్రజాస్వామ్యం బలోపేతం కోసం ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత" అనే అంశంపై ప్రశాంత్ భూషణ్ ఉపన్యాసించారు. భారత రాజ్యాంగానికి పునాది ప్రజాస్వామ్యమని, కానీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం మన దేశ రాజ్యాంగ లక్ష్యాల సాధనలో వెనుకబడిందని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు వారిని ఎన్నుకున్న ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాకుండా వారి వ్యక్తిగత ఆశక్తుల కోసం మాత్రమే పనిచేస్తు చిన్నారని విమర్శించారు. ఎన్నికల్లో పోలయిన ఓట్లలో ఒకరికి 49 శాతం ఓట్లు వచ్చి ఇంకొకరికి 51 శాతం ఓట్లు వస్తే ఆ 49 శాతం ప్రజల ఓట్లు పొందిన వ్యక్తికి ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యమూ లేదన్నారు. ధనం, అధికారం అనే చట్రంలో ఇరుక్కొని ఓటేస్తున్నారు.

# సిఎం చంద్రబాబు పేరుపై నకిలీ సిఫారస్ లేఖలు సృష్టించిన కోఆపరేటివ్ ఉద్యోగిపై క్రిమినల్ కేసు నమోదు

**గుత్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త** తాను చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ఏకంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చినట్లుగా సిఫారస్ లేఖలను ఉన్నతాధికారులకు అందించి ఓ కో ఆపరేటివ్ ఉద్యోగి రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులను బురిడీ కొట్టించి పోలీసుల పాలు అయిన సంఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా గుంతకల్లు కేంద్రంగా గుత్తి సబ్ డివిజన్‌లో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా సి.సతీష్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన పరిధిలో గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, తదితర మండలాల్లోని కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులు, సహకార బ్యాంకులు, సొసైటీలను ఆయన పర్యవేక్షిస్తారు. ఆయన తన విధులకు గైర్హాజరు అవుతూ లాభాలు వస్తాయంటూ ఉద్యోగులను నమ్మించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఆయన ఆయా శాఖల్లో పలువురు ఉద్యోగులను షేర్ మార్కెట్ పట్ల ఆకర్షితులను చేసి లాభాలు వస్తాయంటూ నమ్మబలికాడు. నమ్మిన పలువురు ఉద్యోగులు లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెట్టి మోసపోయారు. ఒకవేళ ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి నిరాకరిస్తే, వారిపై జిల్లా అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేసేవాడు. విసిగి వేసారి పైన ఉద్యోగులు పలువురు అతనిపై రాష్ట్రస్థాయిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

# కాపవరంలో విద్యుత్ షాక్ తో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,ఏప్రిల్ 12( ప్రభాతవార్త):** రాజానగరం నియోజకవర్గం, కోరుకొండ మండలం, కాపవరం గ్రామ సమీపంలోఉన్న సూర్య మహాలక్ష్మి మ్ రైస్ మిల్లు లో శనివారంఉదయం ధాన్యం లోడ్ చేసే కన్వర్టర్ బెల్ట్ తీసుకెళ్తుండుగా ప్రమాదవశాత్తు 11కేవి విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. జాజుల వెంకన్న , ఆకుల నాని , బర్త్ సత్యనారాయణ మృతి చెందినట్లు వెల్లడించారు.ఈ విషయం తెలియగానే ఎమ్మెల్యే బలరామకృష్ణ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన విధానాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కష్టకాలంలో మనోధైర్యంతో ఉండాలని తెలియజేస్తూ , మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా ఆ కుటుంబాలకు అన్ని విధాల భవిష్యత్తులో అండగా ఉంటామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రభుత్వం తరపునుంచి మృతుడు కుటుంబానికి ఒక్కొక్కరికి రూ 5లక్షలు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, అలానే రైస్ మిల్ యాజమాన్యం ద్వారా బాధితు కుటుంబాలకు ఒక్కొక్కరికిరూ 15 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని పెద్దల సమక్షంలో నిర్ణయించడం జరిగింది.

## నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన రచయిత విశ్వమోహన్

**విజయవాడ ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన నిజాయితీ గల రచయిత కొమ్మిరెడ్డి విశ్వమోహన్‌రెడ్డి అని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. జనసాహితి సంస్థ ఆధ్వర్యంలో విశ్వమోహన్‌రెడ్డి రచనలు, జీవిత విశేషాలపై జ్వాలాశిఖ విశ్వమోహన్ పేరు న ప్రచురించిన పుస్తకాన్ని జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ, శివప్రసాద్ ఆవిష్కరించారు.

# మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైఎస్ఆర్సీపి కుట్ర

### - ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షుడు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్



**జగ్గయ్యపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వైఎస్ జగన్‌మోహనరెడ్డి డైరెక్షన్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుట్రకు పాల్పడుతోందని, తప్పుడు ప్రచారాలతో టిటిడి గో మరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్యానికి రంగులు అద్దుతున్నారని ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్ ధ్వజమెత్తారు. శనివారం జగ్గయ్యపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అదో నల్లరాయి దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ గతంలో వెంకటేశ్వరస్వామి వారిపై అనేక విమర్శలు, నిందలు వేసిన కరుణాకర్‌రెడ్డిని జగన్‌రెడ్డి టిటిడి చైర్మన్‌గా గతంలో నియమించారని ఆరోపించారు. కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టిటిడి ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఏనాడైనా జగన్‌రెడ్డి సతీసమేతంగా శ్రీస్వామివారిని దర్శించుకున్నారా, టిటిడి సంప్రదాయాలను పాటించి రిజిష్టర్‌లో సంతకం చేశారా అంటూ ప్రశ్నించారు.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# వాడపల్లి 'వెంకన్న ' ఒక్కరోజు ఆదాయం..రూ.48 లక్షలు గోవింద నామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

ఏడువారాల వెంకన్న గా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి వారి శనివారం ఒక్కరోజు ఆదాయం రూ 48లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమీషనర్, కార్యనిర్వాహనాధికారి నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఏడువారాలు నోము ఆచరించే భక్తులతో మాడ వీదులన్నీ గోవింద నామ స్మరణతో మార్మోగాయి.. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో వివిధ రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారికి సుప్ర భాత సేవ, తొలి హారతి తో ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వివిధ జిల్లాలు ప్రాంతాల నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. శ్రీ స్వామి వారికి 60 వేల మంది దర్శించుకోగా 30 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు,ప్రత్యేక క్యూ లైన్ లు, ఏడు ప్రదిక్షణాలు చేసే భక్తులకు ఎదురేదురు అవకుండా భక్తులకు ప్లేయి ఓవర్ బ్రిడ్జ్ ద్వార భక్తులు బయట కు వచ్చే విధంగా దారి మళ్లించడంతో ప్రదక్షిణాలు చేసే భక్తులు చాలా ఆనందాన్ని వ్యక్తం చేసారు.వచ్చిన భక్తులకు పులిహోర, మంచినీరు, మజ్జిగ, వితరణ, చంటి పిల్లలకు పాలు, బిస్కెట్‌లు, భోజన ఏర్పాట్లు



చేశారు.సూపరింటెండెంట్ లు, పులపర్తి రాంబాబు,రాపాక శ్రీనివాస్ ఎస్సై ఎస్ రాము సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# శ్రీ బాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్న భక్తులు




**మామిడికుదురు , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ బాల బాలాజీ స్వామి వారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తెల్లవారుజామునుండే పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు.అనేకమంది తలనీలాలు సమర్పించారు. ముడుపులు,మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఒక్కరోజు ఆదాయం రూ. 2, 76,303 లు సమకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమీషనర్, కార్య నిర్వహణాధికారి ఎం. సత్యనారాయణ రాజు తెలిపారు స్వామివారిని 3500 మంది దర్శించుకోగా వారిలో 1800 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు వేసవి తీవ్రత దృష్ట్యా ఆలయంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

# గోవుల మృతిపై హిందువుల మధ్య చిచ్చుకు వైసీపీ కుట్ర

**- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే బాబా**

**కాకినాడ టౌన్ , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

తిరుపతి వేంకటేశ్వరుని భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలు చేసి మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా వ్యాఖ్యానించారు. తిరుపతిలోని టీటీడీ గోశాలలో గత మూడు నెలలలో సుమారు 100 గోవులు చనిపోయాయని చేస్తున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదన్నారు. శనివారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో పెంకే బాబా విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



బాబా మాట్లాడుతూ గోశాలలో అవులన్నీ క్షేమంగా ఉన్నాయి. వివిధ కారణాలతో ప్రతినెలా 10 గోవులు చనిపోతుంటాయని వాటి ఆలనా పాలనా చూడ్డానికి సుమారు 260మంది సిబ్బంది గోశాలలో పనిచేస్తున్నారన్నారు. 2688 గోవులు గోశాలలో క్షేమంగా ఉన్నాయని చెప్పారు. భూమన చైర్మన్గా వున్నప్పుడు అన్యమత ప్రచారానికి పరోక్షంగా అనుమతులు ఇవ్వడం మరచిపోయారా అని ప్రశ్నించారు. టీటీడీ గోశాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భూమన పైన కేసు వేసేందుకు న్యాయ కోవిదులను సంప్రదిస్తున్నట్లు పెంకే బాబా చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పెంకే సత్యనారాయణ, ములసా నాగేశ్వరరావు, ములసా బాబూరావు, పెంకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

**అంబాజీపేట , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

మండలంలోని మాచవరం గ్రామదేవతుల్లో ఒకరైన శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి అమ్మవారి తీర్థం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ ఆడపడుచులు, మహిళలు, భక్తులు అమ్మవారికి చలిమిడి, పానకాలు, పసుపు-కుంకుమ సమర్పించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదములు అందజేశారు. అలాగే శుక్రవారం రాత్రి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల పూజా ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# శోభయిమాణంగా జగన్మోహిని కేశవ స్వామి వారి చక్రస్నానం..పులకించిన అశేష భక్తజనం

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త )**

పురాతన చరిత్ర కలిగిన స్వయంబూ క్షేత్రం ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి కల్యాణో త్సవాలలో భాగంగా శనివారం శ్రీ స్వామివారి చక్రస్నానం కార్య క్రమం శోబాయి మానంగా జరిగింది. పండితులు శ్రీని వాస్లా వెంకటాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు వేదపం డితులు నేతృత్వంలో పూర్ణహుతి నీరాజనం మంత్రపుష్పం దిగ్దేవత బలిహరణం కనుల పండుగ నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారికి చక్ర స్నానం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు వందలాదిమంది భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని తిలకించి పులకించారు అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణమూర్తి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు భక్తులకు అన్న ప్రసాదా లను స్వీకరించారు.

**శ్రీ జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన ట్రస్ట్ కు విరాళం**

ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంభు ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు.హైదరాబాద్ చెందిన దూరి శ్రీనివాస సుబ్ర హ్మణ్య శాస్త్రి సునీత దంపతులు శ్రీ స్వామివారి అన్నదాన పథకానికి రూ.10,116 వేలు మరియు హైదరాబాద్ చెందిన బండా భవానీశంకర్ భారతి శిరీష దంపతులు



శ్రీ స్వామివారి అన్నదాన పథకానికి రూ. 5,116 వేలు హైదరాబాద్ చెందిన దూరి అప్పారావు శ్రీ స్వామివారి అన్నదాన పథకానికి రూ.10,116 వేలు విరాళంగా అందించారు. ఆలయ అర్చకులు వేదమంత్రా లతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ కార్యనిర్వ హణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి దాతలకు శ్రీ స్వామి వారి ,శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు శేష వస్త్రంతో సత్కరించారు.



# అంబాజీపేట జడ్పీహెచ్ఎస్ ప్లస్ ఇంటర్లో మిశ్రమ ఫలితాలు

**అంబాజీపేట , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్లస్ లో ఇంటర్మీడియట్ సెకండియర్లో 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఎంపీసీలో 9 మందికి ఏడుగురు, బైపీసీలో 13 మందికి ఆరుగురు, ఫస్టియర్లో 20 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఎంపీసీలో 13 మంది విద్యార్థులకు ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు హెచ్ఎం కడలి సాయిరామ్ శనివారం తెలిపారు. ఫస్ట్ ఇయర్ బైపిసి లో ఏడుగురు విద్యార్థులు పరీక్షలు వ్రాయగా ఒక్కరు కూడా పాస్ కాకపోవడం గమనార్హం. ఫస్టియర్ 35, సెండియర్ 64 శాతం వచ్చిందన్నారు. ఫస్టియర్లో పి.తేజశ్రీ 457, సెండియర్లో కె.కీర్తన 870 మార్కులు సాధించారన్నారు.

# ప్రమాదం వలన ప్రవీణ్ కుమార్ మరణం

## మద్యం తాగి వాహనం నడిపాడు : ఐజి అశోక్ కుమార్

**రాజమహేంద్రవరం సిటీ , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

ప్రముఖ క్రైస్తవ మత ప్రచారకుడు పగడాల ప్రవీణ్ కుమార్ బుల్లెట్ మోటారు సైకిల్ ప్రమాదం వలన మరణించారని ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్ తెలిపారు. అధికంగా మద్యం సేవించి వేగంగా వాహనం నడపడంతో ప్రమాదం జరిగిందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నర్సింహ కిషోర్ ఆధ్వర్యంలో ఐజీ అశోక్ కుమార్ శనివారం విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి ప్రవీణ్ కుమార్ మరణంపై దర్యాప్తు వివరించారు. గత నెల 25వ తేదీన రాజమహేంద్రవరం కొంతమూరు జాతీయ రహదారి పెట్రోల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇది ప్రమాదం కాదు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారని రెండు తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ సంఘాలు ఆందోళన ధర్నాలు సోషల్ మీడియాలో కథనాలతో తీవ్ర సంచలనమైంది. ఇవి అన్నీ ఆధారం లేని ఆరోపణలు నమ్మవద్దు అని ప్రవీణ్ కుమార్ ప్రమాదంలో మృతి చెందారు అంటూ ఐజి చెప్పారు. ప్రమాదం జరుగు ముందు రోజు హైదరాబాద్ నుండి రాజమహేంద్రవరం బుల్లెట్ పై ప్రవీణ్ కుమార్ బయలుదేరారు. మద్యం సేవించి ఉ ఒడడంతో కోదాడ దగ్గర ఆర్టీసీ బస్సు తప్పించబోయి ప్రమాదం జరిగడంతో అంబులెన్స్ లో సిబ్బంది వచ్చినా చికిత్స చేయించుకోలేదన్నారు. ఇక్కడే మోటారు సైకిల్ హెడ్ లైన్ పగిలిపోయి కేవలం కుడివైపు ఉన్న సిగ్నల్ లైట్ మాత్రం పని చేస్తుందన్నారు. మళ్ళీ విజయవాడ సమీపంలో రామవ్పాడు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఎస్ఐ సుబ్బారావుకు అలసటగా కనపడడంతో రెస్ట్ తీసుకోమని చెప్పినా పట్టించుకోకుండా వెళళిపోయారని చెప్పారు. కోదడలో మద్యం దుకాణంలో బ్రాంది జిన్ విస్కీ కొనుగోలు చేసి రూ.916 చెల్లించాలన్నారు. మోటారు సైకిల్ కుడివైపు ఉన్న సిగ్నల్ లైట్ తో మాత్రం ప్రయాణం చేయడం జరుగుతుందని ఇది కొవ్వూరు టోల్ ప్లాజా సిసి కెమేరాలో రికార్డు జరిగిందన్నారు. ఇక్కడ నుండి సుమారు 20 నిమిషాల్లో ప్రమాదం జరిగి ప్రవీణ్ కుమార్ మరణించారని చెప్పారు. మద్యం సేవించి




వేగంగా సుమారు గంటకు 70పైగా వేగంతో బుల్లెట్ మోటారు సైకిల్ నడపడంతో గోతిలో పడి మోటారు సైకిల్ అదుపు తప్పి క్రింద పడిపోయి రోడ్డుపై రాసుకుంటూ తల, మెఖానికి బలమైన గాయం తగలడంతో ఆయన మృతి చెందడం జరిగిందన్నారు. మృతదేహం కడుపులోను మూత్రపిండాలు, కాలేయం, గుండె, రక్తంలోను మద్యం సేవించిన నమోనాలు ఉన్నాయని వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. ప్రవీణ్ కుమార్ శరీరంపై రాపిడి గాయాలు తల, మెఖానికి తీవ్రమైన గాయాలు కారణం మరణించారని పోస్టుమార్టం రిపోర్టులో ఉందన్నారు. బుల్లెట్ మోటారు సైకిల్ నాలుగో గేరులో గంటకు సుమారు 70 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్టు మోటారు సైకిల్ ఇన్స్పెక్టర్ నివేదికలో ఉందన్నారు. ఇవి అన్నీ క్షేత్ర స్థాయిలో హైదరాబాద్ నుండి బాయలుదేరిన తర్వాత దర్యాప్తు ప్రారంభించి ప్రమాదం జరిగినంత వరకు సిసి కెమేరాలు, పోస్టుమార్టం నివేదికలు, కొందరి వ్యక్తుల విచారణ అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని ప్రగడాల ప్రవీణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మారణించాడాని నిర్ధారించామన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని విచారణ చేయగా వారి దగ్గర ఆధారాలు లేవన్నారు. తప్పుడు ప్రచారం చేసినందు 11 మందిపై కేసులు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేయడం జరిగిందని చెప్పారు. ఒక వ్యక్తి విదేశాల్లో ఉ న్నారన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో తప్పు ప్రచారం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేసు దర్యాప్తులో సమర్ధవంతంగా పూర్తి చేసిన డిఎస్పీలు,సిఐలు సిబ్బంది అభినందించారు.

# భక్తి శ్రద్ధలతో హనుమాన్ విజయోత్సవం



**పిఠాపురం , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

పిఠాపురం పట్టణంలోని స్థానిక వుల్లయ్య కాలువ వీధిలో ఉన్న శ్రీ కోద ండ రామా ల యం నందు హనుమాన్ విజయోత్సవం భక్తి శ్రద్ధలతోనిర్వహించారు.ఆలయంలో కొలువ దీరిన రాముల వారికి ఆంజనేయ స్వామివారికి విజయ జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో నాగవల్లి పత్ర సహిత సింధూర అర్చన నిర్వహించి అప్పాలు నివేదన చేశారు.అనంతరం మంగళహారతి సమర్పి ంచారు.స్థానిక భక్తులు పూజలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ భక్త బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**సీతానగరం , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త )**

సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దొరబాబు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ద్వితీయ సంవత్సరం విద్యార్థి బి. మోహన్ నాగేంద్ర (ఒకేషనల్) 948 మార్కులు సాధించి కళాశాల టాపర్గా నిలిచారు. జనరల్ విభాగంలో వై. ప్రసన్న తేజస్విని (ఎంపీసీ) 887 మార్కులు, అళ్ళ క్రాంతి (సీఈసీ) 881 మార్కులు, బి. లలితా దేవి (బైపీసీ) 869 మార్కులు, ఒకేషనల్ విభాగంలో టి. కిరణ్ కుమార్ (సిఈటి) 874 మార్కులు, సి హెచ్ దేవి (ఓఏఎస్)823 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని అధ్యాపక బృందం కృషితో విద్యార్థుల పట్టుదలతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులందరినీ ప్రిన్సిపాల్ అభినందించారు.

# గౌతమీ గోదావరి నది తీరాన వాడపల్లి'వెంకన్న' చక్రస్నానం

**కోనసీమ బ్యూరో , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త )**


కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవంలో భాగంగా ఆరవరోజు శనివారం శ్రీ స్వామివారి చక్రస్నానం గౌతమీ గోదావరి నది తీరాన ఘనంగా జరిగింది. ఆలయ పరిసరాలన్నీ భక్తుల గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో సన్నాయి మేళతాళాలతో తోడ్కొని వెళ్లి గౌతమి గోదావరి నది తీరాన స్వామివారి చక్రస్నానం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ స్వామివారి చక్రస్నానం లో ఆర్డీవో పి శ్రీకర్ దంపతులు మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు. పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రాసాదా చార్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వేద పండితు లు ఆధ్వర్యంలో మేలుకొలుపు, తీర్థబిందె తెచ్చుట. నిత్యార్చన, నిత్య హెూమములు, దిగ్దేవతా బలిహరణము, నీరాజన మంత్రపుష్పములు, ప్రధాన హెూమములు, మహాశాంతి హెూమము లు, మహాపూ ర్ణాహుతి, శ్రీ స్వామివారికి పవిత్ర గౌతమీ నదీ తీరాన చక్రస్నానం, అవభృథోత్సవం, బాలభోగనివేదన, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీ స్వామివారి చక్రస్నానం తిలకించి తీర్థ ప్రసా దాలు



స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు సూపరింటెండెంట్ లు పులపర్తి రాంబాబు, రాపాక శ్రీనివాస్,సిబ్బంది , ఎస్సై, ఎస్ రాము సిబ్బంది పర్యవేక్షించారు.



# రఘుదేవపురం చింతాలమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**

సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామ దేవత చింతాలమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ జాతర మహోత్సవంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మరియు ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కారిచర్ల విజయశంకర్, మట్ట వెంకటేశ్వరరావు, గెద్దాడ త్రిమూర్తులు, పలువురు కూటమి నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కాపవరంలో విద్యుత్ షాక్ తో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం

**- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే**
**- కుటుంబానికి రూ 5 లక్షలు నష్టపరిహారం అందిస్తామని హామీ**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త )**

రాజానగరం నియోజకవర్గం, కోరుకొండ మండలం, కాపవరం గ్రామ సమీపంలోఉన్న సూర్య మహాలక్ష్మి రైస్ మిల్లు లో శనివారంఉదయం ధాన్యం లోడ్ చేసే కన్వర్టర్ బెల్ట్ తీసుకెళ్తుండుగా ప్రమాదవశాత్తు 11కేవి విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. జాజుల వెంకన్న , ఆకుల నాని , బర్రే సత్యనారాయణ మృతి చెందినట్లు వెల్లడించారు.ఈ విషయం తెలియగానే ఎమ్మెల్యే బలరామకృష్ణ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన విధానాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కష్టకాలంలో మనోధైర్యంతో ఉండాలని తెలియజేస్తూ , మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా ఆ కుటుంబాలకు అన్ని విధాల భవిష్యత్తులో అండగా ఉంటామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రభుత్వం తరఫునుంచి మృతుడు కుటుంబానికి ఒక్కొక్కరికి రూ 5లక్షలు ఆర్థిక సహాయం అందించడం



జరుగుతుందని, అలానే రైస్ మిల్ యాజమాన్యం



ద్వారా బాధితు కుటుంబాలకు ఒక్కొక్కరికిరూ 15 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని పెద్దల సమక్షంలో నిర్ణయించడం జరిగింది. దానికి యాజమాన్యం అంగీకరించిందని రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలియ జేశారు.

అనంతరం ప్రమాదం జరిగిన తీరును సమగ్ర విచారణ చేపట్టి పూర్తి సమాచారాన్ని తెలియ చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. తద నంతరం జరగాల్సిన కార్యక్రమాలు వెంటనే చేపట్టి ఆ కుటుంబాలకు అండగా ఉండాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు.

## ఇంటర్ లో అత్యధిక మార్కులతో ఆదిత్య జయకేతనం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
ఇంటర్ బోర్డ్ ప్రకటించిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు అధ్భుత ఫలితాలతో పాటు అత్యధిక శాతం ఉత్తీర్ణతను సాధించారు.జూనియర్ ఇంటర్ లో ఎంపీసీ విభాగంలో వై. ప్రసన్నాంబిక, బి. లక్ష్మిసంజన,కె. బాల వెంకటేశ్వర రావు,తాడి మాధవి 470 మార్కులకుగాను 466 మార్కులు నలుగురు విద్యార్థులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకొన్నారు. అదే విధంగా 465 మార్కులు 16 మంది విద్యార్థులు సాధించారు బైపిసి విభాగంలో ,టి. సాహితి,బి. అనిత, 440 మార్కులకుగాను 435 మార్కులు సాధించారు. అదేవిధంగా 434 మార్కులు ఒకరు, 433 మార్కులు ఇద్దరు, 432 మార్కులు ఎనిమిది మంది విద్యార్థులు సాధించారు ఎం ఇ సి విభాగంలో పి. వెన్నెల 500 మార్కులకుగాను 491 మార్కులు ఒకరు, 490 మార్కులు నలుగురు, 489 మార్కులు ఒకరు విద్యార్థులు సాధించారు.సీనియర్ ఇంటర్ లో ఎంపీసీ విభాగంలో ఎన్. సవిత 1000 మార్కులకుగాను 992 మార్కులు,షేక్ అసిన్, కె. యాస్మిన్ షేక్ 1000 మార్కులకుగాను 991 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకున్నారు. అదే విధంగా 990 మార్కులు నలుగురు, 989 మార్కులు ఏడుగురు, 988 మార్కులను ముగ్గురు విద్యార్థులు సాధించారు బైపిసి విభాగంలో టి.వై. ప్రియ, పి.బి.వి.ఎల్. సుహృధి 1000 మార్కులకుగాను 989 మార్కులు ఇద్దరు విద్యార్థులు సాధించారు, అదేవిధంగా, 988 మార్కులు ఒకరు, 987 మార్కులు ఇద్దరు, 986 మార్కులు ఒకరు, 985 మార్కులు ఒకరు సాధించారు. ఎం ఇ సి విభాగంలో ఎన్. ఎన్. దుర్గ చంద్రిక 1000 మార్కులకుగాను 980 మార్కులు సాధించారు. ఎమ్.డి. త్రిపుర నాగ శ్రీ 976 మార్కులు, 974 మార్కులు ఒకరు సాధించారు.

ఈ విజయాలు ఆదిత్య విద్యాపటిమను మరొక్కసారి ఋజువుచేసాయి. ఇంటర్ ఫలితాలలో మనవిజయాన్ని సాధించిన విద్యార్థులకు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్. శేషారెడ్డి అభినందనలందజేసారు. విజేతలు విద్యారంగంలో అనన్య సామాన్యమైన ప్రతిభను కనపరుస్తూ జీవితంలో ఉన్నతస్థానాన్ని అధిరోహించాలని ఆశిస్తూ ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్. కె. దీపక్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఎన్. సతీష్ రెడ్డి, జూనియర్ కాలేజెస్ కోర్డినేటర్ శ్రీ.కె. లక్ష్మీకుమార్, డైరక్టర్లు ఎస్.వి. రాఘవరెడ్డి, ఎస్.పి.గంగిరెడ్డి, ఐ.ఐ.టి ప్రిన్సిపాల్ జె. మెయినా మరియు ఆదిత్య నిర్వహణలో గల ఇతర కేంద్రాలలో గల కళాశాలల ప్రిన్సిపాల్స్ అత్యధిక గ్రేడ్లను సాధించిన విద్యార్థులను, ఉత్తమ శిక్షణనందించిన అధ్యాపకవర్గాన్ని అభినందించారు.

## ఇంటర్ ఫలితాలలో తిరుమల విద్యాసంస్థల ప్రభంజనం




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త )**
రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. జూనియర్ ఇంటర్ ఎమ్.పి.సి. విభాగంలో 470కి 467 మార్కులు 5 గురు విద్యార్థులు యు. విరోనిక, యమ్. హర్షిత, యస్, తేజ, జి. రాజ నీవన్ తేజ, ఎ. వీర వెంకట సాయిలికి సాధించారని , 466 పైన 31 మంది, 464పైన 369 మంది, 460 పైన1086మంది , 450 పైన ఇద్దరిలో ఒకరికి అనగా 2133 మంది సాధించారని మరియు 99.20% ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. బై.పి.సి. విభాగంలో 440కి 436 మార్కులు 11 మంది విద్యార్థులు కె. సుప్రియ, ఎ. శ్రీరామ తేజశ్విని, సిహెచ్. నేహ గ్రేస్, జి. మోహన రూప, జె. భవిత, కె. గాయత్రి, టి. సరయు, బి. యశశ్విని, షేక్, షమీన, ఆర్, వీర గంగ నాగేంద్ర, పి. ప్రణవ్ సాయి గణేష్ సాధించారని, 435 పైన 32 మంది, 433 పైన 91 మంది, 430 పైన 167 మంది, 400 పైగా మార్కులు 463 మంది సాధించారని మరియు 99.47% ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. సీనియర్ ఇంటర్ ఎమ్.పి.సి. విభాగంలో 1000 మార్కులకు గాను 991 మార్కులు 7 గురు విద్యార్థులు యమ్, ప్రియ హాసిని, సిహెచ్, హరి సూర్య, పి, పవిత్ర, కె, మానస, యమ్. లేఖన, యస్, సాయి లిఖిత, పి. దాత్రి కావ్య శ్రీ సాధించారని, 23 మంది విద్యార్థులకు 990 మార్కులు, 331 మంది విద్యార్థులకు 985 మార్కులు పైన, 791 మంది విద్యార్థులకు 980 మార్కులు పైన, 2151 మంది విద్యార్థులకు 950 మార్కులు పైన సాధించారని మరియు 99.98% ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు.

బై.పి.సి. విభాగంలో 1000 మార్కులకు గాను షేక్ ఫాతిమున్నీసా బేగం 991 మార్కులు, పి. నాగ వైష్ణవి, సిహెచ్. వి. డి. రేణుక, ఎన్. వైష్ణవి, బి, హర్షిత, ఎన్. మణి, జి. రితిక 990 మార్కులు సాధించారని, 108 మంది విద్యార్థులు 980 పైన, 204 మంది విద్యార్థులు 970 పైన, 297 మంది విద్యార్థులు 950 మార్కులు పైన సాధించారని మరియు 100% ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమల రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి, సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి. శ్రీహరి మరియు విద్యాసంస్థల టీచింగ్ & నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## ఫలితాలకు దూరమైన జడ్.పి.హెచ్.ఎస్ ప్లస్ పాఠశాలలు

**- ఏ.మల్లవరం గురుకులంలో ఫలితాలు ఉత్తమం**




**రౌతులపూడి , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
ఇంటర్మీడియట్ ఫలితాల్లో జడ్.పి.హెచ్.ఎస్ ప్లస్ పాఠశాలలు బోల్తా పడ్డాయి. మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు, రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కో ఎడ్యుకేషన్ కు జడ్పీహెచ్ఎస్ ప్లస్ ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించారు. రౌతులపూడిలో మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపిసి గ్రూపుల నుండి 56 మంది విద్యార్థులు హాజరు కాగా కేవలం ఒక్కరు మాత్రమే పాసయ్యారు. మిగిలినవారు ఉత్తీర్ణులు కాకపోవడానికి కారణం ఉపాధ్యాయులు లేకపోవడమా? విద్యార్థులు చదువుపై దృష్టి సారించకపోవడమా? అనే విషయాన్ని స్థానికులు బహిరంగంగా వెల్లడిస్తున్నారు. అదేవిధంగా ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపు నుండి 19 మంది విద్యార్థులు హాజరు కాగా ఇద్దరు పాసయ్యారు. రెండవ సంవత్సరం ఎంపీసీ, బైపిసి గ్రూపు నుండి 13 మంది విద్యార్థులు హాజరు కాగా కేవలం ఒక్కరు మాత్రమే పాస్ అయ్యారు. ఇక్కడ అదే పరిస్థితి నెలకొంది. ఏ.మల్లవరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం కళాశాలలో ఫలితాలు ఉత్తమంగా వచ్చాయి. మొదటి సంవత్సరం లో 37 మంది విద్యార్థులు హాజరుకాగా 23 మంది విద్యార్థులు పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 54 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరు కాగా38 మంది విద్యార్థులు ఉత్తీర్ణత చెందారు. ద్వితీయ సంవత్సరంలో కే.చందుతేజ 869 మార్కులు, సిహెచ్ శివరామకృష్ణ 846 మార్కులు, పి అక్షయ్ 822 మార్కులు సాధించి కళాశాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని ప్రిన్సిపాల్ విజయ్ తెలిపారు. ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు, అధ్యాపకులను ఆయన అభినందించారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రభంజనం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు. తమ కళాశాల నుండి 15 మంది పైగా విద్యార్థులు 980 కంటే ఎక్కువ మార్కులు సాధించారని అయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలు మొదటి సంవత్సర ఫలితాలు ఎం.పి.సి నందు ఆర్. ఎస్. ఎస్. నగేష్ 464/470, జి.అనూష 460/470, కే. యామినీ జ్యోతిక 460/470, జి. లాస్య శ్రీ 460/470 బై.పి.సి నందు ఆర్. నాగ సూర్య భవ్య 429/440 ద్వితీయ సంవత్సర ఫలితాలు ఎం.పి.సి నందు ఎ.హర్షిత 988/1000, ఎస్ .మేఘన 986/1000 బై.పి.సి నందు ఎమ్. సత్య అక్షయ 986/1000, సిహెచ్. పూర్ణ శివాని 984/1000 ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్. వి.కె నరసింహారావు, ప్రిన్సిపల్ వి.వి.ఎస్.బి భానుమూర్తి, అకడమిక్ ఇంచార్జి డి.శ్రీ లక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

## శ్రీ నిధి జూనియర్ కాలేజీ విజయ ప్రభంజనం



**శంకవరం , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
ఇంటర్ ఫలితాలలో శ్రీ నిధి కాలేజ్ విద్యార్థులు విజయ ప్రభంజనం తో అత్యధిక ఉత్తీర్ణిత సాధించారు .అత్యధికంగా కొయ్య నాగదేవి ఎంపీసీ లో 1000 కి 979 మార్కులు , వై యామిని ఎంపీసీ లో 967/1000 మార్కుల సీనియర్ బైపీసీ లో ఎమ్.లక్ష్మి అత్యధికంగా 976/1000 మార్కులు ఎమ్.మాధవి 969/1000 మార్కులు సాధించారు. సీనియర్ సిఈసిలో వై. వెంకటలక్ష్మి అధికంగా 905/1000 మార్కులు జూనియర్ సీఈసీ టి.నవ్యశ్రీ 460/500 మార్కులు , ఎం వర లక్ష్మి 423/500 మార్కులు సాధించారు జూనియర్ ఎంపీసీ లో జి వర్షిణి 450/470 కె దుర్గా ప్రభ ప్రసన్న 448/470 మార్కులు సాధించారు, జూనియర్ బైపీసీ లో టి రామలక్ష్మి 419/440 మార్కులు కే.కరుణశ్రీ 403/440 మార్కుల సాధించారు వీరందరిని ప్రిన్సిపాల్ నాయుడు రవి , కరెస్పాండంట్ దాసం గంగా మహేష్ అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

## సోము వీర్రాజుకి మంత్రి పదవి ఇవ్వాలి

**సామర్లకోట , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
కూటమి ప్రభుత్వం బిజెపి ఎమ్మెల్సీగా ఎంపికైన సోము వీర్రాజును ఏపీ మంత్రిగా ఎంపిక చేయాలని రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ మాజీ చైర్మన్, బిజెపి నాయకులు డాక్టర్ గోరకపూడి చిన్నయ్య దొర కోరారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా సోము వీర్రాజు ఎంపిక కావడంతో రాజమహేంద్రవరంలోని ఆయన క్యాంపు కార్యాలయం లో చిన్నయ్య దొర కలిసి అభినందనలు తెలియజేశారు.




## సీతానగరంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**సీతానగరం , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలోని జీవీకే ఫంక్షన్ హాల్లో బత్తుల బలరామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చే బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ కడలి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ చెకప్‌తో పాటు గుండె, చర్మ, కిడ్నీ, కంటి, కీళ్ల నొప్పులు, గైనకాలజీ సంబంధిత వ్యాధులు, ఛాతి, ఊపిరితిత్తుల సమస్యలు , క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, పలు రకాల వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కడలి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో కారిచర్ల విజయ శంకర్, మట్ట వెంకటేశ్వరరావు, రాపాక వెంకటలక్ష్మి, కె అరుణ కుమారి, మద్దాల కొండల రావు, మద్దాల ఏసుపాదం, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పతకాలు సాధించిన పిఠాపురం బాక్సర్స్




**పిఠాపురం , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
విశాఖపట్నం పోర్టు స్టేడియంలో శనివారం జరిగిన, 7వ రాష్ట్ర స్థాయి యూత్ ఉమెన్ బాక్సింగ్ పోటీలలో పిఠాపురం బాక్సర్స్ రెండు పతకాలు సాధించారని, కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయని, 80 ప్లస్ కేజీల ఓపెన్ విభాగంలో జె. ఐశ్వర్య సూర్య దీపిక రజత పతకం, 70 కేజీల విభాగంలో ఏ.ఎస్.ఎస్. వైష్ణవి కాంస్య పతకం సాధించారన్నారు. పతకాలు సాధించిన బాక్సర్స్ ను, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

## వనజీవి రామయ్య కన్నుమూత..
## అంబాజీపేటలో కుమ్మరి, శాలివాహన సంఘం సంతాపం

**అంబాజీపేట , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
శాలివాహన ముద్దుబిడ్డ దర్పపల్లి (వనజీవి) రామయ్య మృతితో ప్రపంచ పర్యావరణవేత్తను కోల్పోయిందని,పర్యావరణం కోసం రామయ్య త్యాగం అసామాన్యమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘ అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు మాచవరం శివారు కుమ్మరిపాలెంలో ఉన్న సీతారామ ఆలయం వద్ద వనజీవి రామయ్య సంతాప సభను శనివారం నిర్వహించారు. రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడుతూ హరితహారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన అందించిన సహకారం గొప్పదని పేర్కొన్నారు. ఆయన జీవితంలో సుమారు కోటి మొక్కలకు పైగా నాటి 'ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియా' గా పేరుగాంచారన్నారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2017 లో పద్మశ్రీ పురస్కారాన్ని ప్రధానం చేసిందని తెలిపారు. 1995లో భారత ప్రభుత్వం నుండి వన సేవ అవార్డు, 2005లో సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ నుండి వనమిత్ర అవార్డు రామయ్యకు లభించిందని నారాయణమూర్తి తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు వన ప్రేమికులుగా మారాలని నారాయణమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో అదుర్తి చందు, ర్యాలి భద్ర కిరణ్,ర్యాలి నాగేశ్వరరావు, ఆదుర్తి రామాంజనేయులు, వెల్లా త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల విజయభేరి

**మామిడికుదురు , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదివే విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయభేరీ మోగించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో వనమాడి వేణు శ్రీ సాయి వర్మ ఎంపీసీ గ్రూపులో 457/470 మార్కులు సాధించి జిల్లా ప్రభుత్వ కళాశాలలో టాపర్గా నిలిచాడు. ఇంటర్ రెండవ సంవత్సరం ముస్తాక్ జహెరా సీనియర్ ఎంపీసీ గ్రూపులో 941/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్ గా నిలిచింది. సీనియర్ బైపిసి గ్రూపులో విజయనాగదుర్గ 920/1000 మార్కులు సాధించి టాపర్గా నిలిచింది. సీఈసీ లో బొంతు కుమారస్వామి 873/1000, హెచ్ఈసి గ్రూపులో ములికి సతీష్ 704/1000 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. కళాశాలలో మంచి ఉత్తీర్ణత శాతం మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఏ. పద్మశ్రీ అభినందించారు. ఇంత అద్భుత విజయాలు సాధించడంలో కృషిచేసిన అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు.

## ఆక్షయపాత్ర చలివేంద్రం ప్రారంభం



**అమలాపురం , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
సృష్టి నిర్మాణంలో భాగమై, జగత్కళ్యాణం కోసం ఈశ్వరునిచే నియమించబడి,బ్రహ్మదేవునిచే స్తుతించబడిన దేవతాగణములైన పితృదేవతల దివ్యానుగ్రహాశీస్సుల తో శ్రీ దక్షిణేశ్వర శక్తి స్తల్ నందు చలివేంద్రాన్ని రేపాక సత్యనారాయణ మూర్తి (చిన్నా), వాణి కల్పన దంపతులు ప్రారంభించారు.శ్రీ గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో రాగిజావ,షర్బత్,చల్లని మజ్జిగతో పాటు 24 గంటలు రెండు కూలర్స్ ద్వారా చల్లని మంచినీటిని అందిస్తున్నారు.మన పూర్వీకులైన వంశపారంపర్య జ్ఞాతులను ,పితురులను, పెద్దలను, గతించిన సమస్త జీవ రాశిని సంస్మరిస్తూ నిర్వహిస్తున్న చలివేంద్రం లో దాహార్తిని తీర్చుకోవాలని అక్షయపాత్ర వ్యవస్థాపకురాలు నాగ కనకదుర్గ కోరారు. కార్యక్రమం లో, కుమారి,ప్రసాద్, నందు, ప్రసాద్, స్వామి, పూర్ణ, జ్యోతి,తేజ, జాబిల్లి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట కైలాస భూమి అభివృద్ధికి అంకురార్పణ : ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట రూరల్ , ఏప్రిల్ 12 ( ప్రభాతవార్త ) :**
జీవిత మజిలీలో అంతిమ సంస్కారం గౌరవప్రథంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.కొత్తపేట బోడిపాలెం వంతెన దిగువన సుడిగుండాల పాయ వద్ద ఏర్పాటు చేసిన కైలాస భూమిని ఎంపీ హరీష్ మాధూర్,జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ,బండారు సంజీవ్ తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనిషి జీవితంలో చివరి ఘట్టం పూర్తి సౌకార్యాలతో సాగనంపాలనే ఆలోచన నేడు ఈ కైలాస భూమిని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు చివరిసారిగా వీడ్కోలు పలకడానికి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా కైలాస భూమిని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.గతంలో ఈ ప్రదేశంలో అంత్య క్రియలు చేయడానికి వీలుగా ఉండేది కాదని,అంత్యక్రియల అనంతరం స్నానం చేయ డానికి కూడా అవకాశం లేదని చెప్పారు.అటువంటి పరిస్థితి లేకుండా అన్ని సౌకర్యాలతో ఈ కైలాస భూమిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.అంత్య క్రియలకు నూతన భవనంతో పాటు నాలుగు చట్రాలను ఏర్పాటు చేశామని,స్నానాలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు, అలాగే అస్థికలను భద్ర పరిచేందుకు లాకర్లను కూడా సిద్ధం చేసినట్లు సత్యానందరావు వివరిం చారు. ఈ కైలాస భూమి అభివృద్ధి చేయడానికి సహకరించిన లైయిన్స్ క్లబ్ సభ్యులు నంబూరి రెడ్డయ్య,బాదం ఐ బ్యాంక్ నిర్వాహకులు బాదం బాలకృష్ణ మరియు దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే ఎంపీ నిధులు ఇచ్చిన హరీష్ మధూర్ కు,నిధులు కేటాయించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే సత్యానందరావు ధన్యవాదాలు తెలియజేశారు,ఎంపీ హరీష్ చేతుల మీదుగా కైలాస రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్,బూసి జయలక్ష్మి భాస్కరరావు, చిలువూరి సతీష్ రాజు,పాలూరి సత్యానందం ,ముత్యాల బాబ్జీ,మిద్దే ఆదినారాయణ,ధరణాల రామకృష్ణ,కంఠంశెట్టి చంటి, అయినవిల్లి సత్తిబాబు గౌడ్,పల్లి శాంతి, బీర ఇస్సాక్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# వీడని బంధం స్నేహం

కష్టాల్లోనూ, సుఖాల్లోనూ తోడుండేది స్నేహమే అంటుంటారు. అలాంటి అను బంధం విడిపోవడా నికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని కారణాలున్నా యంటున్నారు నిపుణులు.

ౖ అసూయ.. ఎలాంటి బంధంలోనైనా చిచ్చు పెడుతుంది. ఒకసారి ఎదుటివారిపై ఆ ఫీలింగ్ మొదలైందంటే.. ఎలాంటి బంధంలోనైనా చిచ్చు పెడుతుంది. ఒకసారి ఎదుటివారిపై ఆఫీలింగ్ మొదలైందంటే.. వాళ్ల చేసే ప్రతి పనిలోనూ నెగెటివ్ అంశాలే కనిపిస్తాయి. తప్పు తెలుసుకొని మనసు మార్చుకుంటే సరే సరి. లేదంటే తెగే దాకా బంధాన్ని వదిలిపెట్టదిది.



ఎలాంటి అనుబంధంలోనైనా మనస్పర్థలు, గొడవలు సహజం. ఎంత ప్రాణ స్నేహితుల మధ్యైనా అప్పుడప్పుడూ గొడవలు జరుగుతుంటాయి. అయితే కొంతమంది వీటిని తేలిగ్గా తీసుకొని తమ ఫ్రేండ్స్‌తో తిరిగి కలిసిపోతే.. మరికొందరు వీటిరు పట్టుకొని వేలాడుతుంటారు. ఇలాంటి ఉడుం పట్టు ఇద్దరి మధ్య అనుబంధాన్ని దూదం చేస్తుందే తప్ప దగ్గర చేయదు. స్నేహమంటే ఇద్దరు వ్యక్తులకే పరిమితం కావాలని లేదు. ఇలా ఎక్కువమంది స్నేహితులున్నప్పుడు ఒకరితోనే సమయం గడపడం కుదరచ్చు. కుదరక పోవచ్చు. ఇలాంట ప్పుడు ఎదుటివారిని అపార్థం చేసుకొని విడిపోయే వారూ లేకపోలేదు. స్నేహమంటే జీవితంలో ఒక భాగం మాత్రమే! ప్రేమ, పెళ్లి పేరుతో స్నేహితురాలు మీకు దూరమైనంత మాత్రాన ఆమెను అపార్థం చేసుకోవడం, నాతో అంతకు ముందు లాగా సమయం గడపట్లేదని, మాట్లాడట్లేదని అనుకోవడం సరికాదు. ఇది కూడా అర్థం చేసుకోకుండా కొంతమంది తమ ఫ్రెండ్స్‌ని శాశ్వతంగా దూరం చేసుకుంటుంటారు. చాడీలు ఏ అనుబంధాన్నైనా విడదీస్తాయి. ఇద్దరి మధ్య వచ్చే మూడో వ్యక్తితోనే ఇవి అనుబంధంలో చిచ్చుపెడతాయి. ఒక్కోసారి ఈ మూడో వ్యక్తి కుటుంబ సభ్యులు/తల్లిదండ్రులు కూడా కావచ్చు. ఈ క్రమంలో మీ గురించి వారికి వారి గురించి మీకు చెడగా చెప్పడం, అవి నిజమే అనుకొని నమ్మి చేజేతులా తమ స్నేహాన్ని దూరం చేసుకునే వారూ కొందరుంటారు. నమ్మకం లేని చోట ప్రేమే కాదు.. స్నేహమూ ఉండదు. కారణమేదైనా ఒకరిపై మరొకరు నమ్మకం కోల్పోయిన మరు క్షణం నుంచేఇద్దరి మధ్యదూరం పెరగడం మొదలవుతుందంటున్నారు నిపుణులు. ఇది శాశ్వతంగా స్నేహాన్ని దూరం చేయచ్చంటున్నారు.

## వెంటనే క్షమాపణ వేడుకో..

**'నీవు అంతరంగములో సత్యము కోరుచున్నావు అంతర్యమున నాకు జ్ఞానము తెలియజేయుదువు, నేను పవిత్రుడనగునట్లు హిస్సోపుతో నా పాపము పరిహరింపుము. హిమముకంటెను నేను తెల్లగా నుండునట్లు నీవు నన్ను కడుగుము' (కీర్తన 51:6,7).** ఈ కీర్తన దావీదు మహారాజు బత్షెబ అనే మహిళతో పాపం చేసినప్పుడు, హిస్సోపుతో కడిగి, పాపం నుంచి విడిపించమని విలపించాడు.



ఈ కీర్తనే నేటి క్రైస్తవులకు గొప్ప ఆదర్శం. మనం కూడా ఎన్నో తప్పులను, పాపాలను చేస్తుంటాం. కానీ ఏదో క్షమించమని వేడుకోవడం కాదుకానీ, చేసిన తప్పుకు హృదయపూర్వకంగా దేవుడిని క్షమాపణలు వేడుకోవాలి. తిరిగి అలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్త పడాలి. దేవుడి మనసును మనం దుఃఖపరచకూడదు. అలాగని మనం పైనుండి ఊడిపడలేదు కదా! పాపపులోకంలో జీవిస్తున్న మనలోనూ అనేక బలహీనతలు ఉంటాయి.

దేవుడు నాతాను అనే ప్రవక్తను పంపి, దావీదు పాపం గురించి చెప్పినప్పుడు రాసాడు. తన పాపం ఎవరికీ తెలియదని, తన పాపాన్ని కప్పిపుచ్చేందుకు దావీదు, ఏకంగా బత్షెబ భర్త అయిన ఊరియాను హతమారుస్తాడు. చివరికి ఆమెను పెళ్లి చేసుకుంటాడు. అయితే దేవుడు ఆ పాపానికి తగిన శిక్షను విధించినప్పుడు దావీదు ఈ కీర్తనను రాసాడు. దావీదు తన పాపాన్ని కప్పిపుచ్చాడు. అయితే దేవుడు తనను శిక్షించినప్పుడు అమితంగా పశ్చాత్తాపం పడ్డాడు. కన్నీటితో దేవుడిని వేడుకున్నాడు. క్షమించమని కాదు, అతిక్రమములు చేసినప్పుడు ఆ తప్పులను కప్పిపుచ్చేందుకుగానీ లేదా ఆ తప్పును సమర్థించుకునేందుకు ప్రయత్నం చేసినప్పుడు, దానికి రెండింతలుగా దేవుడి శిక్షకు మనం పాత్రులం అవుతాం. కాబట్టి నిజయమైన పశ్చాత్తాపంతో, హృదయంలో గుచ్చుబడే అనుభవంతో దేవుడిని క్షమించమని వేడుకున్నప్పుడు తప్పకుండా దేవుడి దయ, క్షమాపణలను పొందగలం. అంతేకాదు, తప్పు చేసినప్పుడు ఆలస్యం చేయకుండా, వెంటనే దేవుడిని క్షమించమని వేడుకోవాలి. జాగు చేస్తే, మనకు నష్టం.

- పి.వాణిపుష్ప

అంత ర్వాణి

## కళ్ల జబ్బులు

కన్ను అన్ని ఇంద్రియాలలో ముఖ్యమైనది. కనుక కన్నుకు ఏదైనా సమస్య వస్తే వెంటనే డాక్టరు దగ్గరకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. కళ్లకు సంబంధించిన సమస్యల్లో మనకు ఎక్కువగా కని పించేవి కండ్ల దురద, నొప్పి, కండ్లకలక, కంటిలో పువ్వు లాంటి అనేక సమ స్యలు ముందుగా కని పిస్తాయి. కంటికి జబ్బు చేసిందంటే మనకు ముందుగా కళ్లల్లో మంట, కంటివెంట నీరు కారడం, కళ్ల అంటుకుపోవడం, వాపు రావడం, కళ్ల ఎర్రబడటం, పుసులు కట్టడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా కంటిలో ఎరుపు, దురద, వాపులాంటి ఎలర్జీ లక్షణాలకు మూలికా చిట్కాలతో సరిపెట్టుకోవచ్చు. లేదా పైన చెప్పిన విధంగా ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం మంచిది.

# బాదం మంచి స్నాక్

డ్రైఫ్రూట్స్ విషయంలో చాలామందికి అపోహాలుం టాయి. ఇవి తింటే శరీరంలో కొవ్వు పెరిగి లావవుతామని, ఫలితంగా లేనిపోని ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకున్నట్లవుతుందని కొంతమంది భావిస్తారు. అయితే ప్రత్యేకించి బాదం విషయంలో ఈ అపోహలన్నీ సరికాదం టున్నారు నిపుణులు. అంతేకాదు.. వీటినితీసుకోవడం వల్ల బరువు పెరగకుండానే, శరీరానికి ఉపయోగపడే విటమిన్ 'ఇ', పీచు.. వంటి ఎన్నో పోషకాలతో మిళితమైన బాదం పప్పు బరువు తగ్గించడంలో ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం..

మంచి స్నాక్ .. ఇంట్లోనైనా, ఆఫీసులోనైనా లేదంటే బయటికి వెళ్లినప్పుడైనా సాయంత్రం పూట స్నాక్స్ తినందే కొందరు ఉండలేరు. అందుకే ఈ సమయంలో వారికి నచ్చినవేవో చేసుకొని లేదా బయటికి వెళ్లే కొనుక్కొని ఆరగిస్తుంటారు. అయితే ఇవి అంత ఆరోగ్యకరం కాకపోవచ్చు. కాబట్ట వీటనిననంటికి బదులు ఓ గుప్పెడు బాదం పప్పులినన తీసుకోవడం మంచిదని సూచిస్తు న్నారు నిపుణులు. ముఖ్యంగా ఇందులో క్యాలరీలు తక్కువగా ఉండడం వల్ల బరువు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ఇందులో అధిక మొత్తంలో ఉండే పీచు పదార్థాం కడుపునిండుగా ఉండేలా చేసి ఎక్కువ సమయం ఆకలి కాకుండా చేస్తుందా తద్వారా ఇతర ఆహార పదార్థాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తపడచ్చు.

కడుపు నిండుగా.. ఉప్మా, ఓట్‌మీల్, కిచిడీ, నూడుల్స్, వంటి బ్రేక్‌ఫాస్ట్‌లో బాదం పప్పును వేయడం లేదంటే బ్రేక్‌ఫాస్ట్ పూర్తయిన తర్వాత కొన్ని బాదం పప్పుల్ని తినడం వల్ల కడుపు నిండుగా అనిపించి చాలా సేపటి వరకు ఆకలేయకుండా ఉంటుంది. తద్వారా ఏది పడితే అది తినకుండా ఉండి.. బరువు పెరగకుండా జాగ్రత్తపడచ్చు.



ౖ పొట్ట తగ్గాలంటే.. పొట్ట తగ్గించుకునే క్రమంలో వివిధ వ్యాయామాలు చేయడం మామూలే దాంతో పాటు రోజూ బాదం పప్పుల్ని కూడా తినడం అలవాటు చేసుకుంటే పొట్ట భాగంలో పెరిగిపోయినకొవ్వుల్ని తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. ఇవి కూడా.. ౖ బాదంలోని మెగ్నీషియం రక్తంలోని చక్కెరల్ని అదుపు చేస్తుంది. తద్వారా ఆహారం ఎకునకవగా తినాలన్న కోరిక తగ్గుతుంది.

శరీరంలోని చెడు కొవ్వుల్ని తగ్గించి, మంచి కొవ్వుల్ని పెంచే శక్తి బాదం పప్పుకి ఉంది. తద్వారా బరువు అవుపులో ఉండడంతో పాటు గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

ౖ. రాత్రంతా నానబెట్టిన బాదం పుప్పుల్ని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. బాదం నానబెట్టడం వల్ల లైపేజ్ అనే ఎంజైమ్ ఉత్పత్తవుతుంది. ఇది మన ఆహారం ద్వారా తీసుకున్న కొవ్వులు కరిగేందుకు దోహదపడుతుంది.

## పైనాపిల్ సబ్జా షర్బత్

శరీర ఉష్ణోగ్రతలను చల్లపర్చటంలో సబ్జా గింజల ఆధారిత షర్బత్‌లను తాగితే ఎన్నో రకాల ఉపయోగాలు ఉంటాయి. పైనాఫిల్, సబ్జా గింజలతో కలిసి షర్బత్ ఎలా చేయవచ్చో తెలుసుకుందా.

తయారీవిధానం :



.పైనా పిల్ పైన తొక్క తీసి చిన్న ముక్క లుగా చే యాలి. ఈ ముక్కలను కుక్కర్ లో వేసి రెండు కూ తలు వచ్చే దాకా ఉడికించాలి. ఇలా ఉడికించటం వల్ల పైనాపిల్ మరింత రుచికరంగా తయారవుతుంది.

. రెండు స్పూనుల సబ్జాగింజలను ఒక గిన్నెలో నీళ్లు పోసి నానబెట్టాలి.

.ఉడికి ముక్కలను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.ఈ ముద్ద నుంచి రసం పిండాలి.

. ఈ రసంలో కొద్దిగా తెనే, మిరియాలపొడి, నిమ్మరసం వేసి కలపాలి. ఆతర్వాత నానబెట్టిన సబ్జాగింజలను రసంలో వేసుకోవాలి.

## క్యాబేజీ దాల్ పరాఠా

కావాల్సి న పదార్థాలు : గోధుమ పిండి– ఒక కప్పు క్యాబేజీ తురుము – ఒక కప్పు, పెసరుపప్పు– మూడు స్పూనులు, సోంపు– ఒక టేబుల్ స్పూను,సన్నటి ఉల్లిపాయ ముక్కలు– అరకప్పు, తరిగిన పచ్చిమిర్చి ముక్కలు. ఒక టేబుల్ స్పూను, సన్నగా తరిగిన పుదీనా– రెండు స్పూనులు, పసుపు– పావు స్పూను, నూనె – తగినంత, నీళ్లు– తగినన్ని.



తయారీ విధానం:

పరోటా కోసం.. గోధుమ పిండిలో ఒక స్పూను నూనె, కొద్దిగా ఉప్పు వేసి నీళ్ల పో కలపాలి. ఈ పిండి పలుచగా ఉండకూడదు. అలాగని పూరీల పిండిలా బాగా గట్టిగా కూడా కూడా ఉండకూడదు. దీనికి ఒక బేసిన్‌లో పెట్టి తడిగుడ్డ కప్పి 15 నిమిషాలు ఉంచాలి.

స్టఫింగ్ కోసం..

. ఒక మూకుడులో నూనె వేసి సోంపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత దానిలో పచ్చిమిర్చి ముక్కలు, క్యాబేజీ వేసి మూత పెట్టి మగ్గ నివ్వాలి.

.ఆ తర్వాత పెసరుపప్పు, పుదీనా, పసుపు కూడా వేసి మగ్గనివ్వాలి. మధ్యలో కొద్దిగా నీళ్లు చల్లాలి. బాగా మగ్గిన తర్వాత చల్లార్చాలి.

చివరగా..

. గోధుమ పిండిని గుండ్రంగా ఒత్తాలి. దాని మధ్యలో స్టఫింగ్ పెట్టి– గుండ్రంగా ఉండలా చేయాలి.

. ఈ ఉండను చేతితో కానీ అప్పడాల కర్రతో కానీ ఒత్తుకోవాలి. దాని పెనంపై కొద్దిగా నూనె రాసి కాల్చాలి.

జాగ్రత్తలు :- . స్టఫింగ్ బాగా ముద్దగా ఉండకూడదు. పొడిగా ఉంటేనే పరాటా బావుంటుంది. స్టఫింగ్ పెట్టిన తర్వాత పరాటాను గట్టిగా ఒత్తకూడదు. ఒత్తితే స్టఫింగ్ బయటకు వచ్చేస్తుంది.

# బిజెపి మత ప్రాతిపదికన విభజన రాజకీయాలకు పాల్పడుతోంది

**మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలకు సిద్ధం కావాలి**

**బిఆర్ఎస్‌తో కలిసి పనిచేయబోం**

**సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**హైదరాబాద్,ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలేసి.. మత ప్రాదిపదికన విభజన రాజకీయాలతో పాటు రాష్ట్రాల మధ్య వైషమ్యాలకు పాల్పడుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దేశానికే బిజెపి ప్రమాదకరంగా మారిందని, ప్రజలంతా ఏకమై రాజకీయంగా ఆ పార్టీకి బుద్ధి చెప్పాల్సి న సమయం అసన్నమైందన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మాట్లాడారు. దేశంలో వేల సంవత్స రాలుగా చరిత్రలో విభిన్నమైన సంప్రాదాయాలు, సంస్కృతులు ఉన్నాయని.. వాటి మధ్య చిచ్చు పెడుతూ బిజెపి మతాన్ని రెచ్చగొట్టి ఓట్ల ద్వారా గద్దెనెక్కుతోందని కూనంనేని విమర్శించారు. మతోన్మాద బిజెపి ఆధికారాన్ని అడ్డం పెట్టుకుని వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించడం సరైంది కాదన్నారు. మతాల ఆధారంగా ఎవరి ధార్మిక సంస్థలు వారికి ఉన్నాయని, వాటిలో ప్రభుత్వం కలుగజేసుకోవడం ఎంతమాత్రం సరికాదన్నారు. వక్ఫ్ బోర్డులో, భూములలో అక్రమాలు చోటుచేసుకుంటే వాటిని ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారమే సరిదిద్దవచ్చన్నారు. చట్ట సవరణ పేరుతో వక్ఫ్ బోర్డులో ఇతర సామాజికవర్గాల వారిని సభ్యులుగా చేర్చడం వెనక కుట్ర దాగుందని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పించాల్సి న బాధ్యత కేంద్రానిదేనని సాంబశివరావు అన్నారు. రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి సుప్రీంకోర్డు అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేసి ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. తద్వారా తరతరాలుగా వెనకబాటుకు గురైన బిసి వర్గాలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ఇందుకు సిద్ధంగా లేనట్లుగా వ్యవహారిస్తోందని కూనంనేని సాంబశివరావు అగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలకు మనుషులను చంపే అధికారం లేదని, ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం మాత్రమే శిక్షించాలన్నారు. కేంద్ర బలగాల ద్వారా మావోయిస్టులను వెంటాడి చంపడం సరైందికాదన్నారు. మావోస్టులతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగిన వాతావరణ కల్పించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సి న నిధులను ఇచ్చి ఆదుకోవాల్సి న కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ఒక న్యాయం, తెలంగాణకు మరో న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్‌తో కలిసి పనిచేసే అలోచన లేదని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బిసి రిజర్వేషన్లపై బిజెపిపై యుద్ధం చేయాలని సూచించారు. సెంట్రల్ యూనివర్శిటీ భూములపై ప్రభుత్వం చర్చలు జరపడాన్ని స్వాగతిస్తున్నామని.. సెంట్రల్ యూనివర్శిటీ భూముల విక్రయం వ్యవహారంలో బిజెపి ఎంపి ఎవరు ఉన్నారో మాజీ మంత్రి కెటిఆర్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

# ఇంటర్ లో ఎంజెపి ప్రభంజనం న- సెకండ్ ఇయర్ లో 98 శాతం ఉత్తీర్ణత :మంత్రి సవిత



**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్ లో ఎంజేపీ ప్రభంజనం సృష్టించారు. సెకండ్ ఇయర్ లో 98 శాతం, ఫస్ట్ ఇయర్ లో 92.40 శాతం మేర ఫలితాలు సాధించారు. రాష్ట్రంలో మిగిలిన ప్రభుత్వ జూనియర్, ఇతర రెసిడెన్షియల్ కళాశాలల కంటే ఎంజేపీ విద్యార్థులు మెరుగైన ఫలితాలతో ముందంజలో నిలిచారు. రాష్ట్ర ఫలితాల కంటే ఎంజేపీ స్కూళ్ల అత్యుత్తమ ఫలితాలు సాధించడం విశేషం. శనివారం ఉదయం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఏపీ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ఒకేసారి విడుదల చేసిన చేసిన ఫలితాల్లో ఎంజేపీ బీసీ కళాశాలలు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అత్యుత్తమ రిజల్ట్స్ సాధించాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 18 ఎంజేపీ కళాశాలలకు విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 1,608 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 1,578 మంది ఉత్తీర్ణులయ్యారు. 30 మంది మాత్రమే ఫెయిలయ్యారు. ఇంటర్ సెకండియర్ లో ఉత్తీర్ణత శాతం 98 శాతంగా నమోదయ్యింది. సెకండ్ ఇయర్ ఎంపీసీలో వెయ్యి మార్కులకు గాను బి. దివాకర్ అనే విద్యార్థి 984 మార్కులు, బైపీసీలో కె.కవితాభాయి 982 మార్కులు సాధించారు. మొదటి సంవత్సర పరీక్షలకు 1,925 మంది హాజరుకాగా, వారిలో 1,779 మంది ఉత్తీర్ణులయ్యారు. 146 మంది ఫెయిల్ కాగా, మొదటి సంవత్సర పరీక్షల్లో 92.40 శాతం మేర ఉత్తీర్ణులయ్యారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 470 మార్కులకు గానూ ఎం.మనోజ్ కు 463 మార్కులు రాగా, బైపీసీలో 440 మార్కులకు జి.మేఘన, జి.దస్తగిరి, సీహెచ్ రాణి 435 మార్కులు సాధించారు.2 కళాశాలల్లో 100 శాతం రిజల్ట్‌ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి రెండు ఎంజేపీ బీసీ జూనియర్ కళాశాలు వంద శాతం ఫలితాలు రాబట్టాయి.

# చింతూరు మన్యంలో పట్టుకు ప్రాణంపోస్తున్న ఐటిడిఎ

## పైడిగూడెం కేంద్రంగా పట్టుచీరల తయారీకి శ్రీకారం

## వన్ ధన్ యోజన ద్వారా గిరిజనులకు లబ్ధి

## యంయఫ్‌పిల ద్వారా జీవనోపాధి కల్పనే లక్ష్యం

**(యస్.కె.యం.జాని చింతూరు ఎయస్ఆర్ జిల్లా )**

**చింతూరు ఎప్రిల్ 12 ప్రభాతవార్త** చింతూరు మన్యంలోని ఆదివాసిల ద్వారా పట్టు చీరల తయారి, ఉత్పత్తికి చింతూరు ఐటిడిఎ శ్రీకారం చుడుతుంది.పైడిగూడెం కేంద్రంగా యూనిట్‌ను నెలకొల్పి పట్టుకు ప్రాణం పోస్తుంది.తద్వారా గిరిజన గ్రామాల్లో పట్టుగూళ్ళ పెంపకం చేపట్టె రైతులకు గిట్టుబాటు ధర కల్పించటంతో పాటు ఇక్కడ పండించిన పట్టు కాయల ద్వారా, ఇక్కడే దారాన్ని తీసి ఇక్కడే పట్టు ఉత్పత్తుల తయారికి ఐటిడిఎ శ్రీకారం చుడుతుంది.చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వభరత్ పైడిగూడెం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టిసారించి శనివారం ట్రైల్‌రన్‌కు శ్రీకారం చుట్టారు. పైడిగూడెం తాస్సా ర్ సిల్క్ సమీప భవిష్యత్తులో వేలమది యువతి, యువకులకు జీవినోపాధి కల్పింటచంతో పాటు వారి కాళ్ళపై వారు నిలబడేలా చేసి ఆర్దికంగా వారిని అభివృద్ధి చేయాలన్న కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల కలను సాకారం చేయనుంది.చింతూరు ఐటిడిఎ పరిధిలోని చింతూరు,కూనవరం,,వి.ఆర్.పురం మండలాల్లో అన్ని గిరిజన గ్రామాలు దట్టమైన అడవులను ఆనుకోని ఉన్నాయి.ఎపిలో సెరికల్చర్‌లో భాగంగా అడవుల్లోని పట్టు పురుగుల పెంపకానికి చింతూరు ఏజెన్సీ అనువైనదిగా ఇప్పటికే ఎపి ప్రభుత్వం గుర్తించింది.మద్దిచెట్ల మీద పట్టుపురుగులను పెంచి పట్టుకాయాలను తయారు చేయటానికి చింతూరు ఐటిడిఎ పరిధిలోని చింతూరు ,కూనవరం,వి.ఆర్.పురం మండలాలు అనువైనవిగా ఉన్నాయి.దాంతో ఈ మూడు మండలాల్లోని దాదాపు 32 గ్రామాల్లో పట్టుపురుగుల పెంపకంపై దృష్టిసారించి సుమారు 1600 మంది గిరిజన రైతులు పైసా పెట్టుబడి లేకుండా ఒక్కో సీజన్‌లో ఒక్కో రైతు సుమారు రూ॥30వేల నుంచి రూ॥80వేల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు.ఇప్పటికే దాదాపు 10 గ్రామాల్లో ఐటిడిఎ ద్వారా పట్టుదారాన్ని తీసే యంత్రాలను అందజే యటంతో పాటు పట్టుదారాన్ని తీసే విధానంపై అనేక మందికి శిక్షణ ఇవ్వటంతో ఈ ప్రాంతంలో ఇప్పటికే పట్టుగూళ్ళు(కాయలతో)తో పట్టు దారాన్ని తయారు చేస్తున్నారు.దీని కోసం సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా ప్రతి ఏడాది జూన్ నుంచి డిశంబర్ వరకు మూడు సీజ న్లు కావటంతో 1600 మంది రైతులకు ఒక్కో రైతుకు 100 గుడ్ల చోప్పున అందజేస్తు న్నారు. వీటి ధర ఒక్కో రైతుకు సుమారు రూ॥1600 ఖర్చు అవుతున్నా, దానిని ప్రభుత్వమే భరించి పూర్తి ఉచితంగా ఇక్కడి రైతులకు పట్టు గుడ్లను అందజేస్తున్నారు. ఈ గుడ్ల ద్వారా ఒక్కో గుడ్డు నుండి సుమారు 150 నుండి 180 వరకు పట్టు పురుగులు జన్మి స్తాయి. వీటిని పుట్టినప్పుడు కాస్త జాగ్రత్త వహించి వాటిని మద్ది చెట్లపై వదులుతారు.అవి మద్ది ఆకులను తిని అదే చెట్లకు కాయల రూపంలో గూళ్ళ కట్టుకుంటాయి.వీటిని గిరిజన రైతులు సేకరించి చింతూరు కేంద్రంగా ఉన్న సెరికల్చర్ యూనిట్‌కు తరలిస్తారు.ఇక్కడ ఉన్న యూనిట్‌లో హాట్ చాంబర్‌లో వేడిచేసి గ్రేడింగ్ చేసి రైతుల వారిగా కాయల నాణ్యతను బట్టి పేర్లు నమోదు చేస్తారు.ఇలా వచ్చిన కాయలను ఆరబోసి,లెక్కించి బ్యాగుల్లో నింపి ఆక్షన్ ద్వారా అమ్మకాలు జరుపుతన్నారు.ఇది ఇప్పటివరకు జరుగుతున్న ప్రక్రియ.సుమారు ఒక్కో కాయకు రూ॥4రూపాయల వరకు ధర పలుకుతుంది. ఇలా గిరిజన రైతులు రూపాయి పెట్టుబడి లేకుండా శారీరక శ్రమే పెట్టుబడిగా ఇక్కడ పట్టుగూళ్ళ ఉత్పత్తికి ఐటిడిఎ శ్రీకారం చుట్టింది.ఇది ఒక భాగం అయితె ఇక్కడ ఉత్పత్తి అవుతున్న పట్టుగూళ్ళ నుండి ఇక్కడే దారం తీసి ఇక్కడే పట్టు వస్త్రాల తయారికి శ్రీకారం చుట్టి పైడిగూడెం కేంద్రంగా యూనిట్‌ను నెలకొల్పింది చింతూరు ఐటిడిఎ.ఈ యూనిట్ ద్వారా వస్త్రాల తయారికి అవసరమైన 15 యంత్రాలను కొనుగోలు చేసి ఇప్పటికే బిగించారు.ఛత్తీస్‌ఘడ్ లోని బిలాస్‌పూర్‌కు చెందిన అస్దిత్వ మహిళా సమితి వారితో చింతూరు ఐటిడిఎ యంవోయును చేసుకుంది.సుమారు 11 మంది సభ్యులతో కూడి ఈ బృదం నాలుగు మండలాలకు చెందిన 50 మంది గిరిజన యువతి, యువకులకు పట్టు వస్త్రాల తయారిపై శిక్షణా కార్యక్రమాన్ని ఆరునెలల పాటు నిర్వహించనుంది.వస్త్రాలు తయారి,మార్కెట్ చేయటం వంటి అంశాలపై వారికి శిక్షణ ఇచ్చి ఆర్దికంగా వారి కాళ్ళపై వాళ్ళే నిలబడేలా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఇప్పటికే విడివికె(వన్ ధన్ వికాస్ కేంద్ర) కార్యక్రమం ద్వారా యంయఫ్‌పి(మైనర్ ఫారెస్టు ప్రొడక్ట్) తో వన్ ధన్ యోజన కార్యక్రమము ద్వారా ఆయా గ్రామాల్లో ఉండే గిరిజనులకు జీవనోపాది కల్పించి వారిని వ్యాపార సాంరాజ్యంలో మెళకువలు నేర్పి వారిని వ్యాపారులుగా తీర్చిదిద్ది వారి జీవితాల్లో వెలుగులు నింపటమే లక్ష్యంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్దలు పనిచేస్తున్నాయి .దీనికోసం గిరిజన మంత్రిత్వశాఖ ద్వారా అటవి సంరక్షణతో పాటు యంయఫ్‌పిల ద్వారా ఆదాయాన్ని అర్జించటమే లక్ష్యంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గిరిజనుల అభ్యున్నతికి కృషిచేయటమే దీని లక్ష్యం. ఇక్కడి గిరిజన రైతులు వ్యవసాయంతో పాటు పట్టుపురుగుల పెంకం ద్వారా పట్టుగూళ్ళను తయారుచేసి చింతూరు కేంద్రంగా ఉన్న సెరికల్చర్ యూనిట్ ద్వారా అమ్మకాలు జరిపి లాభాలు అర్జిస్తున్నారు.పట్టుగూళ్ళ పెంపకానికి అనువైన అవకాశం ఉన్న ఈ ప్రాంతంలో పండించిన పట్టుగూళ్ళ, ఎక్కడికో తరలిపోయి దారాన్ని తీసి పట్టు వస్త్రాలుగా మారుతున్నాయి.ఇక్కడ పండించిన పట్టు గూళ్ళ ద్వారా ఇక్కడే దారాన్ని తీసి ఇక్కడే పట్టు వస్త్రాలను తయారుచేయనున్నారు.



మద్ది చెట్లపై పట్టుగూళ్ళను పరిశీలిస్తున్న చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

# 'డియర్ ఉమ' ట్రైలర్ లాంచ్

18న రాబోతోన్న డియర్ ఉమ చిత్రాన్ని అందరూ చూసి సక్సెస్ చేయండి.. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్, నిర్మాత, రచయిత సుమయ రెడ్డి.. తెలుగమ్మాయి అయిన సుమయ రెడ్డి హీరోయిన్‌గా, నిర్మాతగా, రచయితగా డియర్ ఉమ అనే చిత్రం ఏప్రిల్ 18న రాబోతోంది. ఈ



చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ మూవీకి లైన్ ప్రొడ్యూసర్‌గా నగేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నితిన్ రెడ్డి వ్యవహరించారు. ఇక ఈ సినిమాకు సాయి రాజేష్ మహాదేవ్ స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఇక ఎన్నో చిత్రాలకు అద్భుతమైన విజువల్స్ అందించిన రాజ్‌తోట కెమెరా మెన్‌గా, బ్లాక్ బస్టర్ చిత్రాలకు మ్యూజిక్ అందించిన రదన్ సంగీత దర్శకుడిగా పని చేశారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. డియర్ ఉమ ట్రైలర్‌ను గమనిస్తే, సింగర్ అవ్వాలని ప్రయత్నించే హీరో.. డాక్టర్ అవ్వాలని హీరోయిన్.. రెండు వేర్వేరు లక్ష్యాలతో ఉన్న ఆ ఇద్దరూ కలవడం, ఆ తరువాత ప్రమాదం జరగడం, వైద్య రంగంలోని లోపాల్ని చూపుతూ సాగిన సీన్లు ఆద్యంతం ఆసక్తికరంగా ఉన్నాయి. ఇక హీరో హీరోయిన్ల మధ్య సన్నివేశాలు, హీరో యాక్షన్ సీక్వెన్స్‌లు, చివర్లోకార్పోరేట్ కబంద హస్తాల్లోంచి వైద్యరంగాన్ని బయటకు తీసుకురండి అంటూ హీరో చెప్పిన డైలాగ్‌ను చూస్తే మంచి సందేశాన్ని ఇవ్వబోతోన్నట్టుగా అర్థమవుతోంది. ట్రైలర్ లాంచ్ అనంతరం, సుమయ రెడ్డి మాట్లాడుతూ, ఓ మంచి కంటెంట్‌ను ఆడియెన్స్‌కు అందించాలని అనుకున్నాను. కథ రాస్తూ ఉండగా ఎంతో కంటెంట్ వచ్చేది. రాజేష్‌తో నాకు ఎన్నో ఏళ్ల నుంచి పరిచయం ఉంది. ఆయన తన కథలన్నీ పక్కన పెట్టి నా కథ మీద దృష్టి పెట్టారు. అయితే నన్ను నమ్మి డబ్బులు పెట్టేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారా అని అనుకున్నాను. అప్పుడు మా అమ్మ నన్ను సపోర్ట్ చేశారు. నాకు సంగీతం చాలాఇష్టం. రధన్‌చేసిన అందాల రాక్షసి పాటలు చాలా ఇష్టం. అసలు రధన్ గారు మా సినిమాని ఒప్పుకుంటారా? లేదా? అని అనుకున్నాను. కథ చెప్పిన వెంటనే ఆయన ఓకే అన్నారు.

# 'విశ్వంభర' ఫస్ట్ సింగిల్

మెగాస్టార్ చిరంజీవి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ విశ్వంభర. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఈ సంవత్సరం మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రాలలో ఒకటి. ఇప్పటికే పోస్టర్లు, టీజర్ భారీ అంచనాలను నెల కొల్పాయి. ప్రతి ష్టాత్మక యువి క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం మ్యూజిక్ ప్రమోషన్స్‌ని మేకర్స్ ప్రారంభించారు. హనుమాన్ జయంతి శుభ సందర్భంగా, మేకర్స్ ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ రామ రామను రిలీజ్ చేశారు. ఇది హనుమంతునికి శ్రీరాముడి పట్ల ఉన్న అచంచలమైన ప్రేమ, భక్తిని అందంగా చూపించే ఘన నివాళి. ఈ పాట సోల్ ఫుల్ ఫీమేల్ వాయిస్‌తో ప్రారంభమవుతుంది. మెగాస్టార్ చిరంజీవి పవర్ ఫుల్ వాయిస్ "జై శ్రీ రామ్" అనే నినాదాన్ని ప్రతిధ్వనిస్తుంది.



శ్రీరాముడు, సీతా కళ్యాణం వేడుకల నేపథ్యంలో సాంగ్ విజువల్ ఫీస్ట్ లా వుంది. హృదయాన్ని హత్తుకునే క్షణంలో హీరో పవిత్ర ఉత్సవానికి శ్రీ హనుమంతునిని ఆహ్వానిస్తాడు. ఈ పాటలో భావోద్వేగం, భక్తిశ్రద్ధను మరింతగా పెంచుతుంది. మొత్తం పాట ఓ గ్రాండ్ సెటప్‌లో చిత్రీకరించారు. ఇది ఆధ్యాత్మిక సంప్రదాయాల సారాన్ని అద్భుతంగా చూపించింది. మ్యూజికల్ జీనియస్ ఎం.ఎం. కీరవాణి, ఆధ్యాత్మిక, దైవిక శక్తితో నిండిన అద్భుతమైన సాంగ్ కంపోజ్ చేశారు. లెజెండరీ సింగర్ శంకర్ మహాదేవన్, సింగర్ లిప్సిక ఈ ట్రాక్‌కు తమ ఎనర్జిటిక్ వోకల్స్ అందించారు. చిరంజీవి చరిస్మాటిక్ ప్రజెన్స్‌తో అదరగొట్టారు. గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అలరించారు. హనుమం తుడిగా అలంకరించబడిన పిల్లల ప్రజెన్స్ భక్తిని జోడిస్తుంది. హనుమాన్ జయంతికి ఇది పర్ఫెక్ట్ సాంగ్. తన బ్లాక్‌బస్టర్ ఫస్ట్‌మూవీ బింబిసారతో చెరగని ముద్ర వేసిన దర్శకుడు వశిష్ట, విశ్వంభరని అత్యద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. దీనిని ఆయన తన అత్యంత ప్రతిష్టాత్మకమైన డ్రీం ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తున్నారు. ఈచిత్రంలో త్రిషకృష్ణన్, ఆశికారంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా, కునాల్ కపూర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి డీవోపీ చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్. తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్, రచన, దర్శకత్వం: వశిష్ట. నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్.

# 'పురుష' టైటిల్ పోస్టర్

కామెడీ ప్రధానంగా వచ్చే చిత్రాలకు ప్రస్తుతం ఆదరణ ఎక్కువగా ఉంటోంది. లాజిక్స్ లేకపోయినా కామెడీ వర్కౌట్ అయితే చాలు బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలు నమోదు చేస్తున్నాయి. ఇక ఇలాంటి పూర్తి అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్‌గా పురుష అనే చిత్రం రాబోతోంది. బ్రహ్మచారి భర్త కావాలని నిర్ణయించుకున్న తరువాత జీవితం యుద్ధభూమిగా మారుతుంది అనే లైన్స్‌తో సినిమాపై ఆసక్తి పెంచేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిగాయి. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1గా బత్తుల కోటేశ్వరరావు నిర్మాతగా పవన్ కళ్యాణ్ తెరంగేట్రం చేస్తున్నారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ మూవీని శనివారం నాడు ఘనంగా ప్రారంభించారు. ఈ చిత్ర ప్రారంభ ముహుర్తానికి వడ్డవల్లి వెంకటేశ్వర రావు(బుల్లబ్బాయ్) క్లాప్ కొట్టగా, బేబీ ఏముల ధరణి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మళ్లీ రావా, జెర్సీ, మసుధ చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన వీరు ఉలవలను ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. తన శిష్యుడి కోసం సెన్సిబుల్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ లోగో, పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం చిత్రయూనిట్‌కు ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ చిత్రానికి



సినిమాటోగ్రఫర్ సతీష్ ముత్యాల, సంగీత దర్శకుడు శ్రవణ్ భరద్వాజ్, ఎడిటర్ కోటి. ఈ సినిమాలో వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్‌లు కథానాయికలుగా నటిస్తుండగా.. వెన్నెల కిషోర్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, వి.టి.వి.గణేష్ ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. నటీనటులు: పవన్ కళ్యాణ్, వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్.

## మెహ్రీన్ పిర్జాదా నయా లుక్



# అరవింద్ శ్రీనివాస్‌ను కలిసిన కమల్ హాసన్

ప్రఖ్యాత నటుడు, నిర్మాత, దర్శకుడు కమల్‌హాసన్ ప్రస్తుతం సిలికాన్‌లోని ఎఐ ఆధారిత రీసెర్చ్ సెంటర్ అయిన పెర్ప్లెక్సిటీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా సీఈఓ అరవింద్ శ్రీనివాస్‌ను కలిశారు. భారతీయ సినిమా పరిశ్రమలో గత కొన్ని దశాబ్దాలుగా విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ, సినీ పరిశ్రమ ఎదుగుదలకు కృషి చేస్తున్న కమల్ హాసన్ ఇలా భవిష్యత్తుని శాసించబోతోన్న ఏఐ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించడంతో మరిన్ని విప్లవాత్మక మార్పుల్ని తీసుకు రాబోతోన్నారు. ఈ సందర్శన తర్వాత కమల్ హాసన్ సోషల్ మీడియాలో సినిమా నుండి సిలికాన్ వరకు ప్రతీ ఒక్కటీ నిత్యం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. ఎంత కనిపెట్టినా, ఏం చేసినా కూడా ఇంకా



ఏదో చేయాలని, కనిపెట్టాలనే ఆ కుతూహలం, ఆ దాహం ఇంకా మనలో ఉంటూనే ఉంటుంది. శాన్ ఫ్రాన్సిస్కోలోని పెర్ప్లెక్సిటీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంతో నాలో ఇంకా కొత్త ఆలోచనలకు ప్రేరణ లభించినట్టు అనిపిస్తుంది. అరవింద్ శ్రీనివాస్, అతని బృందం కలిసి భవిష్యత్తును నిర్మించడంలో మన భారతీయ చాతుర్యం ప్రకాశిస్తుంది అని అన్నారు. ఈ భేటీపై అరవింద్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్ప్లెక్సిటీ కార్యాలయంలో కమల్ హాసన్ గారిని కలవడం, ఆయనకు ఆతిథ్యం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. చిత్రనిర్మాణంలో అత్యాధు నిక సాంకేతికతను నేర్చుకోవాలనే మీ ఆలోచనలు, సినిమా పట్ల మీకున్న ప్యాషన్ స్ఫూర్తిదాయకం. థగ్ లైఫ్‌తో పాటుగా మీరు పనిచేస్తున్న భవిష్యత్ ప్రాజెక్టులకు శుభాకాంక్షలు అని అన్నారు. అర వింద్ శ్రీనివాస్ ఒక భారతీయ అమెరికన్ కంప్యూటర్ శాస్త్రవేత్త మరియు వ్యవస్థాపకుడు. అతను ఐఐటీ మద్రాస్ నుండి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు, యూసీ బర్కిలీలో కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పొందారు. శ్రీనివాస్ 2022లో పెర్ప్లెక్సిటీ ఏఐని సహస్థాపించే ముందు ఓపెన్‌ఏఐ, డీప్‌మైండ్, గూగుల్ వంటి ప్రముఖ ఎఐ సంస్థల్లో పనిచేశారు. పర్‌ప్లెక్సిటీ అనేది జ్ఞానకేంద్రీకృత వేదికను సృష్టించడంలో దృష్టి సారించిన ఏఐ స్టార్టప్. ఈ కంపెనీకి జెఫ్ బెజోస్, యాన్ లెకున్ వంటి ప్రముఖ వ్యక్తులు మద్దతు ఇస్తున్నారు.

కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ విడుదలకు సిద్ధం అవుతోంది.

# 'సారంగపాణి జాతకం' విడుదలకు రెడీ

హీరో ప్రియదర్శి, దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ చాలా ఇష్టపడి చేసిన సినిమా సారంగపాణి జాతకర. ఇంటిల్లిపాదినీ కడుపుబ్బా నవ్వించే వినోదాత్మక చిత్రమిది. యూత్‌ను ఆకట్టుకునే క్రైమ్ కామెడీ అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ నెల 25న సమ్మర్ కూల్ స్పెషల్‌గా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, మా శ్రీదేవి మూవీస్ పేరు ప్రఖ్యాతులు నిలబెట్టే సినిమా అవుతుంది. కంప్లీట్ ఎంటర్ టైనర్ తీయాలనే నా కోరిక ఈ సినిమాతో నెరవేరింది. ఫస్ట్ కాపీతో సహా సినిమా రెడీ అయ్యింది. సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తి అయ్యాయి. ఈ నెల 25న మీకు రెట్టింపు ఆనందాన్ని కలిగించే విధంగా మా సారంగ పాణి జాతకర థియేటర్లలో విడుదల కానుంది. నిజానికి 18న విడుదల చేద్దామనుకున్నాం. అయితే బయ్యర్ల సూచన మేరకు, మరిన్ని మంచి థియేటర్ల సౌలభ్యత కోసం 25న వస్తున్నాం. బలగం, 35, కోర్టు సినిమాలతో ప్రియదర్శి రేంజ్ పెరిగింది. మిమ్మల్ని ఈ సినిమాతో 100 శాతం ఎంటర్టైన్ చేస్తారాయన. నా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభమైంది ఇంద్రగంటి మోహనకృష్ణ మూవీ నాని జెంటిల్‌మన్. ఆ తర్వాత చక్కని ప్రేమకథతో, సుధీర్‌బాబుతో సమ్మోహనం. ఈ రెండూ కూడా మంచి పేరు, సక్సెస్ తెచ్చాయి. ఇప్పుడు ఆ విజయాలను సారంగపాణి జాతకం కొనసాగిస్తుంది. ఇలాంటి సినిమా చేసినందుకు నేను చాలా గర్వపడుతున్నాను. అని తెలిపారు. ప్రియదర్శి పులికొండ, రూప కొడువాయూర్ జంటగా నటించిన ఈ సినిమాలో నరేష్ విజయకృష్ణ, తనికెళ్ళ భరణి, శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, అశోక్ కుమార్, రాజా చెంబోలు, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, రూప లక్ష్మి, హర్షిణి, కె.ఎల్.కె, మణి, ఐమ్యాక్స్ వెంకట్ ఇతర ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి మేకప్ చీఫ్: ఆర్.కె వ్యామజాల, కాస్ట్యూమ్ చీఫ్: ఎన్.మనోజ్ కుమార్, కాస్ట్యూమ్ డిజైనర్స్: రాజేష్ కామర్సు అశ్విన్, మార్కెటింగ్:



టాక్ స్కూప్, పీఆర్వో: పులగం చిన్నారాయణ, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్: కె. రామాంజనేయులు (అంజి బాబు) పి రషీద్ అహ్మద్ ఖాన్, కో డైరెక్టర్: కోట సురేష్ కుమార్, పాటలు: రామ జోగయ్య శాస్త్రి.

# 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' బ్లాక్ బస్టర్ లాఫ్టర్ మీట్

హీరో ప్రదీప్ మాచిరాజు లేటెస్ట్ లాఫ్టర్ బ్లాక్ బస్టర్ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌ను యంగ్ ట్యాలంటెండ్ డైరెక్టర్స్ డుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ ఎగ్జైటింగ్ ఎంటర్‌టైనర్‌లో దీపికా పిల్లి కథానాయికగా నటించింది. వేసవిలో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా ఏప్రిల్ 11న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకి ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. అన్నివర్గాల ప్రేక్షకులు అలరించి సినిమా సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. బ్లాక్ బస్టర్ లాఫ్టర్ మీట్ లో హీరో ప్రదీప్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఏప్రిల్ 11 మా జీవితంలో మర్చిపోలేని రోజు. మా చిత్రం అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి ప్రేక్షకులు చూసిన రోజిది. ఫస్ట్ ఫ్రైమ్ నుంచి లాస్ట్ ఫ్రేం వరకు ప్రేక్షకుల పెదవులపై నవ్వు ఉంటుందని ప్రామిస్ చేశాను. ఆ ప్రామిస్‌ని నిలబెట్టుకున్నాం. మీరు ఈ సినిమా చూస్తామని ప్రామిస్ చేశారు. మీ ప్రామిస్ నిలబెట్టుకుంటున్నందుకు థాంక్యూ సో మచ్. మైత్రి శశి మా టీంకి బిగ్గెస్ట్ స్ట్రెంత్. మా బ్యానర్‌లో ఫస్ట్ సినిమా మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో రిలీజ్ కావడం మాకు చాలా ఆనందంగా ఉంది అన్నారు. డైరెక్టర్ భరత్ మాట్లాడుతూ, ఆడియన్స్‌తో కలిసి సినిమా చూసాం. వాళ్ళు నవ్వుతుంటే అసలైన కిక్ వచ్చింది. ఈ సినిమా ఏడాదిన్నర పాటు కష్టపడడం. ఆ కష్టానికి ఫలితం నిన్న చూసుకున్నాం.డే వన్ నుంచి క్లీన్ కామెడీతో ఫ్యామిలీస్ అందరినీ నవ్విస్తామని చెప్పాం. అది చేశాను. థాంక్యూ అన్నారు. డైరెక్టర్ నితిన్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మా కంఫర్ట్ జోన్‌ని వదులుకొని చేసిన ప్రయత్నం ఇది. ఈ ప్రయత్నానికి మీరు ఇంత అద్భుతమైన రెస్పాన్స్ ఇవ్వడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. సినిమాకి చాలా అద్భుతంగా రెస్పాన్స్ వచ్చింది. చూసిన ప్రతి ఒక్కరూ స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు నవ్వుకుంటున్నామని చెప్పారు. ఈ అవకాశం ఇచ్చిన ప్రదీప్ అన్నకి థాంక్యూ. ఆయన సపోర్ట్ లేకపోతే ఇక్కడ వరకు వచ్చేవాళ్ళం కాదు. అందరం కలిసి చాలా మంచి సినిమా చేశాం. అందరూ థియేటర్స్‌కి వచ్చి హ్యాపీగా ఎంజాయ్ చేయండి అన్నారు.



హీరోయిన్ దీపికా మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మా సినిమాకి ఇంత మంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. థియేటర్స్‌కి వెళ్లి సినిమా చూసాం.

# '23' మూవీ నుంచి సాంగ్ రిలీజ్

మల్లేశం, 8 ఎ.ఎం. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 23తో వస్తున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. ఇటీవల విడుదల టీజర్ సెన్సేషనల్ రెస్పాన్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తాజాగా హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సినిమా నుంచి కోసీ కోయ్యంగానే సాంగ్ లాంచ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ




పాటని రా అండ్ రస్టిక్ ఎనర్జీ వున్న పవర్ ఫుల్ నంబర్ కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌కి వరంగల్ శంకర్ రాసిన సాహిత్యం ఉర్రూతలూగించేలా వుంది. రేలా జాన్ సాంగ్ హై ఎనర్జీతో పాడటం మరింత ఆలరించింది. ఈ సాంగ్‌లో లీడ్ యాక్టర్స్ రస్టిక్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి సన్నీ కూరపాటి అద్భుతమైన సినిమాటోగ్రఫీ. అనిల్ ఆలయం ఎడిటర్, లక్ష్మణ్ ఏలే ఆర్ట్ డైరెక్టర్. తారాగణం: తేజ, తన్మయి, ఝాన్సీ, పావోన్ రమేష్, తాగుబోతు రమేష్, ప్రణీత్, సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: రాజ్ ఆర్, బ్యానర్: స్టూడియో 99 విడుదల: రానా స్పిరిట్ మీడియా, సినిమా టోగ్రఫీ: సన్నీ కూరపాటి, సంగీతం: మార్క్ కె రాబిన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ సిద్దారెడ్డి ప్రొడక్షన్ డిజైన్: లక్ష్మణ్ ఏలే, ఆర్ట్ డైరెక్షన్: విష్ణు వర్ధన్ పుల్లా, కాస్టింగ్ డైరెక్షన్: మహేష్ గంగిమల్ల, డైలాగ్స్: ఇండస్ మార్టిన్ ఎడిటింగ్: అనిల్ ఆలయం కాస్ట్యూమ్ డిజైన్: శ్రీపాల్ మాచర్ల సాహిత్యం: చంద్రబోస్, రెహమాన్, సింధు మార్టిన్.

# ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ బృందంతో దిల్‌రాజు, హర్షిత్ రెడ్డి భేటీ

ప్రముఖ నిర్మాత, టిఎస్ ఎఫ్‌డిసి చైర్మన్ శ్రీ దిల్ రాజు, నిర్మాత హర్షిత్ రెడ్డి కలిసి ఇటీవల హైదరాబాద్‌లో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ బృందంలో డిప్యూటీ కాన్సుల్ జనరల్ స్టీవెన్ కానోలీ, వైస్ కాన్సుల్ హారియట్ వైట్, స్టెఫీ చెరియన్ ఉన్నారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య, ముఖ్యంగా సినిమా, సాంస్కృతిక రంగాల్లో సంబంధాలను ఎలా మరింత పటిష్టం చేసుకోవాలనే దానిపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఇరు దేశాల మధ్య సినిమా సహ నిర్మాణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల మారకము వంటివలు కీలక అంశాలపై మాట్లాడుకున్నారు.



ముఖ్యంగా, హైదరాబాద్ నగరంపైనా, తెలుగు సినిమాపైనా ఆస్ట్రేలియా ప్రతినిధులు ఎంతో ఆసక్తి, ఉత్సాహం చూపించారు. ఈ చర్చల ద్వారా ఇరు దేశాల సృజనాత్మక రంగాల మధ్య బంధం మరింత బలపడుతుందని, ఆస్ట్రేలియాలో తెలుగు సినిమాకు మరిన్ని మంచి అవకాశాలు వస్తాయని ఇరుపక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

**విజయవాడ, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో సంఘ కార్యాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నెలలో రు.6200 కోట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిలు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా చెల్లించాల్సిన పిఆర్‌సి ఎరియర్స్, డిఎ, ఎస్‌ఎల్‌ఎస్, పెన్షనరీ బెనిఫిట్స్ రు.20వేల కోట్లను చెల్లించాలన్నారు. 12వ పిఆర్‌సి కమీషన్ వెంటనే నియమించి ఆర్నెలల్లో నివేదిక తెప్పించి, వేతన సవరణ పూర్తి చేయాలని కోరారు. ఉద్యోగ సంఘాలతో సమావేశం జరిపి ఇంటీరియం రిలీఫ్‌ను ఇవ్వాలన్నారు. సంవత్సరంలోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సిపిఎస్ సమస్యపై ఉద్యోగులతో చర్చించి ఓపిఎస్ పునరుద్ధరించాలన్నారు. గ్రామవార్డు సచివాలయాలకు జరుగుతున్న రేషనైలేజేషన్ లో గుర్తింపు సంఘాలతో చర్చించి శాశ్వత పరిష్కారం కల్పించాలన్నారు.

# గులాబి జెండానే తెలంగాణకు శ్రీరామ రక్ష

### 27న బిఆర్ఎస్ రజతోత్సవ సభ

### ఢిల్లీ పార్టీలు రెండు ఒక్కటే

### ఒక్కటి చెప్పులు మోసే పార్టీ.. మరొకటి సంచులు మోసేది

**కరీంనగర్, ప్రభాతవార్త:** ఢిల్లీ పార్టీలు రెండు ఒక్కటే, అందులో ఒకటి సంచులు మోసే పార్టీ మరొక్కటి చెప్పులు మోసే పార్టీ అని మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సంచలన వాఖ్యలు చేశారు. ఆ రెండు పార్టీల వల్ల తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందన్నారు.. శనివారం కరీంనగర్ లో ఆయన పర్యటించారు. మొదటగా కరీంనగర్ నగరంలోని బొమ్మకల్లో గల చల్మెడ ఆనందరావు ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్య క్రమంలో పాల్గొన్నారు. అనంతరం చింతకుంటలోని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మిట్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. గులాబి జెండనే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో 1200 ఎకరాల విస్తీర్ణంలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.. అందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.. ఈ సభ తర్వాత అనేక కార్యక్రమాలు రాష్ట్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్టీ అద్యక్షుడినీ ఎన్నిక ఉంటుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు కూడా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.. రాష్ట్రంలో ఉన్న అన్ని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో ప్రతి నియోజక వర్గం నుంచి ఎంపిక చేసిన వంద మందికి శిక్షణ ఇస్తామన్నారు..క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సభ్యత్వాల నమోదు కార్యక్రమం డిజిటల్ పద్ధతిలో ఉంటుందన్నారు... విజయవంతంగా 24 సంవత్సరాలు నుంచి కొనసాగుతున్న పార్టీ బిఆర్ఎస్ అని తెలిపారు. ప్రాంతీయ పార్టీకి మంచి గుర్తింపు వచ్చింది..సభ పర్మిషన్ కోసం అప్లై చేశాము, తప్పకుండా పర్మిషన్ వస్తుందన్నారు.60 లక్షల సభ్యత్వాలు కలిగి ఉన్న పార్టీ అని తెలిపారు.లక్షలాదిగా సభకు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరలివస్తారనీ అందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు...

గత బిఆర్ఎస్ పార్టీ పాలనలో హంగామా చేసిన ఢిల్లి పార్టీలు ఇప్పుడు జట్టు కట్టాయా అని ప్రశ్నించారు.. గతంలో ఉన్న దర్యాప్తు సంస్థలు ఏం అయ్యాయి అని అడిగారు..

ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్,మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల ఈశ్వర్,సతీష్ బాబు,పుట్ట మధు, రసమయి బాలకిషన్, రవి శంకర్, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణ రావు, చల్మెడ కళాశాల చైర్మన్ లక్ష్మీ నరసింహారావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,తదితరులు

## ఇంటర్ ఫలితాలలో తిరుమల విద్యాసంస్థల ప్రభంజనం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 12 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాలలోరాజమహేంద్రవరంలోని తమ తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. జూనియర్ ఇంటర్ ఎమ్.పి.సి. విభాగంలో 470కి 467 మార్కులు 5 మంది విద్యార్థులు సాధించారని, 464 పైన 650 మంది, 460 పైన 1903 మంది, 450 పైన 3816 మంది సాధించారని మరియు బై.పి. సి. విభాగంలో 440కి 436 మార్కులు 12 మంది విద్యార్థులు సాధించారని, 430 పైన 221 మంది, 400 పైగా మార్కులు 641 మంది సాధించారని ఆయన తెలియజేశారు. సీనియర్ ఇంటర్ ఎమ్.పి.సి. మరియు బై.పి.సి. విభాగంలో 1000 మార్కులకు గాను 8మందికి 991 మార్కులు, 82 మంది విద్యార్థులకు 989 మార్కులు పైన, 470 మంది విద్యార్థులకు 985 మార్కులు పైన, 2269 మంది విద్యార్థులకు 970 మార్కులు పైన, 3669 మంది విద్యార్థులకు 950 మార్కులు పైన సాధించారని మరియు 99,30 ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు.

## జైలు నుంచి విడుదలైన హెచ్‌సియు విద్యార్థి నవీన్ ఎర్రం

### స్వాగతం పలికిన విద్యార్థులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** కంచ గచ్చిబౌలిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులను అడ్డుకోవడంతో పాటు విద్యార్థులతో కలిసి ఉద్యమించిన కేసులో అరెస్టయిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నవీన్ ఎర్రం శనివారం జైలు నుంచి విడుదలయ్యారు. గత 12 రోజుల పాటు జైలులో ఉన్న నవీన్‌కు ఏప్రిల్ 10వ తేదీన హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో శనివారం ఉదయం నవీన్‌ను విడుదల చేశారు. ఈమేరకు జైలు నుంచి విడుదలైన నవీన్‌కు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు స్వాగతం పలికారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నవీన్‌కు స్వాగతం పలికిన అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి యూనివర్సిటీకి వెళ్లిన విద్యార్థులు సాయంత్రం ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించారు. వర్సిటీ ప్రధాన గేటు ముందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని విద్యార్థులు మొదట ప్రకటించినా, రాత్రి వరకు సమావేశం నిర్వహించలేదు. నవీన్ ఎర్రం విడుదలపై హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు వర్సిటీ భూముల పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని కంచె గచిబౌలి సర్వే నెంబరు 25లో గల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధం కావడం, ఇందులో భాగంగా జెసిబిలతో పనులు చేపట్టిన విషయం తెలిసిందే. కాగా యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం ఆందోళన చేపట్టిన విద్యార్థులు ప్రభుత్వం చేపట్టిన పనులను అడ్డుకున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ చదువుతున్న నవీన్ ఎర్రం సైతం విద్యార్థుల ఆందోళనలో ముందుండి పాల్గొన్నారు. మార్చి 30వ తేదీన టిజిఐఐసి ఆధ్వర్యంలో కంచ గచ్చిబౌలి భూముల్లో చేపడుతున్న పనులను నవీన్ ఆధ్వర్యంలో అడ్డుకోవడంతో పాటు జెసిబి పనులకు అడ్డుతగిలారు.

ఈ విషయమై గచ్చిబౌలి పోలీసులు నవీన్‌తో పాటు పలువురు విద్యార్థుల మీద కేసు నమోదు చేయడంతో ఇద్దరు విద్యార్థులు జైలుకు వెళ్లారు. మిగిలిన విద్యార్థులు విడుదల కాగా, నవీన్ మాత్రం గత 12 రోజులుగా జైలులోనే ఉన్నాడు. కాగా హైకోర్టు నవీన్‌కు బెయిలు మంజూరు చేస్తూ ఏప్రిల్ 10వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ద్రవపత్రాల పరిశీలన అనంతరం శనివారం తెల్లవారు జామున నవీన్ జైలు నుంచి విడుదలయ్యాడు.



వర్సిటీ విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నవీన్ ఎర్రం

నవీన్ విడుదలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం హర్షం వ్యక్తం చేసింది. సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని విద్యార్థులు తెలిపారు.

## ఎపి ఇంటర్ ఫలితాల్లో నారాయణ రికార్డ్!

### జూనియర్ ఎంపిసిలో స్టేట్‌ఫస్ట్ మార్క్ సాధించింది ఒక్కరే



**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఇంటర్-2025 ఫలితాల్లో నారాయణ రికార్డుల మోత మోగించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అన్ని గ్రూపుల్లో స్టేట్ టాప్ మార్కులతో అదరగొట్టింది. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకి గాను స్టేట్ ఫస్ట్ మార్క్ 468తో ఒకరు, 467 మార్కులు పైన 8 మంది, 466 మార్కుల పైన 55 మంది సాధించగా 465 మార్కులు ఆపైన 293 మంది, 460 మార్కులు ఆపైన 2761 మందితో ఏ ఇతర విద్యాసంస్థ సాధించలేని అత్యున్నత ఫలితాలు నారాయణ సొంతం చేసుకుంది. అలాగే జూనియర్ బైపిసి విభాగంలో 440 మార్కులకుగాను నలుగురు విద్యార్థులు 436 మార్కులు, 27 మంది 435 మార్కులు సాధించారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను ముగ్గురు విద్యార్థులు 992 మార్కులు, 39 మంది 990 మార్కులు, 93 మంది 989 మార్కులు, 181 మంది 988 మార్కులు, 278 మంది 987 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో టాప్ మార్కు 992 కాగా అన్ని విభాగంలో అత్యధిక మార్కులలో 22 ఫలితాలు నారాయణ విద్యార్థులే సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి సింధూరనారాయణ, పి శరణి నారాయణ పేర్కొన్నారు. ఏ విధంగా చూసినా ఆంధ్రప్రదేశ్‌లో నారాయణ తప్ప మరి ఏ ఇతర విద్యాసంస్థ ఇటువంటి ఫలితాలు సాధించలేదని వారు పేర్కొన్నారు.

## వైకాంగ్రెస్ పార్టీ రాజకీయ సలహాకమిటీ ఏర్పాటు

### - మొత్తం 33 మంది సలహా కమిటీ సభ్యులుగా ఉంటారు

**విజయవాడ,ఏప్రిల్12,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీకి రాజకీయ సలహామండలి(పొలిటికల్ అడ్వైజరీ కమిటీ)ని పూర్తి స్థాయిలో పునర్వ్యవస్థీకరించింది.పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పీఏసీ కన్వీనరుగా వ్యవమరిస్తారు.పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు.పార్టీ దిగువ పేర్కొన్న నాయకులను పీఏసీ మెంబర్లుగా నియమించడారు.ఆ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఉత్తర్వులు జారీ చేసారు.తమ్మినేని సీతారామ్,పీడిక రాజన్నదొర, బెల్లాన చంద్రశేఖర్, గొల్లబాబురావు.ఎంపీ, బూడి ముత్యాలనాయుడు, పిల్లి చంద్రబోస్ ఎంపీ, పినిపే విశ్వరూప్,తోట త్రిమూర్తు ,ఎమ్మెల్సీ, ముద్రగడ పద్మనాభం, పుష్పాల శ్రీనివాసరావు(వాసుబాబు), చెరుకువాడ రంగనాధరాజు.కొడాలి వెంకటేశ్వరరావు(నాని),వెల్లంపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

## రాష్ట్ర కాంగ్రెస్‌కు చివరి సిఎం రేవంత్‌రెడ్డియే

### తెలంగాణలో ప్రజాదరణ కోల్పోయిన సర్కారు

### చేసింది చెప్పేందుకే గావ్ చలో.. బస్తీ చలో : మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** పదేళ్లుగా కేంద్రం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించేందుకు గావ్ చలో..బస్తీ చలో..అనే కార్యక్రమం చేపట్టామని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 16,31,32వ వార్డులో శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు భైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో పథకాలు అమలుచేస్తూ తామే చేస్తున్నట్లు రాష్ట్ర సర్కారు గొప్పలు చెప్పుకుంటుందన్నారు.పేదలకు అందించే రేషన్ బియ్యం, గ్యాస్‌సబ్సిడి, మం దులు ఇలా ప్రతి దాంట్లో కేంద్ర ప్రభుత్వ వాట ఉందన్నారు. దేశాన్ని ప్రపంచానికే ఆదర్శంగా నిలుపడానికి కృషిచేస్తున్న ప్రధాని మోడీకి అండగా నిలువాలన్నారు. రాష్ట్రంలో బిజెపికి 8 మంది ఎంపిలు, 8మంది ఎమ్మెల్యేలే, మరో ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు ప్రజాదరణ పూర్తి కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌కు చిట్టచివరి సిఎం రేవంత్‌రెడ్డియేనని తెలిపారు.




హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

## మల్లికార్జునస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నంద

**కొమురవెల్లి, ఏప్రిల్ 12,ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని హై కోర్టు న్యాయమూర్తి సురేపల్లి నంద శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి శేష వస్త్రంలో ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షులు శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవార్డులను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

## విద్యతో ఏదైనా సాధించవచ్చు

### కళాశాల స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**చౌటుప్పల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించినట్లైతే ఎంతటి అసాధ్యానైనా సుసాధ్యం చేసి సాధించవచ్చని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్టుదేవ్ వర్మ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని అశోకా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం స్నాతకోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీజీడీఎం విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఎ.హైందవి(2022), ఎస్.శివానీ(2023), పి.హైమావతి (2024), రికితా నితిస్కులకర్ణి(2024)లు ఎఐడిఎస్ విభాగాల్లో బంగారు పతకాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. లీడర్ అనే పదంతో అబ్యాసం, నీతి, అనుకూలత, దృఢ సంకల్పం, సహానుభూతి, బాధ్యత అనే బావజాలంతో సుందర్ పిచ్చై, ఇంద్రానూయి, నారాయణమూర్తి లాంటి నాయకులను ఈ సందర్భంగా ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల కృషి, గురువుల మద్దతు, కుటుంబ సభ్యుల ప్రేమతో కలిసి సాధించిన విజయమని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యలో నేర్చుకున్న నైపుణ్యం భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు తమ మేధస్సు పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అశోక్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎపి ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్కులు



**హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** శనివారం విడుదలైన ఇంటర్మీడి యేట్-2025 ఫలితాల్లో.... జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 467 మార్కులతో ఇద్దరికి స్టేట్ టాప్ మార్క్, బైపిసిలో 437 మార్కులతో స్టేట్ ఫస్ట్ మార్క్, సీనియర్ ఇంటర్ ఎంపిసిలో 992 మార్కులతో ముగ్గురికి స్టేట్ ఫస్ట్ మార్క్, బైపిసిలో 992 మార్కులతో స్టేట్ టాప్ మార్క్ శ్రీచైతన్య విద్యార్థులే. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 470 మార్కులకుగాను బుక్కె యశ్వంత్ నాయక్ 467 స్టేట్ టాప్ మార్క్, ముద్రు వినుత్న 467 స్టేట్ టాప్ మార్కుతో పాటు 466 మార్కులకు గాను చల్లా లేఖన 437 స్టేట్ ఫస్ట్ మార్కుతోపాటు 436 మార్కులు ఆపైన 16 మంది, 435 ఆపైన 109 మంది, 430 ఆపైన 834 మంది, శ్రీచైతన్య విద్యార్థులే. సినియర్ ఇంటర్‌లో 1000 మార్కులకుగానూ ఎంపిసిలో కంచన మానస, గంగవరం లహరి, కురందాసు శ్రీజ 992 మార్కులతో ముగ్గరికి స్టేట్ ఫస్ట్ మార్క్ సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో షేక్ తబస్సుమ్ 992 మార్కులతో స్టేట్ టాప్ మార్క్ సాధించింది. సీనియర్ ఇంటర్‌లో 992 మార్కులు ఆపైన నలుగురు, 991 మార్కులు ఆపైన 17 మంది, 990 మార్కులు ఆపైన 45 మంది, 985 మార్కులు ఆపైన 625 మంది, 980 మార్కులు ఆపైన 1800 మంది, సీనియర్ ఇంటర్‌లో 900 మార్కులు ఆపైన 24331 మంది శ్రీచైతన్య విద్యార్థులు సాధించారు.

ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ మాట్లాడుతూ.. శ్రీచైతన్య సృష్టించిన పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి ఆధ్యాపకుల శిక్షణతో, ఇంటర్మీడియేట్‌లో సబ్జెక్ట్స్‌పై మా విద్యార్థులకు కాన్సెప్ట్‌వలా పట్టు సాధించడంతో రేపు రాబోయే జేఇఇ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్‌లలో అత్యధిక ర్యాంకులు మా విద్యార్థులు సాధిస్తారనే నమ్మకం ఏర్పడిందని అన్నారు. రాబోయే రిజల్ట్స్ అన్నీ శ్రీచైతన్యవే అనే నమ్మకం మాకుందని అన్నారు. అదేవిధంగా 2023వ సంవత్సరం ఐఐటి-జేఇఇ, నీట్ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో నంబర్ వన్ హ్యాట్రిక్ ర్యాంకులతో శ్రీచైతన్య రికార్డ్ బ్రేక్ చేసి తమ సత్తా చాటుకున్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, మా విద్యాసంస్థపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులను, దోహదపడిన ఆధ్యాపక. అధ్యాపకేతర బృందాన్ని, శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ బొప్పన అభినందించారు.



శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో ప్రతిభావంతులకు ఉగాది అవార్డులు ప్రదానం చేస్తున్న మండలి బుద్ధప్రసాద్

## దేశ సేవలో త్యాగాలు చేసిన తెలుగువారికి తగిన గుర్తింపు రాలేదు

### ఎపి శాసనసభ సభ్యుడు మండలి బుద్ధప్రసాద్

### వేడుకగా 53 మంది ప్రతిభావంతులకు ఉగాది అవార్డులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** దేశ సేవలో త్యాగాలు చేసిన తెలుగువారికి తగిన గుర్తింపు రాలేదని ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. వంశీ ఇంటర్నేషనల్ నిర్వహణలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై భిన్న రంగాలకు చెందిన పన్నెండు దేశాలనుంచి హాజరైన భిన్న రంగాలకు చెందిన ప్రతిభావంతులకు ఉగాది అవార్డ్స్ ప్రదానోత్సవం గొప్ప వేడుక గా నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ రామరాజు నిర్వహణలో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ సభ్యుడు మండలి బుధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారు తమ వారి గొప్పతనం గుర్తించరు అన్నారు స్వాతంత్ర్య ఉద్యమంలో త్యాగాలు చేసిన వారు ఎక్కువగా తెలుగువారే నని చెప్పారు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యను స్మరించుకునే వారే నేడు లేరని అవేదన వ్యక్తం చేశారు వంశీ సంస్థ విదేశాలలో వున్న మహోన్నతులు ఇన వివిధ రంగాల ప్రముఖులు ఏభై మూడు మందినీ సత్కరించి తెలుగుజాతి ప్రతిష్ఠ చాటారుని పేర్కొన్నారు. విఖ్యాత వైద్యుడు డాక్టర్ కాకర్ల సుబ్బారావు పేరిట కిమ్స్ డైరెక్టర్ బొల్లినేని కృష్ణయ్య ఏర్పరచిన అవార్డు ను ప్రఖ్యాత న్యూరోలజిస్ట్ డాక్టర్ మోహన్ దాసు కు పింగళి వెంకయ్య అవార్డు ను పూర్వ ప్రధాని పి. వి సోదరుడు మనోహర రావు కు, నటుడు చంద్ర మోహన్ అవార్డు ను నటి కవిత తో పాటు ఇతర దేశాల తెలుగు ప్రముఖులకు బహుకరించారు. డాక్టర్ మోహన్ దాస్ తమ స్పందన తెలుపుతూ నిమ్స్ అభివృద్ధిలో కాకర్ల సుబ్బారావు విజన్ మరువలేమన్నారు.వైద్య రంగం లో అయన చేసిన కృషి విశేషం అని కొని యడారు అయన తనకు గురువు మార్గదర్శి అని అయన పేరిట అవార్డ్ అందుకోవటం గర్వంగావుందన్నారు. వేదికపై తెలుగువిశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు, దర్శకుడు రేలంగి నరసింహారావు. బొల్లినేని కృష్ణయ్య తదితరులు పాల్గొనగా వంశీరామరాజు కార్యక్రమం నిర్వహించారు.

# గుంట భూమి కబ్జాచేసినా గులాంగిరి చేస్తా.. లేకపోతే నువ్వుచేస్తావా!?



శనివారం జనగామలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

### పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఎమ్మెల్యే కడియం సవాల్

### అనుచిత పోస్టులు పెట్టేవారిని ఎవరినీ వదలను

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** పదేపదే పార్టీ ఫిరాయింపులు, భూముల కబ్జాల విషయమై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిస్తున్నాడని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎన్‌ఎంఆర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపణలు, విమర్శలను ఈసందర్భంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పదే పదే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని అంటున్నాడని, ప్రస్తుతం పార్టీ ఫిరాయింపుల విషయం కోర్టులో ఉందని, సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 36మంది ఎమ్మెల్యేలు పార్టీ మారి బీఆర్ఎస్‌లో చేరారని ఈవిషయం పల్లాకు తెలియదా అని ప్రశ్నించారు. వేరేపార్టీలో గెలుచిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కట్టబెట్టింది నిజం కాదా అన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అన్నారు. మీకు ఒకచట్టం వేరేవారికి మరొక చట్టమా, పార్టీ ఫిరాంపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి అసలు లేనేలేదన్నారు. కాగా, డాక్టర్ కడియం కావ్యకు బీ-ఫామ్ ఇచ్చి ఎన్నికల ఖర్చుకు నిధులు ఇచ్చామని అంటున్నారని, ఇది నిజమని నిరుపిస్తే తమ పదవులకు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నిరూపించలేకపోతే నువ్వు రాజీనామా చేస్తావా అని సవాల్‌చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనిమిదివందల కోట్లు కాదు కదా ఎనిమిది పైసలు కూడా తేలేదు అంటున్నారని, మళ్లీ మరుసటి రోజే ఇవన్నీ మేము గతంలోనే తేవాలని అనుకున్నాం కానీ కడియం శ్రీహరే అడ్డుకున్నాడని అంటున్నారని ఇంతకన్నా సిగ్గుచేటు మాటలు ఇంకా ఏమైనా ఉంటాయా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎనిమిదివందలకోట్ల అభివృద్ధి పనుల వివరాలను మీడియా ముందు ఉంచానని, ఆ పనులకు సంబంధించిన జీవోలు అవి ఎప్పుడు వచ్చాయో తేదీలతో సహా ముందున్నాయన్నారు. దేవునూరు అటవీశాఖ నోటిఫికేషన్‌లో లేని పట్టా భూములను రైతులకు చెందాలని కలెక్టర్‌ను కోరానని తెలిపారు. దీంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, కడియం శ్రీహరి అతడి కుటుంబ సభ్యులు దేవునూరు గుట్టలలో రెండువేల ఎకరాలను ఆక్రమించుకున్నాడని, మరొకరోజు బినామీ పేర్లతో యాభై ఎకరాలు పట్టా చేయించుకున్నాడని ఆరోపణలు చేయడం వారి సిగ్గుచేటు తనానికి నిదర్శనం అన్నారు. దీంతో దేవునూరు ఆటవీ భూములలో ఒక గుంట భూమి కబ్జాచేసినా..“ నా రాజకీయ జీవితంలో ఒక ఎకరం బినామీ పేరుతో పట్టా చేయించినట్లు నిరూపిస్తే నీ ఇంట్లో గులాం గిరి చేస్తా..” లేకపోతే నువ్వు నా ఇంట్లో గులాం గిరి చేయాలి” అంటూ సవాల్ చేశారు. ఈ సవాల్‌పై ఇంతవరకు కూడా స్పందించలేదని, తెలంగాణ చీము నెత్తురు ఉంటే నా సవాల్‌ను స్వీకరించాలని కడియం అన్నారు. అదీగాక బొచ్చు కుక్కను కాదు కాపలా కుక్కను అంటున్న పల్లా.. ఏదైనా కుక్క కుక్కే కదా అని విమర్శించారు. ఇప్పుడు ఈ బొచ్చు కుక్క కొన్ని పిచ్చికుక్కలను తయారు చేశాడని, ఆ పిచ్చికుక్కలతో సోషల్ మీడియాలో దుర్మార్గమైన పోస్టులు పెట్టిస్తున్నాడన్నారు. నా తల్లిపై పోస్టులు పెడుతున్నారని, మీకు తల్లి ఉంది కదా కన్నతల్లిపై కనీసం గౌరవం ఉండాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనపై అనుచిత పోస్టులు పెట్టేవారిని ఎవరినీ కూడా వదిలిపెట్టనన్నారు. నేను ఒక్క రూపాయి కాంట్రాక్టు కేసీఆర్ వద్ద తీసుకున్నట్లు నిరూపించాలని, పల్లా నువ్వు అధికారాన్ని అడ్డంపెట్టుకొని అడ్డగోలుగా సంపాదించుకున్నావని, దమ్ముంటే అభివృద్ధిలో పోటీపడుదామని, నా ఎజెండా అంతా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తానని, ప్రజల ప్రేమనే నా ఆస్తి.. నేను నీలాగా హైదరాబాద్‌లో ఉంటూ గెస్ట్ లాగా వచ్చిపోను అని, ఇప్పటికైనా నిరూపించలేకపోతే నువ్వు ఒక వెధవని నిన్ను వదిలేస్తానని కడియం దుయ్యబట్టారు. సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన భారత్ పోరు

## బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ధ్రువ్-తనీషా జోడీ పరాజయం




**న్యూఢిల్లీ:** ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జంట పరాజయం పాలవడంతో భారత్ ప్రయాణానికి తెరపడింది. దీంతో భారత టైటిల్ ఆశలు మోస్తున్న ఈ మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం పోరాటం క్వార్టర్స్‌లోనే పతకం లేకుండానే భారత షట్లర్లు ఇంటిదారిపట్టారు. చైనాలో జరిగిన క్వార్టర్స్ పోరులో కపిల క్రాస్టో జోడీ 20-22, 13-21తో ఐదో సీడ్, హాంకాంగ్‌కు చెందిన టాంగ్ చున్ మన్-సె యింగ్ సుయెట్ ద్వయం చేతిలో పరాజయం పాలైంది. తొలి గేమ్‌లో పోరాడి ఓడిన భారత జంట, రెండో గేమ్‌లో చేతులెత్తేసి ప్రత్యర్థులకు పోటీ కూడా ఇవ్వలేక మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఇక పీవీ సింధు, లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ వంటి స్టార్ ప్లేయర్లు ఓటమి పాలై ఇప్పటికే ఇంటిదారిపట్టారు. ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ తరపున 2023లో చివరిసారిగా రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మెన్స్ డబుల్స్ టైటిల్ కైవసం చేసుకుంది. కాగా, ఈ టోర్నీ చరిత్రలో భారత్ రెండు స్వర్ణాలు సహా 16 కాంస్య పతకాలతో మొత్తం 18 మెడల్స్ సాధించింది.

# దుమ్మురేపిన అల్కరాజ్

## మాంటే కార్లో మాస్టర్స్ సెమీస్ బెర్తు ఖరారు




**న్యూఢిల్లీ:** మాంటే కార్లో మాస్టర్స్ 1000 టోర్నమెంట్‌లో కార్లోస్ అల్కరాజ్ దుమ్మురేపుతున్నాడు. టాప్ గేర్‌లో ఆడుతున్న ఈ యువకెరటం అలవోకగా పురుషుల సింగిల్స్ సెమీస్ ఫైనల్లో అడుగుపెట్టాడు. మొనాకో వేదికగా క్లే కోర్టులో జరిగిన క్వార్టర్స్‌లో అల్కరాజ్ ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ ఫిల్స్‌ను చిత్తుగా ఓడించాడు. తొలి సెట్ కోల్పోయినా ఆ తర్వాత పుంజుకొన్న ఈ టాప్ సీడ్ ప్లేయర్ 46, 75, 63తో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. ఆరంభంలో వెనకబడినా.. ఆత్మవిశ్వాంసతో ఆడి మ్యాచ్ సొంతం చేసుకోవడం గర్వంగా ఉందని చెప్పాడీ స్పెయిన్ కుర్రాడు. సెమీస్‌లో తమ దేశానికే చెందిన అతడు అలెజండ్రో దేవిడొవిచ్‌తో తలపడనున్నాడు. 'నేను ఆత్మవిశ్వాసంతో ఉండాలని అనుకున్నా. ప్రత్యర్థి దూకుడుగా ఆడుతుండగా నా వంతు కోసం వేచి చూశాను. ఫిల్స్ కొన్ని తప్పిదాలు చేయడం నాకు కలిసొచ్చింది. వాటిని నేను వీలైనన్ని పాయింట్లుగా మలచుకోవాలనున్నాను. సెకండ్ సెట్‌లో బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నా. మూడో సెట్‌లోనూన అదే జోరు కొనసాగించి సెమీస్ బెర్తు ఖాయం చేసుకున్నాను' అని మ్యాచ్ అనంతరం కార్లోస్ తెలిపాడు.

### మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్‌లో..

# అదరగొట్టిన వెస్టిండీస్

## ఐర్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపు




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో వెస్టిండీస్ తొలి విజయం నమోదు చేసింది. లాహోర్‌లో జరిగిన ఈ పోరులో విండీస్ 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. మొదటి మ్యాచ్‌లో స్కాట్లాండ్ చేతిలో ఓడిన వెస్టిండీస్ రెండో మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై గెలుపు సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 33 ఓవర్లకు కుదించగా, మొదట బ్యాటింగ్ చేసిన కరీబియన్ జట్టు 6 వికెట్లు నష్టానికి 181 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ హేలీ మాథ్యూస్ 18 బంతుల్లో 23 పరుగులు, 5 ఫోర్లు చేసి జట్టుకు మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, చినెల్లి హెన్రీ 36 బంతుల్లో 46 పరుగులు, 2 ఫోర్లు ఒక సిక్స్, స్టెఫానీ టేలర్ 56 బంతుల్లో 46 పరుగులు, 5 ఫోర్లు, జైదా జేమ్స్ 36 పరుగులతో రాణించారు. ఐర్లాండ్ బౌలర్లఓ జేన్ మాగుర్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ 32.2 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ అమీ హంటర్ 46బంతుల్లో 48 పరుగులు, 8 ఫోర్లుతో ధాటిగా ఆడగా, మిగిలిన వాళ్లు పెద్దగా రన్స్ చేయలేకపోయారు. గత మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో వీరోచిత శతకంతో పాటు, బౌలింగ్‌లో 4 వికెట్లుతో విజృంభించినా జట్టును గెలిపించుకోలేకపోయిన హేలీ మాథ్యూస్, తాజా పోరులోనూ 4 వికెట్లతో సత్తా చాటింది. ఇతర విండీస్ బౌలర్లలో ఆలియా, కరిష్మా చెరో 2 వికెట్లు తీశారు. తదుపరి మ్యాచ్‌లో వెస్టిండీస్ ఈ నెల 14న ఆతిధ్య పాకిస్థాన్‌తో పోటీ తలపడనుంది.



### ప్రపంచకప్ ఆర్చరీలో..

### జ్యోతి-రిషబ్ జోడీ

# ఫైనల్‌కు..

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్1లో భారత ఆర్చర్లు సత్తా చాటుతున్నారు. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన మహిళల కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో వెన్నం జ్యోతి సురేఖ, రిషభ్ యాదవ్ జోడీ 159-155తో ఎల్లిసన్, జెవ్నిక్ (స్లోవేనియా)ను ఓడించి ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో స్పెయిన్‌ను క్వార్టర్స్‌లో డెన్మార్క్‌ను చిత్తుచేసి ఫైనల్ చేరిన భారత జట్టు, టైటిల్ పోరులో చైనీస్ తైపీతో తలపడనుంది. కానీ రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ క్వార్టర్స్‌లో అన్షిక ధీరజ్ ద్వయం 26తో ఎలియాపాబ్లో (స్పెయిన్) చేతిలో ఓడింది. ఇక పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో బొమ్మదేవర ధీరజ్‌తో కూడిన భారత్ జట్టు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ సెమీ ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్‌లతో కూడిన భారత్ జట్టు 6-2 (54-54, 55-54,56-56, 56-53) సెట్ పాయింట్ల తేడాతే పాబ్లో అచా, ఆండ్రెస్ టెమినో, జేవియర్ మెరీడాలతో కూడిన స్పెయిన్ జట్టును ఓడించింది. ఈ నెల 13న జరిగే ఫైనల్లో చైనా జట్టుతో భారత్ తలపడనుంది.

### టీమిండియాలో ప్లేస్ కోసం..

# అన్‌క్యాప్ట్ ప్లేయర్ల బిగ్‌ఫైట్




## ఖర్చీఫ్ వేసిన ఐదుగురు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 ప్రస్తుతం ఉత్కంఠగా సాగుతోంది. ఇప్పటి వరకు 27 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. కొన్ని జట్లు ప్లే ఆఫ్స్ కోసం తమ సత్తా చాటుతున్నాయి. మరికొన్ని జట్లు చెత్త ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో చివర్లో నిలిచాయి. ఈ ఐపీఎల్‌లో కొంతమంది యువ ఆటగాళ్లు అద్భుతమైన ఆటతో సత్తా చాటుతున్నారు. మరోపక్క ఈ ఐపీఎల్ తర్వాత, టీం ఇండియా ఇంగ్లాండ్ పర్యటనలో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. అదే సమయంలో, సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీ20 టీం ఇండియా దృష్టి 2026లో జరగనున్న టీ20 ప్రపంచ కప్‌పై ఉండనుంది. దీని కోసం సెలెక్టర్లు చాలా మంది ఆటగాళ్లకు అవకాశం ఇచ్చే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుత ఐపీఎల్‌లో ఆడుతున్న పలువురు ప్లేయర్లు భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చేందుకు పోటీపడుతున్నారు. ఈ లిస్టులో టాప్ 5 ప్లేయర్ల మధ్య పోటీ నెలకొంది. ఈ జాబితాలో కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడే ఫాస్ట్ బౌలర్ వైభవ్ అరోరా పేరు కూడా ఉంది. వైభవ్ ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు పడగొట్టగా, గత సీజన్‌లో అతను 10 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో అరోరా పేరు కూడా ముందుంది. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడే విప్రజ్ నిగమ్ తన బౌలింగ్, బ్యాటింగ్‌తో అందరి హృదయాలను గెలుచుకున్నాడు. తన ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లోనే విప్రజ్ లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 39 పరుగుల ఇన్నింగ్స్‌తో విజయం సాధించాడు. ఒక వికెట్ కూడా తీసుకున్నాడు.

ఆ తర్వాత మూడవ మ్యాచ్‌లో కూడా అతను రెండు వికెట్లు పడగొట్టాడు. లెగ్ బ్రేక్ బౌలర్ మాత్రమే కాదండోయ్. తుఫాన్ బ్యాటింగ్ చేసే సత్తా విప్రరాజ్‌కు ఉంది. దీంతో భవిష్యత్తులో టీం ఇండియాలో కూడా స్థానం సంపాదించుకోవడంపై దృష్టిసారించాడు. ఇక ముంబై ఇండియన్స్ తరపున తన ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లో ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అశ్విని కుమార్ నాలుగు వికెట్లు పడగొట్టి అద్భుతాలు చేశాడు.

అశ్విని ఇప్పటివరకు రెండు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు పడగొట్టాడు. అతను కూడా ఈ సీజన్‌లో సందడి చేయడం ద్వారా టీమ్ ఇండియాలో తనదైన ముద్ర వేయగలడు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు నుంచి ఆడుతున్న మిస్టరీ స్పిన్నర్ దిగ్వేష్ రాఠి తన బౌలింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. దిగ్వి ఐదు మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు పడగొట్టాడు. అతని ఎకానమీ రేటు కూడా ఎనిమిది కంటే తక్కువగా ఉంది. ఇక టీమ్ ఇండియాలో చోటు సంపాదించడానికి, పంజాబ్ కింగ్స్ తరపున ఆడే తుఫాను ఓపెనర్ ప్రియాంష్ ఆర్య పేరు కూడా చర్చలోకి వచ్చింది. చెన్నైపై ప్రియాంష్ 39 బంతుల్లో సెంచరీ సాధించాడు. 42 బంతుల్లో ఏడు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో 103 పరుగులు చేశాడు. దీనివల్ల ఈ ఆటగాడిని భవిష్యత్తులో టీం ఇండియాలో ప్లేస్ కోసం పోటీపడుతున్నాడు.

# భారీగా పెరిగిన ఇళ్ల సేల్స్

**ముంబై, ఏప్రిల్ 12:** గతంలో ఇల్లు కొనాలంటే బడ్జెట్‌ను ప్రధానంగా పరిగణలోకి తీసుకునే వారు. కానీ ఇప్పుడు ఎంత ఖరీదైన ఇళ్లయితే అంత గొప్ప. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగానే డెవలపర్లు కూడా ప్రీమియం, అల్ట్రా లగ్జరీ గృహాలను నిర్మిస్తున్నారు. ఏటేటా అందుబాటు గృహాల విక్రయాలు తగ్గుతే, అల్ట్రా లగ్జరీ ఇళ్ల అమ్మకాలు పెరుగుతుండడమే ఇందుకు ఉదాహరణ. ఏటేటా రూ.50 లక్షలలోపు ధర ఉండే అఫర్డబుల్ గృహాల విక్రయాలు తగ్గుతున్నాయి. వీటి స్థానంలో రూ.50 కోట్ల కంటే ఎక్కువ ధర ఉండే అల్ట్రా లగ్జరీ యూనిట్ల అమ్మకాలు శరవేగంగా పెరుగుతున్నాయి. 2025 జనవరి-మార్చి తొలి త్రైమాసికంలో అమ్ముడైన ఇళ్లలో అందుబాటు గృహాలు 21,010గా ఉన్నాయి కానీ, గతేడాది తొలి త్రైమాసికంతో పోలిస్తే ఈ విభాగంలో సేల్స్ 9శాతం మేర తగ్గాయి. అదే 2025 మొదటి త్రైమాసికంలో 169 అల్ట్రా లగ్జరీ యూనిట్లు అమ్ముడుపోగా, గతేడాది గతేడాది మొదటి త్రైమాసికంతో పోలిస్తే ఏకంగా 483 శాతం వృద్ధి నమోదైంది. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉండే ఇళ్లు 26,832 సేల్ కాగా, 2024 తొలి త్రైమాసికంతో పోలిస్తే 6శాతం తక్కువ. ఇక రూ.కోటి నుంచి రూ.2 కోట్ల ధర ఉండే యూనిట్లు 2శాతం వృద్ధిరేటుతో 22,230 అమ్ముడు పోయాయి. రూ.2-5 కోట్ల ధర ఉండే ఇళ్లు 28శాతం వృద్ధితో 13,735 సేల్ అయ్యాయి. అలాగే రూ.5-10 కోట్లు ధర ఉండే గృహాలు 82శాతం పెరుగుదలతో 3,448 సేల్ అయ్యాయి.



రూ.10-20 కోట్లు ఖరీదు చేసే యూనిట్లు 114 శాతం వృద్ధి రేటుతో 658 అమ్ముడయ్యాయి. అలాగే రూ.20-50 కోట్ల ధర ఉండే ప్రీమియం ఇళ్లు 124 శాతం వృద్ధితో 92 యూనిట్లు అమ్ముడు పోయాయి.

# 'జిఎం' నుంచి 200 మందికి ఉద్వాసన

**వాషింగ్టన్, ఏప్రిల్ 12:** ఈ సంవత్సరంలో కూడా ఉద్యోగులను బయటకు పంపడం సర్వసాధారణం అయిపోయింది. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలు కూడా లెక్కలకు మించిన ఉద్యోగులను తొలగిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి అమెరికన్ ఆటోమొబైల్ కంపెనీ జనరల్ మోటార్స్ (జిఎం) చేరింది. జనరల్ మోటార్స్ కంపెనీ ఆల్ ఎలక్ట్రిక్ ఫ్యాక్టరీ జీరో ప్లాంట్ నుంచి 200 మంది ఉద్యోగులను తాత్కాలి కంగా తొలగిస్తున్నట్లు ప్రకటించింది. అయితే వీరిని మళ్లీ ఎప్పుడు ఉద్యోగాల్లోకి తీసుకుంటారు అనే విషయాన్ని సంస్థ వెల్లడించలేదు. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తి సర్దుబాటులో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఉద్యోగుల తొలగింపుకు, టారిఫ్‌ల ప్రభావం కాదని సంస్థ స్పష్టం చేసింది. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం, ఫ్యాక్టరీ జీరోలో దాదాపు 4,500 మంది ఉద్యోగులు ఉన్నాయి. ఈ యూనిట్‌లో సంస్థ హై ప్రొఫైల్ ఎలక్ట్రిక్ వాహనాల మోడళ్లను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో చేవ్రొలెట్ సిల్వరాడో, జీఎంసి సియెర్రా ఎలక్ట్రిక్ వాహనాలు, హమ్మర్ ఎలక్ట్రిక్ వాహనాలు పికప్ వంటి వాటితో పాటురాబోయేకాడిలాక్ ఎస్కలేడ్ఐక్యూ ఉన్నాయి.




# ఎలక్ట్రిక్ స్కూటర్ ఏథర్‌లో సాంకేతిక లోపాలు..

**ముంబై, ఏప్రిల్ 12:** ఏథర్ ఎనర్జీ ఈవీ కంపెనీ కొత్తగా ప్రారంభించిన ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్ ఏథర్ రిజ్టా. ఈ స్కూటర్ విలక్షణమైన డిజైన్ పట్టణ వినియోగదారులను ఆకర్షించడంతో అమ్మకాల్లో సంచలనం సృష్టించింది. అయితే ఈ స్కూటర్‌ను వాడిన వినియోగదారులు పనితీరు, నిర్మాణ నాణ్యతకు సంబంధించిన అనేక లోపాలను వెల్లడిస్తున్నారు. ఈ స్కూటర్ నిజంగా బ్రాండ్ నిర్దేశించిన అంచనాలను అందుకుంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ స్కూటర్ 2.9 కేడబ్ల్యూహెచ్ వేరియంట్ ఓసారి ఛార్జ్ చేస్తే దాదాపు 90కి.మీ మైలేజ్ అందిస్తుందని ఏథర్ చెబుతున్నప్పటికీ చాలా మంది వినియోగదారులు రోజువారీ వినియోగంలో 60కి.మీ.లు మాత్రమే పొందుతున్నట్లు నివేదిస్తున్నారు.



అలాగే ఈ స్కూటర్‌లో ప్రధాన సమస్య బెల్ట్ డ్రైవ్ శబ్దం. దాదాపు నిశ్శబ్దంగా పనిచేసే ఇతర ఎలక్ట్రిక్ స్కూటర్ల మాదిరిగా కాకుండా రిజ్టాకు సంబంధించిన బెల్ట్ డ్రివెన్ మెకానిజం ముఖ్యంగా అధిక వేగంతో గుర్తించదగిన హమ్‌ను విడుదల చేస్తుంది. అలాగే ఏథర్ రిజ్టా స్కూటర్ రైడ్ కంఫర్ట్, సస్పెన్షన్‌విమర్శలను కూడా ఎదుర్కొంటుంది. రిజ్టా సాఫీగా ఉన్న రోడ్లపై తగినంతగా పని చేస్తుండగా, గుంతలు, స్పీడ్ బ్రేకర్ల సస్పెన్షన్ ఇబ్బంది పడుతుందని రైడర్లు చెబుతున్నారు. డిజైన్ పరంగా ఈ స్కూటర్ హెడ్‌లైట్ పొజిషనింగ్‌పై ప్రతికూల అభిప్రాయాన్ని తెలుపుతున్నారు. హెడ్‌ల్యాంప్ హ్యాండిల్‌బార్‌పై కాకుండా బాడీపై అమర్చబడినందున రాత్రి సమయంలో మలుపుల సమయంలో రైడర్లకు అసౌకర్యంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అదనపు ఫిర్యాదుల కోసం హ్యాండిల్ బార్ దృఢత్వం, ఎర్గోనామిక్స్ ఉన్నాయి. కొంతమంది వినియోగదారులు పొడిగించిన రైడ్‌ల సమయంలో భుజం అసౌకర్యాన్ని నివేదిస్తున్నారు. కొంతమంది రైడర్లు డాష్‌బోర్డ్ స్క్రీన్ ఫ్రీజింగ్ లేదా రైడ్ మధ్యలో పునఃప్రారంభించడం వంటి సాఫ్ట్‌వేర్ లోపాలను కూడా ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు ఉన్నప్పటికీ ఏథర్ రిజ్టాను స్మార్ట్ ఫీచర్లు, విశాలమైన సీటింగ్‌తో నిండిన కుటుంబస్నేహపూర్వక 'ఇవి'గా మార్కెట్ చేస్తూనే ఉంది. అయితే ఈ నివేదికలు సత్వర అప్‌డేట్‌లు ఇస్తే అమ్మకాల్లో రికార్డు సృష్టిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ల ఆదాయాలు భేష్

**ముంబై, ఏప్రిల్ 12:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమానాశ్రయాల ఆపరేటర్ల ఆదాయాలు 18-20 శాతం మేర వృద్ధి చెందనున్నాయి. ప్యాసింజర్ల ట్రాఫిక్ పెరుగుతుండడం, టారిఫ్‌ల పెంపుతో పాటు ఏరోనాటికల్‌యేతర ఆదాయాలు మెరుగుపడుతుండడం తదితర అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీనిప్రకారం, గత ఆర్థిక సంవత్సరం నమోదైన 10శాతం వృద్ధిని బట్టి చూస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్యాసింజర్ల ట్రాఫిక్ సుమారు 7-9 శాతం పెరిగి 44కోట్లకు చేరనుంది. గత ఆర్థిక సంవత్సరం ఈ సంఖ్య 41.2-41.5 కోట్ల స్థాయిలో నమోదైంది. ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) నిర్వహణలో ఉన్నవి, అలాగే పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) మోడల్ కింద నిర్వహించే ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు సహా వివిధ విమానాశ్రయాల శాంపిల్ సెట్ ఆధారంగా ఇంక్రా ఈ నివేదికను రూపొందించింది. కొత్తగా భోగాపురం, పరందూర్, నవీ ముంబై, జేవర్ వంటి విమానాశ్రయాలు వస్తుండడంతో రాబోయే 4-5 యేళ్లలో రూ.లక్ష కోట్ల పైచిలుకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. కొత్త ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపడడం, అంతర్జాతీయంగా టూరిజం పుంజుకోవడం లాంటి అంశాల దన్నుతో దేశీయ రూట్లలో ప్రయాణించే ప్యాసింజర్ల రద్దీని మించి ఇంటర్నేషనల్ ట్రాఫిక్ ఉంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చు. అంతర్జాతీయ ట్రాఫిక్ 7-11శాతం, దేశీయ ట్రాఫిక్ 6-8శాతం పెరగొచ్చని కూడా ఇక్రా తెలిపింది.



# వాణిజ్యం

# బజాజ్ ఆటో మాజీ వైస్ చైర్మన్ కన్నుమూత

**ముంబై, ఏప్రిల్ 12:** బజాజ్ ఆటో మాజీ వైస్ చైర్మన్ మాధుర్ బజాజ్ (73)మృతి చెందారు. వృద్ధాప్య కారణాల వల్ల అస్వస్థతతో ఇటీవల దక్షిణ ముంబైలో ఉన్న బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో చేరారు. చికిత్స పొందుతుండగానే శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. ఆరోగ్య సమస్యల కారణంగా గతేడాది జనవరిలో బజాజ్ ఆటో వైస్ చైర్మన్ పదవికి మాధుర్ రాజీనామా చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పారిశ్రామికవేత్త, రాజకీయ నాయకుడు జమ్నాలాల్ బజాజ్ మనవడు మాధుర్ బజాజ్. విదేశాల్లోనవిద్యనభ్యసించిన ఆయన గ్రూప్‌లోని పలు కంపెనీలకు డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్‌తో పాటు సిఐఐ, ఇతర పారిశ్రామిక సంస్థలకు అధ్యక్షుడిగా పనిచేశారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తంచేశారు. సంస్థను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు భారత వృద్ధిలో భాగస్వామ్యం అయ్యారంటూ బజాజ్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబ స్నేహితుడు కన్నుమూశారని విచారం వ్యక్తం చేస్తూ భారత్ ఫోర్జ్ సిఎండి బాబా కళ్యాణి సంతాపం తెలిపారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ చైర్మన్‌గా, చాంబర్ ఆఫ్ మరాఠ్వాడా ఇండస్ట్రీస్ అండ్ అగ్రికల్చర్ అధ్యక్షుడిగా, సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్‌నసతో భాగస్వామిగా ఆయన ఎంతో సేవలందించారని బాబా కళ్యాణి తెలిపారు.



# యుపిఐ సేవల్లో అంతరాయం

**ముంబై, ఏప్రిల్ 12:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐలో మరోసారి అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఈ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఎవరికైనా చెల్లింపులు చేస్తుంటే జరగడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో వందలాది మంది పోస్టులు పెడుతున్నారు. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్ పనిచేయడం లేదు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి దాదాపు వెయ్యి మందికి పైగా యూపీఐ సేవల్లో అంతరాయం గురించి ఫిర్యాదు చేశారు. శనివారం ఒక్కరోజే కాదు.. యూపీఐ సేవల్లో ఇటీవల తరచూ ఈ అవాంతరం ఎదురవుతోంది. దీనికి కారణమేంటన్నది తెలియరాలేదు. మార్చి 26న ఇదే పరిస్థితి నెలకొనగా, సాంకేతిక కారణంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఎన్‌పీసీఐ అప్పట్లో వివరణ ఇచ్చింది. ఏప్రిల్ 2న కూడా యూపీఐ చెల్లింపులు కొంతసేపు నిలిచిపోయాయి. రోజుల వ్యవధిలో తాజాగా మరోసారి ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సేవల్లో ఆటంకం ఏర్పడింది. దీనిపై ఎన్‌పీసీఐ అధికారికంగా స్పందించలేదు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.